# తిరుమల తిరుపతి
# క్షేత్రము-మాహాత్మ్యము

రచన

జి.టి. సూరి

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2004

**TIRUMALA TIRUPATI KSHETRAMU - MAHATMYAMU**

By
**G.T. SURI**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. 309

Re-prints : 2000, 2004

Copies : 5,000

Published by
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందుమాట

ప్రపంచంలో ఎక్కడా మరే దేవాలయానికి లేని ప్రాశస్త్యం శ్రీ వేంకటాద్రికి, శ్రీ వేంకటేశ్వరునికి ఉందనేది అందరెరిగిన సత్యం. ఉన్నతమైన ఈ దేవాలయ ప్రశస్తిని బహుముఖంగా సులభగ్రాహ్యంగా జనసామాన్యానికి కరతలామలకం చెయ్యాలనేదే ఈ గ్రంథ ప్రయత్నం.

**కృతేతు నారసింహో உభూ త్రేతాయాం రఘునందనః,**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః.**

- అని శాస్త్ర ప్రమాణం.

కృతయుగంలో నరసింహమూర్తి, త్రేతాయుగంలో దశరథరాముడు, ద్వాపరంలో వాసుదేవుడు, ఈ కలియుగంలో వేంకటేశ్వరుడు ప్రత్యక్ష దైవాలు.

ఈ కలియుగంలో భక్తసంరక్షణార్థం శ్రీ మహావిష్ణువు వైకుంఠాన్ని విడిచి తిరుమలలోని ఆనందనిలయాన్ని నెలవుచేసుకొన్నాడు. అందుకే తిరుమలను కలియుగ వైకుంఠమని అంటారు.

ఈ కలియుగ వైకుంఠమైన వేంకటాద్రి వేలుపు వేంకటాచలపతి అవతరించడానికి గల కారణం, పద్మావతీపరిణయ ఘట్టం. ఆనందనిలయ నిర్మాణం మొదలైన విషయాలన్నీ శాస్త్ర, పురాణాల ఆధారంగా ఒక క్రమ పద్ధతిలో ఇందులో వివరింపబడి ఉన్నాయి.

అనేక పురాణాలు పరిశీలించి, స్వయంగా క్షేత్ర, తీర్థాటన గావించి, యాత్రికులనుండి స్థానికులనుండి అనేక విషయాలు సంగ్రహించి 'తిరుమల తిరుపతి క్షేత్రము - మాహాత్మ్యము' అనే ఈ గ్రంథాన్ని జి.టి. సూరిగారు సులభశైలిలో రచించారు. వారికి అభినందనలు.

ఈ గ్రంథ ప్రతులన్నీ చెల్లిపోయినందువల్ల దీన్ని పునర్ముద్రిస్తున్నాం. సహృదయపాఠకులు ఎప్పటిలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాం

**కార్యనిర్వహణాధికారి**
తి.తి.దేవస్థానములు, తిరుపతి

# అవతరణిక

నాచే వ్రాయబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఎండోమెంట్ కమీషనర్ వారి అనుమతితో శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానము కార్యనిర్వహణాధికారిచే ముద్రింపబడిన "శ్రీకాళహస్తి క్షేత్రము మాహాత్మ్యము" అను గ్రంథము నేటి యాత్రికుల కెంతయు ఉపయోగకరముగ నున్నట్లు పెక్కండ్రు యాత్రికులేగాక మిత్రులును తలంచి, అట్లే తిరుమల క్షేత్రము-మాహాత్మ్యమును రచించిన తిరుమల క్షేత్రము శ్రీ వేంకటాచలపతి వృత్తాంతము మున్నగు విషయములు సాకల్యముగ యాత్రికులు తెలిసికొనుటకు అనుకూలముగ నుండు నని నన్నాపనికి ప్రయత్నింప ప్రోత్సహించిరి.

ఆ కారణమున తిరుమలలో, తిరుపతిలో కొంతకాలముండి, యాత్రికులతో కలసి మెలసి తిరిగి వారి అభిప్రాయములు కొంటిని. తిరుమల యందలి ముఖ్యతీర్థములను దర్శించితిని. తిరుపతి దేవస్థాన సత్రములందలి యాత్రికులతో వారి యాత్రావిషయములు, అనుభవములు, ఆవశ్యకములు అడిగి తెలిసికొంటిని.

వేంకటాచల మాహాత్మ్యము, అందలి ముఖ్యతీర్థములు, శ్రీ వేంకటాచలపతి భువి కవతరించుట, ఆకాశరాజు చరిత్ర, వేంకటాచలపతి పద్మావతీదేవిని వివాహమాడుట, పద్మావతీదేవి చిరుతానూరులో ప్రత్యేకముగ నుండుట మున్నగు విషయములు క్రమపద్ధతిగా యాత్రికులు తమకు తెలియు లేదనియు, తిరుమలలో ఆనంద నిలయ నిర్మాణము గావించిన విధము రచించుట మంచిదనియు చెప్పిరి. మరియు దేవస్థానమువారి "శ్రీ వేంకటాచలమాహాత్మ్యము" స్వామి చిన్మయానంద ఆమోదించిన కథాసారముగల "వేంకటేశ్వర స్వామి బొమ్మల చరిత్ర" వలన తాము కొంతవరకు క్షేత్రవృత్తాంతము, మాహాత్మ్యము తెలిసికొనగల్గితిమని చెప్పిరి. అందుచే వరాహ పురాణము, భవిష్యోత్తర పురాణము, స్కాందపురాణమునందలి వైష్ణవ కాండములను చదివి అందలి ముఖ్యాంశము లన్నింటిని గ్రహించితిని. అనుస్యూతముగా వచ్చుచున్న పూర్వికుల కథనము ప్రకారము యాత్రికుల అభిరుచుల ననుసరించి, నే నీ గ్రంథమును రచించితిని. ఇట్లు

రచించుటలో నే నెంతవరకు కృతార్థుడనైతినో పాఠకులే నిర్ణయింప గలరు. ముఖ్యవిషయములను విడువక సంగ్రహముగ కథా కథనము చేసితిని.

క్షేత్ర తీర్థ మాహాత్మ్యములకు తిరుపతి దేవస్థానమువారి శ్రీ వేంకటాచలమాహాత్మ్యమును, శ్రీ చిన్మయానందస్వాముల వారు ఆమోదించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి బొమ్మలకథ గల చిన్న పుస్తకమును కూడ చదివితిని. రచయితలకు, ప్రకాశకులకు నే నెంతయు కృతజ్ఞుడను.

ఆనందనిలయమున శ్రీవేంకటేశ్వరస్వామి లక్ష్మి, పద్మావతీ దేవుల తన యిరుగడల వక్షస్థ్సలమునం దుంచుకొని అర్చామూర్తిగా వెలయుచున్నారు. యాత్రికులు తొలుత తిరుపతిలో నున్నపుడు కపిల తీర్థమున స్నానమాడి, కపిలేశ్వరుని దర్శించి, వేంకటాచల మధిరోహించి, స్వామి పుష్కరిణిలో స్నానమాడి, వరాహస్వామిని దర్శించిన పిదపనే శ్రీ వేంకటాచలపతిని దర్శింపవలయును అనుపూర్వక విషయములను, తత్సంబంధమైన పురాణ విషయములను పరిశీలించి జనశ్రుతులను ఆకళింతకు తెచ్చుకొని యాత్రికులకు సంతృప్తి గలిగింపగల విధమున నేనీ గ్రంథమున సంగ్రహముగా వేంకటాచల వేంకటేశ్వరుల వృత్తాంతమును రచించితిని.

సంస్కృతాంధ్రాంగ్ల భాషలయందే గాక న్యాయశాస్త్రము నందును పట్టభద్రులైన నా మిత్రులు శ్రీ జి.వి. నరసింహారావు గారు ఋగ్వేదమందలి హైందవ ధర్మములను, వేదోక్తవిధిని సాదృశ్యములతో నుపన్యసింపగల మహామనీషి. ఆంధ్రవిశ్వవిద్యాలయము నుండి రాజా అయ్యర్ బంగారుపతకమును బహుమతిగా పొందిరి. వారు నన్నీ గ్రంథరచనకు ప్రోత్సహించి స్కాందపురాణమునందలి వైష్ణవకాండను ఇచ్చి నాకు కొన్నివిశేషములను దెల్పి తోడ్పడుటయే గాక ఈ గ్రంథమునకు నీరాజన మిచ్చిరి. వారికి శ్రీ వేంకటాచలపతి దీర్ఘాయురారోగ్యైశ్వర్యముల నిచ్చి రక్షించుగాక!

ఇట్లు,
సుధీవిధేయుడు,
జి.టి. సూరి.

ఓం

శ్రీ శ్రీనివాసాయ నమః

# తిరుమల తిరుపతి క్షేత్రము-మాహాత్మ్యము

* * *

## ప్రథమాశ్వాసము

*1. ప్రస్తుతి-ఉపకార్య:*

*శరణం భవ మే నిత్యం శ్రీనివాస జగత్పతే.*

శా. శ్రీమత్కోమల పాణిపల్లవములన్ జెన్నార మై పుల్కలన్
బ్రేమామోదము సంఘటించుచు అలర్మేల్మంగ యొత్తంగ సు
స్థేమారోగ్యకరంబుగా భవభయోద్రేకంబులన్ బాపుమా!
స్వామీ! మీ చరణంబులే శరణ మీశా! వేంకటేశప్రభూ!

మ. ఒకచేతన్ బదయుగ్మ మే గతిగ, మమ్మోదార్ప వేఱొక్కటన్
సకలాహ్లాదకరాభయం బొసఁగుచున్ సంతోష మేపార, వే
ఱొక యుగ్మంబున శంఖచక్రములతో నొప్పారి, యుప్పొంగు మా
మక చిత్తంబున నిల్చి ప్రోవఁగదవే! మా వేంకటేశప్రభూ!

సీ. శ్రీ వేంకటేశ్వరా! శ్రితజనమందార!
మనుజుఁడై మీసేవ మానునెవఁడు
మతభేదములు లేక సతత మెల్లరు నిన్నుఁ
జాలఁగఁ గొలువరే మేలుగనరె?
దేవతలేగాక దేశదేశంబుల
మర్త్యు లెల్లరు నీదు మఱుఁగుఁ జొరరె?
అర్చ లెన్నియొ ధాత్రి నమరియుండెను గాని
ఘనమైన మీశక్తిఁ గానవెందు

గీ. నాస్తికుండును నీ భీతి కాస్తికుండె,
తిట్టుబోతును నీయెడ తీర్థవాసి
వరద! పరమేశ! నీదు సర్వజ్ఞతాది
సుగుణజాలంబు నెఱుఁగదా చూడవలయు.

ఉత్పలమాలిక:

శ్రీరమణీయమై మిగులఁ జిత్తము రంజిల సృష్టిఁజేయుచుం
గోరెడువారికిం దనను గోరికిఁ దీరఁగఁజూడఁజేయుచున్
లేరను వారలుం గనక లేఁడనునట్లు నటించుచున్, సదా
వారికి వారికిం దగు నవారితమైన ఫలంబులం దగం
గూరిచి డస్సెనో యనఁగ గుంభిని వీడ్కొని పాలసంద్రమున్
జేరి, రమాలలామ తన సెజ్జ సుగంధములెల్లఁ జల్లుచుం
గోరికి దీర భోగములఁగూడుచుఁ బాదతలంబు లొత్తుచున్
సారపుఁ దమ్ములంబు మనసారఁగ మోవికి నిచ్చుచుండఁగాఁ
గూరుకుఁబట్టి వీచికల కుండలిశయ్యను నోలలాడు, ఓ
నీరజనాభ! విన్నపము నీకిదె! లోకము, భూమి, విత్తముల్,
దారలు, పుత్త్రపౌత్త్రులు, నితాంతసుఖంబు లశాశ్వతంబు, లీ
సారవిహీన సౌఖ్యముల సందడి నామదిఁ బొందకుండ, సం
సార పయోధి నీదుపద సారసపోతముఁబట్టి దాటఁగాఁ
గూరిమిఁ బ్రోవఁగోరితి; నిగూఢపు మాయ నదెట్లు కోరికల
సేరకయుండు చిత్తమున? చిన్మయ ఈ కలికాలమందు నేఁ
గోరెద పాదసేవయును గోరెద మోక్షము నీ భవంబునన్
సారపుఁ గీర్తియున్, దమము, సాధుల పూజయు, తీర్థసేవ, యిం
పారఁగ నీదు కీర్తనము భావి భవక్షయ మీశః సేయ, నిన్
జేరని విత్తమత్తులను, చిల్లర వేల్పులఁ గొల్వనింక, నా
నేరము లెన్నియున్న నవి నీ మహిమంబున వమ్ములై చనున్
పారెకు పారెకుం దలఁతు సారపు దైవము నీవటంచు నా
వారిని గోరనయ్య! ఇఁక వారిని మీరిన నీవ వీనికిం
దీరని బాంధవుండవుర దీనదయాళు! అమాయకుండ, నే

నేర భజింప నిన్ను నిఁక నిక్కము నిక్కము నిన్ను నమ్మి తే
తీరునఁ గాతువో తెలియ దేవ! ముకుంద! ధరాపతీ! ననున్;
భారతదేశ మంతటికి భాగ్యపురాశి, తెలుంగునాఁడు నీ
కారయఁ బ్రీతిపాత్రము మహామహిమాంచిత వేంకటేశ్వరా!
ఆరసి ప్రోవుమయ్య! మము నాదరణంబున, సర్వసౌఖ్య సం
భారముఁ గూర్చి దేశపరిపాలన ధర్మము నీతిమంతమై
భారత మిత్రదేశములు వాయని మైత్రిని అండదండగాఁ
జేరి సహాయమీయ, అరిజీబు టరణ్యము లెండి మండఁగా
భారము తగ్గి భూమి కదు పావనమై వెలగంగఁ జేయుమా!
ఓ రఘురామ! రామ! సుగుణోజ్జ్వలధామ! రమాభిరామ! ఓం.

గీ. వేంకటాద్రీశ! శ్రీశ! సర్వేశ! ఆశ
తో నిను భజియింతు ననిశ మేను ఆశఁ
దీర్పుమ పరమేశ! శ్రితసుధీ నివేశ!
ఉర్వి 'సర్వేజనా స్సుఖినో భవంతు!'

క. సద్గతి పరమునఁ జేకొన
నుద్గాఢయశమ్ము ధాత్రి నొనఁగూడుటకున్
హృద్గత దోషము వాయఁగ
మద్గురు కాందూరు కృష్ణమార్యున్ గొలుతున్.

క. పరమార్థ మొంద నెల్లరు
వరసంశయగుణము వాయ వాసిగ గీతా
భరితార్థసార తమమగు
చరమార్థముఁ దెలుపు కృష్ణ సద్గురుఁ దలఁతున్.

గీ. నన్నయాది కవివరుల నతు లొనర్చి
పోతనామాత్యు భక్తిని పొరలి పొరలి
పెద్దనాదుల కావ్యాల సుద్దు లెఱిఁగి
తృప్తిగా కవుల ఋణవుఁ దీర్చుకొంటి.

గీ. కాళిదాసుని కావ్యాలు కలవరించి
కణ్వముని పాత్రపోషణ కలను గాంచి
మేఘసందేశమందలి మేలుఁ దెలిసి
ప్రణతు లొనరింతు కవిని నా ప్రభు వటంచు.

గీ. నేఁటినవ్యసాహిత్యాన నేర్పుఁ దెలిపి
ఆంధ్ర భాషాభివృద్ధికి అదను గలుగ,
కలము సాగించు నవ్యాంధ్ర కవుల కెపుడు
ఆయురారోగ్య భాగ్యంబు లలరునట్లు,
దేవదేవుని ప్రార్థింతు దినదినంబు.

గీ. పెక్కు ప్రక్రియల తెలుంగు పెంపునొంద,
రచన గావించు యువకవి రత్నములకు
వాణి వాక్కున నిల్చి అవారితముగ
తెలుగుఁభాషను దేశాల వెలుఁగునట్లు
చేయుఁగావుత మని నేను చేతులెత్తి
మ్రొక్కుచున్నాఁడ ఓ ఆంధ్ర పూజ్యులార!

సీ. తిరుమల తిరుపతి దివ్య భూలోకాన
వైకుంఠ మనుచుండు వైష్ణవుండు
వైష్ణవమాయయే వర్ధిల్లె సర్వత్ర
తప్పించుకొనలేరు తపసులైన
పాపముల్ పోఁద్రోలి పతితుల రక్షింపఁ
బరమాత్ముఁ డొక్కఁడే స్థిర మటంచు
వేదాదు లెప్పుడో వెలయించె నీ సుద్ది
గమనింప నదనిదే గలిగె నిపుడు

గీ. హిందు ధర్మోద్ధరణమందు హీనుఁడైన
మనుజుఁ డెవ్వఁడు లేడంట మనకు మునుపు
రంతిదేవుఁడు వివరించి, శాంతిపథము
చూపె; అదిగదా మన బాట సూరులార!

గీ. స్థిరము తిరుమల తిరుపతి క్షేత్రమహిమ
జాను తెలుఁగున రచియించి సరసు లెల్ల
ముదముఁ జెందఁగఁ జేయుట మోక్ష మంచు,
వేద వేదాంతవేద్యు శ్రీ వేంకటేశు
పాద సన్నిధానంబునఁ బరమభక్తి
అంకితం బిడు దీ కృతి ఆంధ్రులార!

## 2. ప్రస్తావన:

శ్రీకరమగు తిరుమల తిరుపతి క్షేత్రము భారతదేశమునకు మండ నాయమానంబగు రత్నము. కోటి సూర్యుల ప్రకాశవంతమైన శమంతక మణివలె సప్తగిరులు జ్ఞానప్రకాశకములై వెలుఁగుచున్నవి. ఆ దివ్యజ్ఞాన ప్రకాశమే ప్రపంచ ప్రజల నాకర్షించి, వారి వారి యీప్సితముల నెఱవేర్చుచు దివ్యక్షేత్రముగ విరాజిల్లుచున్నది. తిరు-శ్రీప్రదము, శ్రీకరము, శ్రీయుత మను అర్థముగలది. మఱియు శ్రీ=లక్ష్మి, ఐశ్వర్యములే గాక, బుద్ధి, వృద్ధి, శోభార్థములను గూడ కలిగించుచున్నది. తిరుమల తమిళపదముగ నున్నను సంస్కృతము ననుసరించి శ్రీకరమైన వేంకటాచల మని పూర్వకాలమునుండి వ్యవహరింపఁ బడుచున్నది.

వేం+కట=వేం=పాపములను, కట=హరించునది-అను మహత్తరమైన ప్రసిద్ధార్థమునకు నిదర్శన మగుచున్న దీ వేంకటాచలము. తిరుపతి= శ్రీపతియైన వేంకటాచలపతి నివాసమని చెప్పక చెప్పుచున్నది. తిరుపతి వైష్ణవక్షేత్రము. తిరుపతిలో శ్రీ గోవిందరాజ స్వామి ఆలయము, శ్రీ కోదండరామాలయము ముఖ్యములు. తిరుపతికి సమీపముననే శ్రీ పద్మా వతీ దేవి ఆలయము తిరుచానూరులో గలదు. ఇట్టి శ్రీకరమైన తిరుపతులు నూటయెనిమిది గలవని పెద్దలు చెప్పిరి. కాని అన్నింట తిరుమల తిరుపతి భారతదేశమున ప్రసిద్ధమైన వైష్ణవ దివ్యస్థలము. కావుననే దేశము నలుమూలల నుండి నిత్యము వచ్చుచు పోవుచుండు యాత్రికులు ఎందరో తిరుమల తీర్థములను శ్రీ వేంకటేశ్వరుని దర్శించి ధన్యులగుచున్నారు.

సప్తగిరులమధ్య ఆనందనిలయ నివాసుఁడైన శ్రీ వేంకటాచలపతిని పూర్వమునుండి భక్తు లెందఱో సేవించి శ్రీవారి అనుగ్రహము పొంది ధన్యులై తరించుచున్నారు.

వేంకటాచలమందలి ఆలయ శిలాఫలకములందు చెక్కఁబడియున్న శాసనములవలన ఆలయనిర్మాణాదులు తెలియుచున్నవి. తొలుత నారాయణ పురము రాజధానిగా రాజ్యము పాలించిన ఆకాశరాజు ఆతని తమ్ముఁడు తొండమానుచక్రవర్తివారి తదనంతరము చోళరాజ్య మేలిన రాజులు, పిదప విజయనగరపు రాజులు, వారివెనుక చంద్రగిరిని పాలించిన వీరవేంకటపతి రాయలు, అటు తరువాత మహంతులును వేంకటాచలపతి భక్తులై ఆలయనిర్మాణాదులను, నిత్యకైంకర్యములను, ఉత్సవములను జరిపించుచు భక్తులకు వలయు సౌకర్యములను గూడఁ గావించిరి.

మహంతులలో హత్తిరాంభావాజి శ్రీవారికి పరమభక్తుఁడై, మిక్కిలి ప్రీతిపాత్రుఁడై, శ్రీనివాసుని ప్రత్యక్షముగఁ జూచుచు, మాటాడుచు, స్వామి వారితోఁ గూడ పాచికలాడుచుండె ననియు జనశ్రుతులు గలవు. పూర్వపు చెన్నరాష్ట్రమును ఆంగ్లేయులు పాలించుకాలములో వారు మహంతుభక్తిని పరీక్షింపఁ దలఁచి ఒకనాఁడు ఒక చిన్నగదిలో చెఱకుమోపులను వేసి, అందు మహంతును బంధించి మరునాఁడు తెల్లవారులోపల ఆ చెఱకు మోపుల నన్నింటిని తినవలసినట్లు మహంతునకు నియమ మొనర్చినట్లు, ఆ సమయమున శ్రీ వేంకటాచలపతి గదిలోఁ బ్రవేశించి, భక్తుని పరామర్శించి, తానొక దంతావళమై ఆ చెఱకుమోపుల నన్నింటిని ఆరగించి, భక్తుని ఆలరించి అధికారుల పరీక్షలో మహంతును విజయవంతుని చేసె ననియు, అది మొదలు లా యధికారులు శ్రీవేంకటాచలపతిమహిమ గ్రహించి, హత్తిరాం భావాజికి క్షమాపణ చెప్పుకొని తిరుమల తిరుపతి పాలనాధికార మంతయు భావాజికి వదలి తాము జోక్యము కలిగించుకొనక యుండి రనియు చెప్పుదురు. కాని 1933లో, ఆ తరువాత 1951లో మద్రాసు ప్రభుత్వము ధర్మకర్తలసంఘమును, ఆ సంఘమునకు కార్యనిర్వహణాధికారిని నియమించెను. మద్రాసు ప్రభుత్వము తిరుమల తిరుపతి ఆదాయము

పెరుగుటను చూచి, ఆ ధనము క్రమపద్ధతిలో సద్వినియోగపడుటకై, మహంతుల సర్వాధికారమును తొలఁగించి 1933 లో పాలనాసంఘము నేర్పరచి, ధర్మాదాయశాఖకు అనుబంధముగా చేసి, కమీషనర్లను, తరువాత 1951 లో కార్యనిర్వహణాధికారులను నియమించుచు తిరుమల తిరుపతికి యాత్రకువచ్చు భక్తుల కుపయుక్తమైన సత్రములు నిర్మించుచు, రవాణాది సౌకర్యములు చేయింప సాగిరి.

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ప్రభుత్వము, దేవాదాయ ధర్మాదాయశాఖను పటిష్ఠముచేసి, తిరుమల తిరుపతి క్షేత్రమున నెన్నియో సౌకర్యములు చేయుచున్నారు. క్రమముగా ఆలయ ఆదాయము పెరుగుటవలన సమర్థులైన కార్యనిర్వహణాధికారుల నియమించుచు ఎంతో అభివృద్ధిని సాధించుచున్నారు. అందుచే నేఁడు తిరుమల తిరుపతి క్షేత్రయాత్ర చాల సుఖకరముగా నున్నది.

తొలుత 1933 లో కీ॥శే॥ రంగనాథమొదలిగారు కమీషనరుగా కొంతకాల ముండిరి. ఆ తరువాత శ్రీ సి. అన్నారావు మున్నగువారు కార్యనిర్వహణాధికారులుగా పెక్కుమంది దైవభక్తితో, ప్రజాసేవా తత్పరతతో ఆలయ మర్యాదలను, యాత్రికుల సదుపాయములను దినదినాభివృద్ధి పొందించుచున్నందున భారతదేశీయులే గాక పరదేశీయులు సైతము తిరుమల తిరుపతి దివ్యక్షేత్ర సందర్శనమునకు వచ్చుచున్నారు. నిత్యము వేలకొలఁది భక్తులు శ్రీవారిని దర్శించుచున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారిగా 30-11-1978 నుండి 9-7-1982 వరకు శ్రీయుతులు పత్రి వేంకట రామకృష్ణప్రసాదు ఐ.ఏ.ఎస్. గారు--

సీ. శ్రీ వేంకటేశుని సేవఁ జేరినదాది
భక్తిప్రపత్తులు ప్రబలుచుండ
నిత్యకైంకర్యముల్ నిత్యోత్సవములట్లు
పలువిధంబులశోభ ప్రబలుచుండ

అంతకంతకుమించు నత్యంత భక్తితో
భక్తజనులయాత్ర ప్రబలుచుండ
వేలు, లక్షలు, కోట్లు ఆలయ ఆదాయ
ఫలితమ్ము లేటేట ప్రబలుచుండ

గీ. దేవదర్శనపద్ధతి దినము సులభ
ముగ లభించుచుండ ప్రజలు ముదముఁజెంద
వలయు సౌకర్యముల నెన్నొ కలుగఁ జేసె,
ప్రథమభక్తుడు శ్రీ ప్రసాద్ ప్రథితుఁ డిపుడు.

గీ. పూర్వజన్మ ఫలమదేమొ? ముదముతోడ
వేంకటేశుఁడు తనసేవ వెలయ నిట్లు
తానె నియమించుకొనె నేమొ! ధన్యుఁడయ్యె
పత్రికుల వార్ధి కువలయబాంధవుండు.

గీ. ఎందఱో కార్యకర్తలు ఇంతవరకు
నిర్వహించిరి కార్యముల్ నేర్పుతోడ
కాని అత్యంత మభివృద్ధి కలుగలేదు
ఇన్నివిధముల నభివృద్ధి సన్నుతింపఁ
గలిగె మన ప్రసాద్ పాలన కాలమందు.

గీ. దివ్య తిరుమల తిరుపతి తీర్థమైన
భూమి యనినారు పూర్వులు మునులు బుధులు
అట్టి నుడు లిపు డిట నిజమాయె ననుచు
తృప్తిఁ జెందిరి యాత్రికుల్ తృష్ణ దీర.

నిత్యశోభాయమానమైన పండుగగా శ్రీవారికి జరుగుటఁ గాంచిన యాత్రికులు శ్రమయనక, ఎంతకాలమైనను వేచియుండి క్రమపద్ధతిని నడచుకొని స్వామివారిని దర్శించి అనంతానందముఁ జెందుచున్నా రనుట నిత్యసత్యము.

తిరుమల భూలోక వైకుంఠముగఁ జెప్పుచుండిన పెద్దల మాటలు యాత్రికులు ప్రత్యక్షముగఁ జూచి అనుభూతి నొందుచున్నారు. కన్నుల

పండువుగా ఒక్కక్షణమైన శ్రీవారిని దర్శించుటకై ఎంతో దూరమునుండి వ్యయప్రయాసల కోర్చి తిరుమల యాత్రకు వచ్చిన భక్తులకు కార్య నిర్వహణాధికారి, వారి సహచరులు, ఆలయసిబ్బంది అవ్యాజానురాగమున, వారివారి పాలికార్యము లొనరించుట చేతనే నేటి తిరుమలయాత్ర సుఖ వంతముగా జరుగుచున్నది. తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రమును నిత్యము ఆబాలగోపాలము సందర్శించి బ్రహ్మానందభరితులై శ్రీ వేంకటాచలపతి యనుగ్రహమును పొంది ఇహపర సౌఖ్యము లందఁగలుగుచున్నారు.

9-7-1982 తేది శ్రీయుతులు జి. కుమారస్వామిరెడ్డి ఐ.ఏ.ఎస్ గారు, శ్రీయుత ప్రసాదుగారినుండి పదవీబాధ్యతలను స్వీకరించిరి.

శ్రీకుమారస్వామిరెడ్డి అనంతపురంజిల్లావా రైనను, పూర్వపు చిత్తూరు జిల్లా బోర్డు అధ్యక్షులుగా వాసిగాంచిన వారణాసి రఘునాథరెడ్డిగారి జామాత లగుట, వారికీ తిరుమలక్షేత్రము క్రొత్త గాదు. తన మామగారు 1942-47 ప్రాంతమున తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకసంఘమునకు అధ్య క్షులుగ నుండి ఆలయాభివృద్ధికి నాటి కార్యనిర్వహణాధికారి యగు శ్రీ సి. అన్నారావుగారి అభివృద్ధి కార్యక్రమముల నెన్నింటినో ప్రోత్సహించి నిర్వహించి యుండుటయును శ్రీకుమారస్వామిరెడ్డిగా రెఱింగినదే. కావు ననే వా రిప్పుడు కార్యనిర్వహణాధికారిగా భక్తులకు వలయు సౌకర్యము లాచరించగలరని విశ్వసించుట వింతకాదు. ఈ యుద్యోగము శ్రీ రెడ్డిగారి అభిరుచికిఁ దగినది యగుటయేకాక, శ్రీ ప్రసాదుగారి వారసులుగా శ్రీవేంకటాచలపతి ప్రేరణచేతనే ప్రభుత్వము శ్రీ కుమారస్వామిరెడ్డిగారిని నియమించెనేమో అనుటయు అతిశయోక్తి గాదు. అంతయు శ్రీనివాసుని అనుగ్రహము.

సీ. అధికారిపదవిని అందిన దాదిగా
　　　మునుపటి యభివృద్ధి పనులఁగాంచి,
　తనపాలి కార్యముల్ తడవుకొనక బుద్ధి
　　　చాతుర్యపద్ధతిన్ సత్వరముగ

*భక్తాళిముద మొందు పను లెన్నొ తలపెట్టి*
*సాగించుచున్నట్టి సరసుఁ డౌఁట*
*ప్రథమభక్తుం డౌట పాలనాధర్మంబు*
*పద్ధతు లెఱిఁగిన ప్రథితుఁ డగుట*

*గీ. ఎంచి నియమించుకొన్నావు మంచివరుని,*
*ఓజగల కుమారస్వామి తేజు రెడ్డిఁ*
*దగిన ప్రతినిధి నియమించు తరుణ మందు*
*బళిర శ్రీవేంకటేశ్వరా! భక్తిఁగొలుతు.*

శ్రీకుమారస్వామిరెడ్డిగారు పదవీబాధ్యతలు స్వీకరించిన తరువాత కొలఁదికాలమునకే భక్తుల సౌకర్యార్థము సప్తగిరిమీఁదికి ఉయ్యాలబాట, శ్రీవారికి దివ్య వజ్రకిరీటము గలిగించుటకు నిర్ణయములుచేసి సంఘ పభ్యుల ఆమోదము పొంది పనిసాగించుచున్నారు. వారి ఉద్యోగకాలమును భక్తులచే ప్రశంసనీయమై యుండుగాక!

శ్రీకుమారస్వామిరెడ్డిగారి తరువాత 25-11-83వ తేదిన శ్రీ యస్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.యస్. గారు కార్యనిర్వహణాధికారిగా అధికార బాధ్యత వహించి శ్రీ కుమారస్వామిరెడ్డిగారు మధ్యంతరమున విడిచి పెట్టిన కార్యక్రమాలను చురుకుగా జరుపసాగిరి. అందు ప్రధానమైనది శ్రీనివాసుని వజ్రకిరీటము. శ్రీలక్ష్మీనారాయణగారు శ్రీనివాసునియెడ భక్తిశ్రద్ధలతో వజ్రకిరీటమును నిపుణులగు శిల్పులచే పూర్తిచేయించి 1985, డిశంబరు 20 తేది శ్రీనివాసునికి ధరింపఁజేయు నుత్సవమును జరిపించిరి.

శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాదుగారు స్వామివారి ధ్వజస్తంభము శిలమై యుండ దానిస్థానములో నూతన చందనస్తంభమును స్థాపింప దీక్ష వహించి, కర్నాటకరాష్ట్ర ప్రభుత్వమునుండి తగినస్తంభమును తెప్పించి ఆగమశాస్త్ర నిపుణులచే, శిల్పులచే విధివిధానమున పునఃస్థాపనము చేయించువఱకు దీక్ష వహించి కార్యము నెరవేర్చిరి.

యాత్రికులకు వలయు సదుపాయము లెన్నియో ఒనర్చిరి. ఉయ్యాల బాట కొండమీఁదికి వేయుటకై శ్రీయుతులు అన్నారావుగారి కాలము నుండియు యత్నము జరుగుచునేయున్నది. శ్రీకుమారస్వామిరెడ్డిగారును ఉయ్యాలబాటకు, స్వామివారివజ్రకిరీట నిర్మాణమునకు కమిటీవారి ఆమో దమును పొందిరి. కాని కారణాంతరమున ఉయ్యాలబాటఆగినది. కాగా వజ్రకిరీటమునకై వారు విదేశములకు వెడలి మేలిమి వజ్రముల వెదకి తెచ్చి కార్యమును ఉపక్రమించిరి. యాత్రికులకు దేవస్థానమువారి తరపున ఉదారు లైన భక్తాళిచే ఉచిత భోజనము జరిపించు పథకమును ప్రవేశపెట్టినవారు శ్రీ కుమార స్వామిరెడ్డిగారే. ప్రస్తుతము ఆ కార్యము జయప్రదముగ యాత్రికులకు తృప్తికరముగ జరుగుచున్నది. ఇట్లే భోజనవసతి జరిపించు పని శ్రీనివాసుని భక్తులు నిరంతము కొనసాగింతురని ఆశించుచున్నాను. నిరంతరము చెప్పుకోదగిన మహత్కార్యము స్వామివారికి రెడ్డిగారు గావిం చిరి. ఆ పిదప వచ్చిన శ్రీయుతులు లక్ష్మీనారాయణగారు వజ్రకిరీటమును పెద్దల అనుమతిని శాస్త్రోక్తముగాస్వామివారికి శుభలగ్నమున 20-12-85 తేదిని ధరింపజేసిరి. మఱియు భక్తులకు శ్రీవారిదర్శనము సులభముగ లభించుటకై ధర్మదర్శనమునకు 25 రూపాయలు చెల్లించిన భక్తులకు, వి.ఐ.పి వారికి కొన్ని సమయములు దర్శనమునకు ప్రత్యేకించినందున భక్తులు చాల కాలము క్యూలో నిలువక శ్రీవారిని దర్శించుచున్నారు.

పైముగ్వురు గావించిన కార్యములు భావితరముల వారికి ఉపకరించ గలవు. భావిచారిత్రక పరిశోధకులకు మిక్కిలి ఉపకరించఁగలవనుట సత్యసమ్మతము.

ఇక రానున్న కార్యనిర్వహణాధికారులు నానాటికి పెరుగుచున్న యాత్రికులకు, శ్రీ శ్రీనివాసునికి కలకాలము ప్రజలు ప్రశంసించునట్లు మహోన్నతకార్యములు చేయుదురుగాక. పైవారి సేవా కైంకర్యము రానున్న వారికి ప్రోత్సాహము గలిగించి శ్రీనివాసుని అనుగ్రహమున తమ పాలి కార్య మాచరించి శ్రీ వేంకటాచలపతి అనుగ్రహమునకు వారు పాత్రు లగుదురుగాక.

## 3. క్షేత్రపుటువికి - సౌకర్యములు:

తిరుమల క్షేత్రము ఆంధ్రప్రదేశ్ దక్షిణసరిహద్దు జిల్లాయగు చిత్తూరునకు చేరినది. చిత్తూరుజిల్లాలో తిరుమల తిరుపతి శ్రీ కాళహస్తులు పురాణ ప్రసిద్ధములైన గొప్ప పుణ్యక్షేత్రములు. ఈ పుణ్య క్షేత్రములను గూర్చి కావ్యములందు మనపూర్వులు చక్కగా వర్ణించినారు. వేంకటాచల మాహాత్మ్యమును (తరికుండ) తరిగొండ వేంకమాంబ ఆంధ్రమున రచించినారు. వేంకటాచల మాహాత్మ్యమునకు ముందుగనే సువర్ణముఖీనది పవిత్రత తెలియుచున్నది. ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తిమాహాత్మ్యమును ఆంధ్రకావ్యముగా రచించెను.

తిరుపతి తిరుమల సందర్శనమునకు పలు ప్రయాణ సౌకర్యములు గలవు. మనదేశమందలి ముఖ్య రైలుమార్గములద్వారా బెజవాడ, గూడూరు, రేణిగుంట జంక్షన్నుండి, ధర్మవరం పాకాల జంక్షన్లనుండి, మద్రాసు, అరకోణం, రేణిగుంటల నుండి రైలు ప్రయాణమున తిరుపతి చేరవచ్చును. గూడూరు, రేణిగుంట, పాకాల జంక్షన్లవద్ద దేవస్థానమువారి బస్సులు యాత్రికులను, నేరుగా తిరుమలకే గొనిపోవుచున్నవి. అట్లు తిరుపతి తిరుమలఁ జేరిన యాత్రికులకు తగిన వసతులు దేవస్థానమువారు కలిగించియున్నారు. మరియు ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, హైదరాబాద్, బెంగుళూరు, మద్రాసుల నుండియు విమానయాన సౌకర్యములు గలవు. బీహారు, పశ్చిమ బెంగాలు, కాశ్మీరు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హరియాన, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళరాష్ట్రముల నుండియు, ఆంధ్రప్రదేశమందలి తిరుమల తిరుపతికి యాత్రచేయు భక్తుల నెందరినో చూడవచ్చు.

ఈ రీతిగా తిరుమల క్షేత్ర సందర్శనమునకు వచ్చు భక్తులకు తిరుపతిలో రైలుస్టేషనుకు ఇరుప్రక్కల సమీపముననే పెద్ద సత్రములు సకల సదుపాయములతో కలవు. దేవస్థానము అధికారులు యాత్రికులకు తగినట్లు సహాయపడుచున్నారు. ఆ సత్రములనుండి తిరుమలకుఁ బోవుటకు బస్సుల వసతి గలదు. కొండమీఁదను యాత్రికులకు పెక్కు

విధములైౖ సౌకర్యములు గలవు. ఉచితసత్రములు, కొన్నిదినములు క్షేత్ర మున నుండనెంచినవారికి స్వల్పమైన బాడుగ, మంచివసతులుగల కాటేజీలు, సత్రపుగదులు యాత్రికులకు కోరినట్లు లభింపఁగలవు. తిరుమలయే వైకుంఠ పురము. ఆ నగరములో ఆ మూల సౌధమే ఆనందనిలయము. ఆ యానంద నిలయ దివ్యవిమానమునకు ఉత్తరపుదిశ ఎడమభాగమున వాయవ్యమూలగా హనుమంతుని విగ్రహమునకు సమీపమునఁగల విమాన వేంకటేశ్వరస్వామి దర్శన లాలసమానసులైన భక్తజనుల భక్తిప్రపత్తున వర్ణింప వీలుకాదు. ఆ భక్తబృందమునుగాంచిన నాస్తికుఁడు క్షణము నిశ్చలముగ నిలువఁబడి చేతులు గట్టుకొని విమాన వేంకటేశ్వరునికి నమస్కరించి ఆస్తికుఁడయి గర్భాలయమున శ్రీవారిని దర్శించి, తీర్థ ప్రసాదముల నతిభక్తితో స్వీకరించి, పవిత్రుఁడైనట్లు భావించి, ధ్వజస్తంభము దగ్గర సాగిలఁబడి నమస్కరించి, కనులనుండి ఆనందబాష్పములు స్రవించుచుండ లేచి ధ్వజస్తంభము పై భాగమును జూచి నమస్కరించి, ప్రశాంత చిత్తముతో వెడలిపోవుటను గాంచిన క్షేత్రపు మహిమ యెట్టిదో తెలియనగును.

దేశము నలుదిక్కులనుండి రైలు ప్రయాణముచేసి గూడూరు రేణి గుంట, పాకాల రైలుకూడలి చేరిన యాత్రికులను సరాసరి తిరుమలకుఁ గొనిపోవుటకు దేవస్థానమువారి బస్సులు ప్రతిగంటకు సిద్ధముగ నున్నవి. అందుచే కాశ్మీరము నుండి కన్యాకుమారి వరకు, పశ్చిమబెంగాల్ నుండి మహారాష్ట్ర గుజరాతు (బొంబాయి) వరకు గల సువిశాల భారతదేశము నుండి నిత్యము యాత్రికులు తిరుపతి తిరుమలచేరి శ్రీవారిని సేవించి ధన్యులగుచున్నారు.

తిరుమల చేరిన భక్తుల విడిదికి సత్రములు గలవు. తలనీలాలు సమర్పిం చుటకు తగినవసతులు దేవస్థానమువారు గావించియున్నారు. తలనీలాలు తీసికొనినవారు స్వామిపుష్కరిణిలో, లేదా దేవస్థానము వా రేర్పాటుచేసిన వేడినీళ్ళగదులలో (రుసుము చెల్లించి) స్నానమాడి దేవాలయ ప్రాకార ప్రదక్షిణము చేయుచు పుష్కరిణి వాయవ్యమూలనున్న వరాహస్వామివారి దర్శనము చేసికొనిన పిదప శ్రీవారిదర్శనమునకు క్రమపద్ధతిలోచేరుట

అనాదిగా వచ్చుచున్న సంప్రదాయము (ముం దీవిషయమై విపులముగ తెలుపఁబడును). అట్లు స్వామివారిని దర్శించిన భక్తులు, ఒకటి రెండు దినము లుండి గోగర్భము, ఆకాశగంగ, పాపనాశన మాదిగాఁగల దివ్యతీర్థ ముల స్నానము చేసి, సంతృప్తిఁజెంది, తాము క్షేత్ర తీర్థ సందర్శనమున పాప పరిహారము గావించుకొని శ్రీవారికృపకు పాత్రులైనట్లు ఆనందించుట పరంపరగా వచ్చుచున్న అనుభూతి.

భారతదేశము ఆధ్యాత్మికమైన దేశము. భగవంతుని పెక్కు అవతా రములకు నిలయము. వేదవేదాంగాది బహుశాస్త్రపురాణముల విభజించి రచించిన మహర్షుల జన్మభూమి. యోగులకు, జోగులకు, సిద్ధులకు పుట్టిన యిల్లు. పెక్కు కావ్యనాటకాదులు రచించిన మనీషులకు, మహనీయులకు, జన్మభూమి. ఆర్యనాగరికతకు, పునీత సంస్కారమునకు మేటి నిలయము. ఆయా కాలమందలి ప్రజల మనోభావములకు అనుగుణముగా తత్త్వశా స్త్రిముపదేశించి, ప్రజలను సన్మార్గవర్తనులనుగా దైవచింతనగలవారినిగా, సర్వమానవ సోదర భావము, సర్వజనుల సుఖము నాశించు విశాలహృద యులుగా తీర్చి దిద్దిన శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్యులఁ గన్నతల్లి పవిత్ర భారతమాత. పసిఫిక్ మహాసముద్రమువలె విశాలమై, అంతుతెలియని అగాధమైన హైందవధర్మములు చెక్కుచెదరని దీ భారతదేశము.

కురుపాండవుల చరిత్రకారణముగా మానవధర్మములకు,అష్టాదశ అధ్యా యములతో సర్వమతసహనముగల భగవద్గీతకు పట్టుకొమ్మ మనదేశము. భగవద్గీత పెక్కు దేశ భాషలందు తర్జుమా చేయఁబడి సకల ప్రజామోద మందుటే మన ఆధ్యాత్మిక తత్త్వము అమూల్యమని తెలుపుచున్నది. మానవుల కావశ్యకమైన ఆధ్యాత్మిక జ్ఞానోదయమును గలిగించు మనదే శమున పెక్కు దివ్యక్షేత్రములు తీర్థములు గలవు. ఇవి యన్నియు అగాధమైన హైందవోన్నతిని వేలకొలఁది సంవత్సరములుగా యుగచతుష్ట యమున చాటుచున్నవి. యుగధర్మము ననుసరించి చరిత్ర యెన్నివంపులు తిరిగినను, చెఱకునందలి తీపి తరుగునట్లు హిందూ ధర్మతత్త్వము సర్వమానవ శ్రేయోదాయకముగ నుండుటచేతనే జాతిమత భేదములు లేక

మానవు లెల్లరు భూలోక వైకుంఠమగు తిరుమల తిరుపతి క్షేత్రమును సందర్శించుటకు కుతూహలాయత్త మానసులై ఉద్వేలముగ నిత్యము వచ్చుచున్నారు.

తిరుమల క్షేత్రమును, తీర్థములను సేవించిన భక్తులు తిరుపతికి వచ్చి సత్రములలో విడిదిచేసి, శ్రీగోవిందరాజస్వామిని, శ్రీకోదండ రామ స్వామిని, తిరుచానూరులో శ్రీపద్మావతి అమ్మవారిని, మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారిని, నాగులాపురం శ్రీవేదనారాయణస్వామి వారిని, నారాయణవనము (పురము) నందు తొలుత పద్మావతీదేవిని వివాహమాడిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని, ఆయా స్థలవిశేషములను కన్నులపండువుగా చూచి యానందింతురు.

మానవుఁడు కష్టసుఖములను, దారిద్ర్యమును, భోగభాగ్యాలను ఎన్ని అనుభవించినను, కడపట తాను సంపాదించిన ధనధాన్యాది పుత్త్రపౌత్త్రాది సంపదకంటె శ్రేష్ఠమైనది, తనవెంట పరమునకు రాఁదగినది ఆధ్యాత్మిక జ్ఞానసంపద ఒక్కటియే. అట్టి జ్ఞానసంపద బడయుటకు క్షేత్ర, తీర్థ సందర్శనము, సజ్జనసాంగత్యము, పారమార్థిక చింతనము, శాంతియుత నిశ్చలమనోజీవితము సాధనములు.

అట్టి సాధనసంపత్తి గలిగించుటయందు తిరుమల తిరుపతి క్షేత్రాధిపతి శ్రీ వేంకటాచలపతి అధికుఁడు. కలియుగమందలి ప్రజల ఆర్తి బాపి, వారిని తరింపఁజేయుటకే విష్ణువు వైకుంఠము వీడి, వేంకటాచలము (క్రీడాద్రి) చేరి, అట ఆనందనిలయ దివ్యవిమానముక్రింద వేంచేసియున్నారు. అందుచేతనే తిరుమలక్షేత్రము భూలోక వైకుంఠమైనది.

కృతే తు నరసింహో ౽భూ త్త్రేతాయాం రఘునందనః,
ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః.

అను శ్లోక మా భావమును నిరూపించుచున్నది. వేంకటాచల మాహాత్మ్యము పురాణములఁ బ్రసిద్ధిగ నున్నను, ఆ భగవంతుఁ డిప్పటికి ఎందరినో భక్తుల నాదరించుచు, నలరించుచుండుట నిత్యసత్యము.

కలియుగమున పాపము ప్రబలి ధర్మధేనువు ఏకపాదమున నడచునని పెద్దల వాక్యము. పాపపంకిలమైన ఈ కలియుగమున రీతి, నీతి, ధర్మము, సత్యము, దయాదాక్షిణ్యములు అగోచరములై, తద్వ్యతిరేకములు బలసి ప్రజలు కామక్రోధాదులకుఁ జిక్కి ఉక్కిరి బిక్కిరి యగుచుండ, భక్తరక్షకుఁడైన వైకుంఠవాసుఁడా ప్రజల కలిబాధలనుండి రక్షింప, కార్యకారణములను గల్పింప "అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు"న లక్ష్మీదేవితో నేకాంతముగ శేషతల్పమున నుయ్యాల లూఁగుచు, దీర్ఘాలోచనాపరుఁడై యోగ నిద్రయందున్న సమయంబున, భృగుమహర్షి నారదోపదేశంబున త్రిమూర్తులలో ముక్తి ప్రదుండగు సత్త్వగుణప్రధానుని పరీక్షింపనుద్యుక్తుఁడగుట వేంకటాచల మాహాత్మ్యమునకు ప్రస్తావన యగుచున్నది.

## 4. శ్రీవేంకటాచల మాహాత్మ్యము (వృత్తాంతము):

*కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయా మంజనాచలమ్,*
*ద్వాపరే శేషశైలం తు కలౌ శ్రీవేంకటాచలమ్,*
*నామాని యుగభేదేన శైలస్యాస్య భవంతి హి.*

ఈ పవిత్ర వేంకటాచల వృత్తాంతము, వరాహపురాణము నందును, భవిష్యోత్తరాది పురాణాదులందును వివరింపఁబడియున్నది. ఆ పురాణములన్నియు మనుజుల మనుగడను సుఖమయ మొనర్చుటకే వ్రాయఁబడిన వనుటలో అతిశయోక్తి లేదు. మానవుని కలికాల భ్రమలనుండి తప్పించును. మనవు లాదిగ ధర్మయుతముగఁబాలించిన పునీతభారతదేశము పుణ్యస్థల మన్న ప్రసిద్ధి నిలుపుటకు ఉపయుక్తములైన సంస్కారములఁ దెల్పు నిర్మలదర్పణములు ఈ పురాణములు. సూతమహర్షి బహుపురాణవేత్త. వేదవేదాంగాది సకల శాస్త్రముల భావములు బోధింపఁగల మహామహోపాధ్యాయుఁడు. మానవ కళ్యాణమును ఆశించి మహామునులగు శౌనకాది మహాత్ములకుఁ బురాణగాథలు చెప్పు నెపమున మనకు జ్ఞానోదయమును గలిగించు చున్నాఁడు. మహాత్ములకు లోకమే కుటుంబము గదా! ఆ కుటుంబ రక్షణమే తమ ధ్యేయము. ఆ యాశయసిద్ధి కా మహాత్ములు పురాణ శాస్త్ర కావ్య నాటకాదుల నెన్నింటినో రచించినారు.

కృత త్రేతా ద్వాపర కలియుగముల 43,20,000 సంవత్సరముల పరిమాణముగల మహాయుగముగ వ్యవహరింపఁ బడుచున్నవి. ఆయా యుగము లందు, వైకుంఠమునుండి భూలోకమునకు గరుడునిచే చేర్చఁబడిన క్రీడాద్రికి ప్రసిద్ధములై సార్థకములైన వృషభాద్రి, అంజనాద్రి, శేషాద్రి, వేంకటాద్రి, గరుడాద్రి అను నామములు గలిగినవి.

కృతయుగమున వృషభాద్రియే వృషాచలముగ వ్యవహరింపఁబడినది.

## వృషభాద్రి వృత్తాంతము:

లీలావినోదియైన సృష్టిసూత్రధారుఁడు తన విలాసార్థము వైకుంఠము నందలి మహామేరువు పుత్త్రుఁడైన క్రీడాద్రిని సకల మహీరుహములతో, సకల పుష్పఫల లతాగుల్మ వృక్షములతో, సెలయేళ్ళతో, జలాశయములతో నిర్మించుకొనెను. ఆ అద్రి వివిధ మృగ పక్షికులంబులకు నివాసమయ్యె. వివిధమృగముల అరపులు, పక్షుల మధురకూజితమోఁలు, నెమళ్ళనాట్యము వినఁగనే నానందదాయకముగ నుండును. ఆయా ఋతుధర్మముల ననుసరించి క్రీడాద్రి పుష్ప ఫల మనోహరమై శోభాయమానముగ నుండును. వివిధ సుగంధ మిళితములైన చల్లగాలులకు మురిసి మహావిష్ణువు లక్ష్మీదేవితోడి సల్లాపములతో సంతోషముగ విహరించుచుండును. ఆ యానంద దంపతుల కా క్రీడాద్రి సార్థక నామధేయమైన ఆనందాద్రిగా నొప్పినది.

లోకశ్రేయ మాశించిన ఆ పరమాత్మ భక్తరక్షణార్థము భూలోకమున అవతరింపఁదలంచి వైకుంఠక్రీడాద్రిని ఆనందాద్రిగా భూలోకమున భరత దేశమునందు తూర్పు సముద్రతీరమునకుఁ బడమర సువర్ణముఖినదికి ఉత్తరమున నుండునట్లు నెలకొల్ప గరుడుని నియమించెను. స్వామి యాజ్ఞను దాసుఁడు క్షణములో నొనర్చెను.

కృతయుగమున వృషభుఁడను రాక్షసుఁ డా యద్రిం జేరి జలాశయముల స్నానమాడి తన యిష్టదైవమగు నారసింహ సాలగ్రామమును పూజించుచు తపమాచరించుచుండెడివాఁడు. కాని పుట్టుకతో వచ్చిన అసురగుణమును వీడక, ఆపర్వత పరిసరముల తపమాచరించు మునులను

వేధించుట విడువలేదు. ఆ వృషభుని బాధలు సహించలేని మునీశ్వరులు విష్ణు దేవునిగూర్చి తపమాచరించి, ప్రత్యక్షమైన విష్ణుదేవునికి తమబాధలనుగూర్చి నివేదించుకొనిరి. వారి మొరాలించిన శ్రీపతి వృషభునిచే నిత్యపూజితమగు నారసింహ సాలగ్రామమునందు తన దివ్యరూపమును జూపెను. వృషభుం డా దివ్యరూపమును గాంచి, సంతోషించి, నమస్కరించి, పెక్కువిధముల సంస్తుతించెను. వాని భక్తి ప్రపత్తులకు సంతోషించిన వైకుంఠవాసుండు వృషభుని వరము కోరుకొమ్మని చెప్పెను. వెంటనే వృషభుండు తనతో విష్ణువు కయ్య మొనర్చుటే తన కోరికగాం జెప్పెను. శ్రీహరి ఆతని ఆశయము నెఱవేర్ప, వృషభుని బలపరాక్రమములను మించి తననేర్పు జూపెను. వృషభుండా దేవుని బలశౌర్యములకు మిక్కిలి సంతోషించి తన తుదికోర్కెగా "స్వామీ! తమ దివ్యచక్రాయుధముచేత నన్ను ఖండించి, మోక్షమిచ్చి ఈ పర్వతమునకు నా పేరు గలుగు నట్లు అనుగ్రహింపుడీ" అని ప్రార్థించెను. శ్రీపతి వాండు కోరిన ట్లొనర్చె. అది మొద లా యానందాద్రికి వృషభాద్రి యని పేరు గలిగెనని ఇతిహాసము.

ఆ రీతిగా వైకుంఠమందలి క్రీడాద్రి భూలోకమున ఆనందాద్రిగా వెలసి వృషభుని మూలమున వృషభాద్రి యైనది.

త్రేతాయుగమున అంజనాదేవి వాయుదేవుని గూర్చి ఆ వృషభాద్రి యందు తప మాచరించి, ఆ దేవుని వరప్రసాదమున అజేయుండయిన ఆంజనేయుండను పుత్త్రుని గనెను. అంజనాదేవి తప మాచరించి యిష్టార్థ సిద్ధి బొందిన పర్వత మగుటచేత అంజనాద్రి యని ప్రఖ్యాతిగాంచెను.

ద్వాపరయుగమున ఆ యానందాద్రికి శేషాచలమని నామము గల్గుటకు ఒక ఇతిహాసము గలదు.

శ్రీ మహావిష్ణువు తన "వైకుంఠపురములో, నా మూలసౌధంబులో" రమావినోదియై యున్న సమయంబున, సౌధద్వారమున ఆదిశేషుని కావలి పెట్టి యుండెను. అప్పుడు మలయాచలాధిపతి అయిన వాయువు శ్రీపతి దర్శనార్థమై వైకుంఠమున కేతెంచి, నగరిలో అంతఃపురములోని

"ఆ మూలసౌధంబు" నఁ బ్రవేశింప నున్నప్పుడా ద్వారరక్షకుఁడు శేషుఁడు లోనఁ బ్రవేశింపరాదని వాయుదేవుని అడ్డగించెను. బలవంతుఁడ నన్న అహంభావమున వాయుదేవుఁడు శేషుని మాటలు లెక్కింపక, తన కవసరమైన పని యున్నదనియు, తన్ను అడ్డగింప వలదనియు చెప్పి ద్వారము సమీపించెను. అప్పుడు శేషుఁడు శ్రీహరి యాజ్ఞను, తన ధర్మమును వినిపించి ధర్మదండముతో నాతనిని సింహద్వారము దాట నియ్యక అడ్డగించెను. అందులకా వాయుదేవుఁడు తీవ్రకోపమున "మునుపు సనక సనందనుల అడ్డగించి శాపగ్రస్తులైన జయవిజయుల వృత్తాంతము మఱచితివా? ఇఁక నన్నుద్రేకింపఁ జేయకు" మని భీష్మించి ద్వారప్రవేశమున నొక యడుగు ముందుకు వేసెను. కాని, శేషుఁడు స్వామి యానతి నెఱవేర్ప వాయుప్రయత్నమును విఫలము గావింప, వాయువు తన పట్టు వీడక హుంకరించి నెట్టుకొని ముందుకు పోసాగెను. ప్రభువు నానతి శిరసా వహించుట సేవకుల ధర్మమని యెంత నయమున చెప్పినను, వాయువు తన బలగర్వంబున శేషుని మాటలఁ బెడచెవిని పెట్టి బలప్రదర్శనమునకు సిద్ధపడెను.

అంత వాయువును శేషుఁడును సమఉజ్జీభావమున పోరాడఁ జొచ్చిరి. ఆ పోరాటమును శ్రీదేవి కనుగొని తన ప్రియున కెఱిఁగించెను. వెంటనే యది యంతయు గ్రహించిన విష్ణుమూర్తి వాయుదేవుని గర్వభంగమునకు అది మంచి సమయమని గ్రహించి లోనుండియే శేషుఁడా! ఆ యలజడి యేమని యడిగెను. అంత నా యాదిశేషుఁడు జరిగిన వృత్తాంతమును జెప్పచుండ శ్రీహరి మెల్లఁగా ద్వారసమీపమునకు విజయము చేసెను. వాయుదేవుఁ డా భగవానుని గాంచగనే సాగిలపడి నమస్కరించి లేచి, పెక్కు విధముల దేవదేవుని సంస్తుతించి చేతులు కట్టుకొని తలవంచి వినయవినమితగాత్రుఁడై నిలుచుండెను. అప్పు డా యాది దేవుఁడు వాయు దేవుని అనునయించున ట్లిట్లనియెను. "బలవంతుఁడు తానే అనుకొను శేషునితోడ నీ కీ వాదులాటయేల?" అనునంతలో ఆదిశేషుఁడు నారాయ ణుని పలుకు లాలించుటతో ఈషత్ గర్వముద్రేకింప, జ్ఞానవైరాగ్యసంపదలలో తన కీ యేడుజగంబుల జోడు లేడని పౌరుషోక్తు లాడెను. అప్పు డా

వైకుంఠవాసుఁడు శేషవాయువుల గర్వశాంతికి సమయ మాసన్నమైనదని తలంచి "పౌరుషము కార్యరూపమునఁగాని వ్యక్తముగాదు. కావున మీ మీబలముల నిరూపించుకొనుట కొక మార్గము. భూలోకమున నా క్రీడాద్రి ఆనందాద్రిగ, వృషభాద్రిగ, అంజనాద్రిగ వ్యవహరింపఁబడుచున్నది. శేషుఁడా! నీ వా యద్రిని చుట్టుకొని నీ బలము చూపునది. ఈ వాయుదేవుఁడు నీచే చుట్టఁబడియున్న ఆ పర్వతమును చలింపఁజేయ వలయును. అప్పుడు మీలో నెవరు బలవంతులోఁ దెలియఁగలదు." నా విని శేషుఁడు వెంటనే భూలోకమున కేగి, ఆ యానందాద్రిని, తన మూఁడు యోజనముల వెడల్పును, ముప్పదియోజనముల పొడవును గల శేషరూపమును పెంచి చుట్టుకొనియుండెను. వాయుదేవుఁడును తన ప్రభంజన రూపమును పెంచి, అమితోత్సాహమున ఆ యానందాద్రిని శేష సహితముగఁ గదలింప యత్నించి విఫలుఁ డయ్యెను. బ్రహ్మాదిదేవతలు, మహర్షు లీ వింతవివాదమున ఎవరు విజయము సాధింతురో యని రెప్పవాలని కన్నులతోఁ జూచుచుండిరి.

ఇట్లు శేషవాయువు లిరువురు బలప్రదర్శనమున పట్టువీడక రోషము పెచ్చు పెరుగ హుంకార ఝుంకారములతో పెనఁగులాడు చుండిరి. దాన లోకమునకెట్టి ముప్పు వాటిల్లునోయను నట్లుండుటను గ్రహించి, బ్రహ్మ వాయుదేవుని ప్రయత్నము మానుకొమ్మని చెప్పెను. కాని వాయువు పట్టువీడఁడయ్యె. అప్పుడు దేవత లందరు శేషుని విరమించుకొను మను టచే శేషుఁ డా ఇంగితమును గ్రహించి కొంత పట్టు సడలింపఁగనే వాయు వా పర్వతమును కుప్పించి లేవ నెత్తి పైకి విసరెను. అప్పుడు మహామేరువు తనకు పుత్రభిక్ష పెట్టుమని దీనముగ వాయుదేవుని ప్రార్థింప, ఆ సంప్రార్థన మాలించిన వాయు దేవుఁడు శేషయుత క్రీడాద్రిని స్వర్ణ ముఖీ నదీతీరమునకు ఉత్తరదిశ మునుపుండినచోటనే పదిలముగ నిల్పెను. అప్పుడు బ్రహ్మాదిదేవతలు నారాయణుని అభిమతము ప్రకారము క్రీడాద్రి సువర్ణముఖీ నదీతీరపు టుత్తరభాగాన నిల్పుటకే శేషవాయువులకు వివాద ముత్పన్నమైనదని తలంచి నారాయణుని భావికార్యమునకుఁ దగినట్లు శేషయుత క్రీడాద్రి శేషాచలమని ప్రసిద్ధినొందుగాక! అనునంతలో, శేష

వాయువులు తమ వివాదముల మఱచి, లోక శ్రేయస్సునుదలంచి తమ పట్టువీడి, మిత్రభావమున ఒకరి నొకరు సంభావించుకొనిరి. అదిమొదలు శేషాచలమన్న పేరు సార్థకమగున ట్లా పర్వతశ్రేణి నెల్లూరుజిల్లా రాపూరు తాలూకాలోని పెంచలకోన ఆ పైభాగముననుండి సన్నగా నిటారుగా తోఁకవలె, అటనుండి మెలికలు దిరిగి సర్పాకారమున తిరుమలవరకు వ్యాపించి, తిరుమల మొదటి గాలిగోపురము సమీపమున పడగ పైకెత్తి నట్లుండుట గమనింపఁదగిన విషయము.

భూభార మడంప ద్వాపరయుగమున శ్రీకృష్ణావతార మెత్తిన భగవానుని యవతార సమాప్తితో కలియుగము ప్రారంభమైనది. కలుషముఖంబైన కలియుగంబున భక్తరక్షణాసక్తుఁడైన వైకుంఠ వాసుఁడు వేంకటాచలపతి యని ప్రథితుఁడై క్రీడాద్రిని వెలసి, పూర్వము వేదవతి ప్రార్థననెఱవేర్ప పద్మావతిగా జన్మించిన యామెను వివాహమాడి, తిరుమల భూలోక వైకుంఠముగ నొనర్చెనన్న పురాణకర్త వాక్యములు నేఁడు నిత్యసత్యములుగ నున్నవని భక్తులు తలంచుటతిశయము గాదు.

ఆ క్రీడాద్రి శ్రీ వేంకటేశ్వరుని ఆనందనిలయముగ నుండుట చేతనే వేంకటాచలమన్న పేరు కలియుగమున వ్యవహరింపఁబడు చున్నది. వేంకటాచలాధిపతి శ్రీ వేంకటేశ్వరుఁ డనియు విదితమగు చున్నది.

వేం+కట+అద్రి=పాపముల హరింపఁజేయు పర్వతమని భావము. మఱియు, 'వేం'శబ్దము అమృతబీజము; (కటం) కటము=బంగారు; అను నర్థమున, అమృత ఐశ్వర్యముల యుతమైనది దీ వేంకటాచలము=తిరుపతి కొండయని పెద్దల అభిప్రాయము. మానవు లీ వేంకటాచలదర్శన మాత్ర మున తమ పాపముల పరిహార మొనర్చుకొని ఇహపరసుఖములఁ బొందుదు రనుట మనపూర్వుల నమ్మకము. ఆ నమ్మకము నేటివరకు భారతీయు లందేగాక పరదేశవాసులందును నిలుచుటచే వారు వేంకటాచలయాత్ర గావించుచున్నారు. వేంకటాద్రి కొన్ని శ్రేణులుగా నున్నది. ముఖ్యముగ సప్తగిరియని ప్రసిద్ధి గల్గి యున్నను వరాహపురాణము ననుసరించి కొన్ని సార్థకనామములను గల్గి యున్నది.

తిరుమల సందర్శనమున భక్తులు తలంచిన కార్యములు ఫలించుటచేత చింతామణీ యని, దర్శనమాత్రమున జ్ఞానదాయకమగుటచేత జ్ఞానాద్రియని, సమస్త పుణ్యతీర్థములు గలది యగుటచేత తీర్థాద్రియని, పుణ్యప్రదమైన స్వామిపుష్కరిణీ గలది యగుటచేత పుష్కరాద్రి యని, కనకవర్ణము గలిగియుండుటచేత కనకాద్రి యని, పూర్వము నారాయణుఁడను భక్తుఁడు, తప మాచరించి శ్రీవిష్ణుదేవుని సాక్షాత్కారము పొందియుండుటచే నారాయణాద్రి యని, గరుడునిచే వైకుంఠమునుండి భూలోకమునకు గొనిరాఁబడుటచేత గరుడాద్రి గను, శ్వేతవరాహస్వామి ఇందు నివసించియుండుటచేత వరాహాద్రిగను, శ్రీనివాసుని నిలయమగుటచే శ్రీనివాసాద్రియని, శ్రీ వేంకటేశ్వరుఁ డిట నవతరించుటవలన వేంకటాద్రి యని, ఇట్లు భక్తులు తమ అనుభూతుల ననుసరించి పెక్కు పేళ్ళ ఆనందాద్రి (క్రీడాద్రి)ని తలంచుచుండుట విశద మగుచున్నది.

ఈ రీతిగా తిరుమలకు నాలుగు యుగములందును ప్రసిద్ధిగలిగినది. చక్కెరతో ఎన్నివిధములైన పాకములు చేసినను దాని తీపి గుణము చెడని విధమున శ్రీ వేంకటాచలమును ఎన్నినామముల స్మరించినను పాపహరణమై, పవిత్రతగలిగి భగవంతుని అనుగ్రహమునకు మానవులు పాత్రులగుచుండుట ముమ్మాటికి సత్యము.

వేంకటాచలమందలి వేంకటేశ్వరుని లీలావిలాసములను, భక్త పాలనాసక్తిని వరాహపురాణమునను, స్కాందపురాణమునను, భవిష్యోత్తర పురాణమునందును విపులముగఁ బ్రశంసించు కొన్ని ప్రకరణములు గలవు. అందు వేంకటాచల వృత్తాంతము, అందలి తీర్థములు వాని మహిమలు తెలుపఁబడియున్నవి. అవి యన్నియు శ్రీవారివిశేషముల గూర్చి చాటుచున్నవి. కలియుగమున మానవులకు తీర్థసేవ ముక్తిప్రదమైనదని చెప్పక చాటుచున్నవి.

ఈ కలియుగమున శ్రీ వేంకటాచలపతి కోరినవారి కొంగు బంగారమై, పిలిచిన వారికి 'ఆఁ' అని ప్రత్యుత్తర మిచ్చి, అడిగిన వారికోరికల నిచ్చుచుండుటయు సువిదితము. శ్రీవేంకటేశుని దివ్యమంగళస్వరూపమ్మును

చూచిన వెంటనే ఆ మూర్తి భక్తుని హృదయఫలకమున నిలచి, తన్మయత నొక్కక్షణమైనఁ గలిగించుచుండుననుట సత్యము. ఆ శ్రీనివాసుని మహిమ భక్తు లెందఱో యనుభవించిరి. అనుభవించుచున్నారు. ఇంకను అనుభవానందమును పొందఁ గలరనుట సర్వజనైకవేద్యము. కావుననే తిరుమల తిరుపతి భూలోకవైకుంఠము. పరదేశీయులుకూడ శ్రీవారిమహిమఁ దెలిసి, తమ దేశములందును శ్రీవారికి ఆలయములు నిర్మించుకొని సేవించుచున్నారు.

## వేంకటాచలమందలి దివ్య తీర్థములు:

శ్రీవేంకటాచలమున దివ్యతీర్థము లనేకములు గలవు. ఆ తీర్థము లన్నియు పవిత్రములు, సార్థక నామధేయములు. మానవులు ఆ తీర్థముల దర్శించి, స్నానమాడి, పవిత్రు లగుటకు అవి జగదీశునిచే నెల కొల్పఁబడి నవనిన అతిశయోక్తి గాదు. 'ఆళ్వారుతీర్థము', 'పూలబావి' భక్తులచే నిర్మితములు. స్వభావసిద్ధముగ నేర్పడిన జీవనదు లట్లు, అవి నిత్యాపములై యున్నవి. అందు యాత్రికుల యందుబాటుననుండు కొన్నింటిని వివరింతును.

## 1. కపిలతీర్థము:

ఈ కపిలతీర్థము శేషాచలమునకుఁ గ్రిందిభాగమున సప్తదశ తీర్థముల సమ్మేళనమై యున్నది. భక్తులు వేంకటాచలపతిని దర్శించుటకు ముందు ముఖ్యముగ కపిలతీర్థమున స్నాన మొనరించి, కపిలేశ్వరుని దర్శించుకొని, ఆ మీఁద శేషాచలపర్వతారోహణము చేయుట పూర్వాచారము.

పూర్వము ఉత్తరదేశమునుండి కొందరు మహారాజులు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శింప వేంకటాచలయాత్రకు వచ్చుచుండ, మార్గ మధ్యమున మాధవుఁడను నిత్యాగ్నిహోత్రి, పూజాదికముల నొనర్చు వైదిక శిఖామణి కామాతురుడై, కుండల యను పరస్త్రీని బలాత్కారముగ భోగించి, కడకామె మరణానంతరము బుద్ధి వికలింపఁగా ఆ యాత్రికులతోఁ గలసి పయ

నించి ఒకనాటి రాత్రి వారితో తిరుపతి చేరెను. మరునాటి ప్రాతఃకాలమున అందరు కాలకృత్యములు దీర్చుకొని, కపిలతీర్థమునకుఁ బోయి స్నానమాడి, పితరులకు తర్పణ పిండ ప్రదానము లతిభక్తితో నాచరించిరి. వారిని చూచి మాధవుఁడును కపిలతీర్థమున స్నానముచేసి, ఆ మహారాజులవలె తాను పిండ ప్రదానము చేయలేకున్నను, శ్రద్ధతో మృత్తికా పిండప్రదానము గావించి పితౄణము తీర్చుకొని పవిత్రుఁ డయ్యెను. అతని పితరులును తరించి స్వర్గమువకుఁ బోయిరి. అందుచే కపిలతీర్థమున స్నాన మాచరించి పితరులకు పిండప్రదానము చేసిన ఉభయతారకముగా నుండు ననుట వ్యక్త మగుచున్నది.

యాత్రికులతో మాధవుఁడును ఆ రాత్రి కపిలేశ్వరుని సేవించి కపిల తీర్థమున నిద్రించెను. కొంతతడవు మాధవుఁడు నిద్రించి మేల్కొని తమస్సువీడిన బాలభానునివలె తేజోవంతుఁడై వేంకటాచలపతి దర్శనాభి లాష ప్రేరేపింప వెంటనే తా నొక్కఁడే శేషాచలమెక్కి పోవుచుండెను. అతని భవితవ్య మెఱిఁగిన బ్రహ్మాది దేవతలు మార్గమధ్యమున మాధవుని గలసికొని సంభావించి "అయ్యా! నీ పాపపంకిలము కపిలతీర్థ స్నానమున ప్రక్షాళితమైనది. ఇఁక నీవు వేంకటాద్రిచేరి శ్రీవేంకటాచలపతి నివాసమైన చింతచెట్టునకు సమీప మందున్న స్వామిపుష్కరిణీ తీర్థమున స్నానమొనర్చి ఆ పుష్కరిణీతీరమునఁగల వరాహస్వామిని సేవించి, తదుపరి శ్రీవారిని దర్శింపుము. నీ జన్మ ధన్యమగును. మరియు జన్మాంతరమున చోళరాజు లలో చంద్రవంశమున ప్రసిద్ధుఁడగు సుధర్ముఁడను రాజునకు పుత్త్రుఁడవై జన్మించి చోళరాజ్యమును పాలింతువు. అప్పుడు మహాలక్ష్మి సదృశురాలైన పుత్త్రిక నీకు లభించును. ఆమెవలన శ్రీవేంకటాచలపతి నీకు జామాత కాఁగలఁడు. నీ వా స్వామికి పరమభక్తుఁడవై కన్యాదానము చేసిన పుణ్యం బున చిరకాలము రాజ్యపాలన చేసి, కడపట తనువు చాలించి, పరమ పదప్రాప్తి నందుదువు" అని అతని భవిష్యత్తు నెఱింగించి తిరోహితులైరి.

మాధవుఁ డా దేవతల మనంబున స్మరించి వారు పోయిన దిక్కునకు తిరిగి నమస్కరించి లేచి వా రాదేశించినట్లు స్వామిపుష్కరిణీస్నానము,

వరాహస్వామి దర్శనము తొలుత నొనర్చి శ్రీ వేంకటాచలపతిని సేవించి కడపట శ్రీవేంకటేశ్వరునకు మామగా దేవత్వమును బొందెనను ఇతిహాసము గలదు. దానిచేఁ గపిలతీర్థ మహిమ తెలియుచున్నది. అందుచేతనే తిరుమల యాత్రికులు, తొలుత కపిలతీర్థమున స్నానమాడి, పితృాణము తీర్చుకొని, రాత్రి కపిలేశ్వరుని దర్శించి, ఆ రాత్రి యచ్చట గడపి తదుపరి వేంకటాచల మధిరోహించి, స్వామిపుష్కరిణీ స్నానము, వరాహస్వామి దర్శనము చేసికొనిన పిమ్మట శ్రీవారిని దర్శించుట పూర్వ ముండిన పద్ధతి. ఇప్పుడు సత్రములు, రవాణాసౌకర్యము లున్నందున యాత్రికులు బస్సులలో తిరుపతినుండి నేరుగా తిరుమలకే పోవుచున్నారు. కాని దేవస్థానమువారు కపిలతీర్థమున యాత్రికులకుఁ దగు సదుపాయములు గల్గించుచు, వారి నాకర్షించుటకై ఎన్నో ప్రయత్నములు గావించుచున్నందున, ముందు ముందు కపిలతీర్థము భక్తుల కనుగుణముగ నభివృద్ధి పొందఁగలదని యాశించుచున్నాను.

పూర్వము కపిలమహర్షి శేషాచలముక్రింద ఆశ్రమము నిర్మించు కొని తప మాచరించుచుండెను. అప్పుడు పాతాళమున తాను పూజించుచుండిన శివలింగమే భూమిని భేదించుకొని ఉపరిభాగమునకు వచ్చిన దనియు, శ్రీవేంకటాచలపతి పద్మావతుల వివాహమునకు వచ్చిన దేవత లందరు తమ తమ నివేశములకుఁ బోవుచుండ, పరమేశ్వరుఁడు పార్వతీసహితుఁడై కపిలాశ్రమమునకు వచ్చి, మహర్షిని అనుగ్రహించి కపిలతీర్థముకడనే కపిలేశ్వర నామంబున వెలసినట్లు పురాణము పేర్కొనుచున్నది. ఇప్పుడును తిరుమల తిరుపతి దేవస్థానములవారు, తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి తెప్పతిరునాళ్ళు ప్రతి సంవత్సరము అతివైభవముగ జరిపించుచున్నారు. భక్తు లీ సదవకాశమును వినియోగించుకొనుట ఇహపరసాధన మగును.

కపిలతీర్థమునకు పై భాగమున శక్రతీర్థముగలదు. ఆ తీర్థస్నానమున దేవేంద్రునకు గౌతమమహర్షికృత శాపవిమోచన మయ్యెనని యందురు. దానికి మీఁదుగా విష్వక్సేనతీర్థము గలదు. వరుణుని పుత్త్రుడైన విష్వక్సేనుఁడా తీర్థమున స్నానమాడి, తీరమున గొప్పతప మాచరించి విష్ణుభగవానుని

దర్శించి, అతని యనుగ్రహమున శ్రీహరి సేనాధిపతి యయ్యె ననియు నందురు. ఇట్లా తీర్థమున కెగువ నెగువ పంచాయుధతీర్థము, అగ్నితీర్థము, బ్రహ్మతీర్థము, సప్తర్షితీర్థములు గలవు. ఇట్లా వేంకటాచల తీర్థములు ఉత్తరోత్తరము అధికాధిక ఫలములనిచ్చుచు కపిలతీర్థమునఁ గలియుచు న్నవి. కావున ముఖ్యముగా భక్తు లీ దీర్థదర్శనము, స్నానము ఒక రాత్రి నిద్రచేయుట పూర్వాచారము. ఈ తీర్థముల మాహాత్మ్యము ఈ క్రింది కథవలనను తెలియుచున్నది.

పూర్వము వేదవేదాంగాది సకలశాస్త్ర ప్రవీణుఁడైన భక్తుఁడొకఁడు ప్రపంచమందలి దివ్యతీర్థముల సందర్శింపఁ గోరిక గలిగి భగవంతుని నిశ్చల ముగ ధ్యానించుచు నిద్రించెను. ఆ రాత్రి నాల్గవజామున శ్రీమహావిష్ణువు శంఖచక్రాది పంచాయుధధారియై సాక్షాత్కరించి, "వత్సా! నీ యభిమతము తెలిసికొంటిని. ఏండ్లు పూండ్లు పట్టు ప్రపంచతీర్థయాత్ర ఈ జన్మలో పూర్తి కానేరదు. కావున నీవు వేంకటాచలమందలి ప్రసిద్ధతీర్థముల కృత స్నానుండ వైతివేని త్రిలోక తీర్థములందు స్నాన మొనరించిన ఫలితమును పొందఁగలవు" అని చెప్పి అంతర్ధాన మయ్యెను. వెంటనే యా భక్తుఁడు మేల్కని స్వామిని స్తుతించి, వేంకటాచలయాత్రఁ జేయ బయలుదేరి కపిల తీర్థ మాదిగా గల దివ్యతీర్థముల స్నానమాడి మహాపుణ్య మార్జించె ననియు జనశ్రుతి. వేంకటాచలమందలి పెక్కుతీర్థముల సమ్మేళనము కపిలతీర్థము.

## 2. స్వామి పుష్కరిణీతీర్థము:

తిరుమలలో శ్రీవారి ఆనందనిలయమునకు ఉత్తరమున కొంత ఈశాన్య భాగమున స్వామిపుష్కరిణి గలదు. ఆ పుష్కరిణికి వాయువ్య భాగమున శ్రీవరాహస్వామి ఆలయము గలదు. వైకుంఠవాసుఁడు తన క్రీడాద్రిని భూలోకమం దుంచుటకు గరుడుని ఆదేశించినప్పుడే, గరుడుఁడు స్వామి పుష్కరిణినిగూడ భూలోకమునకుఁ గొనివచ్చెనని పురాణమునఁ జెప్పఁబడియున్నది.

ఈ పుష్కరిణి శ్రీవైకుంఠవాసుఁడు భూదేవులతో జలక్రీడ లాడుటచేత పవిత్రతీర్థమైనది. ఆకాశగంగాజలంబు అంతర్వాహినియై స్వామి పుష్కరిణి

తీర్థమై, సకల తీర్థములకు స్వామిగ నున్నదందురు. సకల తీర్థములం దత్యంతపవిత్రమై సర్వదా మహిమోన్నతమై ఉన్నది. ఈ తీర్థమును స్మరించి, దర్శించి అందు స్నానము లాచరించిన వారికి సర్వసిద్ధులు సమకూరునని వరాహపురాణము పేర్కొనుచున్నది.

స్వామి పుష్కరిణీస్నానం సద్గురోః పాదసేవనమ్,
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్.

స్వామి పుష్కరిణీస్నానము, సద్గురుని పాదసేవ, ఏకాదశీవ్రతమను నీ త్రయము సామాన్యులకు లభింపవు.

వైకుంఠ ఏకాదశినాఁడు భక్తులు శ్రద్ధాభక్తులతో స్వామి పుష్కరిణిలో స్నాన మొనర్చి, శ్రీవారిని దర్శించి వైకుంఠద్వారమార్గమున స్వామివారికి ప్రదక్షిణము చేయుచుండుట ఇప్పుడును కన్నులపండువుగ జరుగుచున్నది.

ఈ పుష్కరిణి మహిమలను వివరించు గాథలు గలవు. వానిలో శంఖణుఁడు, ఆత్మారాముఁడను వారిని గూర్చి తెలిసికొందము.

పూర్వము చంద్రవంశపువాఁడైన శంఖణుఁడను రాజుండెను. అతఁడు తనకు పిత్రార్జితమై సంక్రమించిన సాంకాశ్యమను రాజ్యమును పాలించు చుండెను. కొన్నాళ్ళకాతని సామంతులందరు ఏకమై రాజ్యము నాక్రమిం చుకొని, బంధుమిత్రామాత్య పరివారసమేతముగ రాజును రాజ్యమునుండి తరుమగొట్టిరి. అంత నా శంఖణుఁడు పరితాప మొంది అందరిని వెంట నిడుకొని దక్షిణదిశగా యాత్రసాగించి రామేశ్వరము చేరి, సముద్రస్నాన మొనర్చి కొంతకాలముండెను.

తదుపరి ఉత్తరముగాఁ బ్రయాణించి దక్షిణకైలాసము చెంత సువర్ణ ముఖరీనదిని గాంచి, అందు తీర్థమాడి శ్రీకాళహస్తిపరమేశ్వరుని జ్ఞానప్రసూ నాంబను సేవించి అచట కొంతకాలముండెను. రాజ్యభ్రష్టుఁడై నందుల కా రాజు లోలోనఁ గ్రుంగుచు తదేకచింతతో నుండ ఒకనాటి వేకువను అశరీరవాణి "ఓ రాజా! విపత్కాలమున ధైర్య మవలంబించుట మానవుల విధి. దిగులుచెంది [illegible]తమాత్రాన కార్యములు గావు. ధై[illegible]లక్ష్మిని

విడువనివారు విజయలక్ష్మీయుతు లగుట తథ్యము. కాన నీవు విచారింపక ధైర్యసాహసముల చిక్కఁబట్టి ఇచ్చటికి సమీపమందున్న వేంకటాద్రిని అధిరోహించి, అందున్న స్వామి పుష్కరిణియందు శుచివై స్నాన మొనర్చి శ్రీపతిని స్మరించుచుంటి వేని నీ రాజ్యము నీకు తప్పక లభింపఁగలదు. కావున వేగమే యిందుండి కదిలి వేంకటాచలము చేరి, స్వామి పుష్కరిణిని దర్శించి, స్నాన మొనర్చి కృతార్థుఁడ వగుము" అను నుడులు వినినదే తడవుగ రాజు భగవంతుని స్మరించుచు లేచి సపరివారుఁడై వేంకటాచల యాత్ర సాగించి, వికసితపద్మ మనోజ్ఞమైన పుష్కరిణిని చేరి, ఆ తీర్థ మున ఆశ్రమము నిర్మించుకొని, పుష్కరిణీస్నానము, శ్రీ వేంకటాచలపతి దర్శనము గావించుచు ఆరుమాసములు గడిపెను.

ఆ పిదప ఒకనాటి ప్రాతఃకాలమున శంఖణుఁడు పుష్కరిణీతీరమున జపమాచరించుచుండ సరోవర మధ్యభాగమున శ్రీ భూదేవు లిద్దరు చెరి యొక ప్రక్కనుండ మధ్యందిన మార్తాండుని దివ్యప్రభలతో మహావిష్ణువు ప్రత్యక్షమై భక్తుని మనోరథం బెఱింగి, "వత్సా! భక్తిశ్రద్ధలతో స్వామి పుష్కరి ణియందు స్నానమాచరించిన కారణమున, నీపూర్వ పాపసంచయము నశించి నీవు శుచిర్భూతుండవైతివి. ఇఁక నీరాజ్యము సుఖముగా పాలింతువుగాక? భక్తియుక్తులై ఈ స్వామి పుష్కరిణిలో నిత్యము స్నాన మొనర్చినవారు స్వామిత్వమును పొందుదురు" అనుచు నదృశ్యుఁ డయ్యెను.

అధోక్షజుని అనుగ్రహము గలిగిన శంఖణుఁడు సపరివారముగ తన రాజ్యమునకు ప్రయాణమై పోవుచుండ తన్ను నిదివరలో రాజ్యమునుండి తరుమగొట్టిన సామంతరాజులు తమలోఁ దాము పోరాడుకొని కడకు అందరు రాజ్యమును వీడి వెడలిపోవుటను, మార్గమందు తన ప్రజల వలనఁ దెలిసికొని శ్రియఃపతి యనుగ్రహమున శత్రునిర్ముక్తమైన రాజ్యము తనకు నిరవద్యముగ లభించుట కెంతయు ముదమంది, వైకుంఠవాసుని భక్తిప్రపత్తులతో నారాధించుచుఁ దన ప్రజలను కన్నబిడ్డ లట్లు సుఖముగాఁ బాలించి కడపట అమరలోకమున కేగెను.

తీర్థముల కన్నింటికి స్వామియగుటయేగాక శ్రద్ధాభక్తులతో దనను సేవించినవారికి స్వామిత్వమును గూడ ప్రసాదించునది యగుటవలన స్వామిపుష్కరిణి యను నామంబు సార్థకనామమైనదని పౌరాణికుల యభిప్రాయము.

ఆత్మారాముం డను ఉత్తమ శీలవంతుఁడు, విష్ణుభక్తుఁడై నిత్యము శ్రీనివాసుని నిండుమనంబున ధ్యానించుచుండును. ఇట్లు కొంతకాలమున కాతని పిత్రార్జిత మంతయు హారతికర్పూర మట్లు కరగి హరించిపోయెను. కడ కతనికి తిండికే కష్టమాయెను. తన వలన మేలుపొందిన వారైనను ఆతని లేమిడి చూచి అండఁజేర్చి ఆదరించినవారు లేరు. అంత నా యాత్మారాముఁడు విధి బలీయమైనదని భావించి, వేంకటాచలయాత్రకు బయలుదేరెను. తొలుత కపిల తీర్థమును దర్శించి, స్నానమాడి, కపిలేశ్వరుని సేవించి తిరుమలపై కెక్కుచు, అందునందుఁగల తీర్థముల ద్రుంకుచు పోయి పోయి స్వామి పుష్కరిణీ దరిఁజేరెను. ఆ పుష్కరిణీ దర్శనమాత్రాన ఆతని పూర్వసంచిత పాపపంకిల మెండిపోయినది. అప్పుడాతఁడు ఎట్టివారి కిగాని, తాము చేసిన కర్మఫల మనుభవింపక తీరదనుటను, స్వానుభవమున గ్రహించి, పెద్దలసూక్తు లెప్పటికిని సత్యసమ్మతములని తెలిసికొని, ఆ పుష్కరిణీదర్శనముచేత తనకెంతో సుజ్ఞాన ముత్తేజితమైనదని భావించి భక్తజన పోషకుండైన భగవంతుని పలువిధముల ప్రస్తుతించుచు, ముప్పూట లా స్వామి పుష్కరిణీస్నాన మాచరించుచు ఆ సమీపముననే నివాస మేర్పరచుకొని, ఆ చుట్టుప్రక్కల లభించు కందమూలములతో, పండ్లతో కాలము గడపుచుండెను.

ఒకనాఁడా యాత్మారాముఁడు కందమూల ఫలంబుల కొఱ కా వేంకటాద్రిని చరించుచు, సమీపమందలి గుహలో తపోనిమగ్నుఁడై యున్న సనత్కుమారు ఁడను యోగీంద్రుని గాంచి, వినయ వినమిత గాత్రుఁడై మెల్లఁగ సమీపించి, సాష్టాంగ నమస్కారము లొనర్చి, లేచి, చేతులు గట్టుకొని తలవంచి నిలుచుండెను. కొంతతడవైన పిమ్మట "స్వామీ! యోగీంద్రా! తమ దివ్యతేజస్సు నా పూర్వ పాపాంధకారమ[illegible] [illegible]ల

గించినది. వెలుఁగుఁగాంచఁగల్గితిని. నన్ననుగ్రహించి, మీశరణుఁ జొచ్చిన నన్ను మీ శిష్యునిగా భావించి సదుపదేశముఁ జేయఁగోరుచున్నాఁడను"--

అనునంత నా దివ్యముని, నిమీలిత నేత్రంబుల నాతని పూర్వ వృత్తాంతమును దెలిసి, "ఓయీ! పూర్వజన్మముల సర్వపాపముల హరించి ముక్తినియ్యఁగల వాఁడొక్క నారాయణుఁడే. ఆ నారాయణుని మఱచి పూర్వజన్మమున భోగలాలసుఁడవై యుంటివి. ఆ పాపఫల మనుభవింపక తప్పదు. సంపద భోగములకే యని తలంచక త్యాగమునకు నియ్యఁబడినదని తలంపకున్న పాపమే మిగులునది. ఇప్పుడు జ్ఞానోదయము గలిగిన నీవు గతమును మఱచి భవిష్యత్తును యోచించి, నిశ్చలమైన భక్తితో స్వామి పుష్కరిణిలో స్నానమాడిఁ జగన్మాతయగు మహాలక్ష్మిని స్తుతించుచుందు వేని, నీ వా తల్లి యను గ్రహమున సుఖివై పరమపదము చేరఁగలవు" అనుచు నా మహర్షి మాయ మయ్యెను.

అంత నాత్మారాముఁడు ఆశ్చర్యానందముల నొంది యోగీంద్రుని యుపదేశమును చక్కగా నాకళింతకు తెచ్చుకొని, మునుపటి కంటె నెక్కుడు శ్రద్ధాసక్తులతో పుష్కరిణియందు స్నానమొనర్చి తీరమునఁ గూర్చుండి తప మాచరింపసాగెను. ఇట్లుండ నొక నాఁడా పుష్కరిణీ తీరమున, పంచాయుధములతో, శ్రీభూదేవులతో దివ్యాభరణాదులతో, కమ్మ పరిమళముల నెదఁజల్లు పుష్పహారములతో వైకుంఠవాసుఁడు ప్రత్యక్షమై ఇట్లనియెను. "భక్తా! పుష్కరిణీ స్నానమున నీ పాపపరిహారమైనది. సత్పు రుషుని దర్శన భాగ్యమున జ్ఞానవంతుఁడవైతివి. లక్ష్మీదేవిని నిశ్చలభక్తితో సంతోషింపఁ జేసితివి. కావున నిఁక నీవు దీర్ఘాయురారోగ్యములతో మహదైశ్వర్యమును అనుభవించి పరలోకసుఖమునుగూడ పొందఁగలవు అని నుడివి అంతర్ధాన మాయెను. ఆత్మారాముని ఆనందమునకు అంతము లేకపోయెను. ఆనందమున కనులలో నీరుగ్రమ్మ, కంఠము గద్గదికచెంద కొంతవడి ఆకాశమువైపు చూచుచు, పలుమారు భగవానుని దలంచి నమస్కరించుచు "ఈ జన్మమున పుణ్యము లెన్ని చేసియుండినను పూర్వసంచిత పాపఫల మనుభవింపక తప్పదు" అని అనుకొనుచు తన నివాసమునకుఁజనెను.

ఆత్మారాముఁడు పూర్వపుణ్య శేషంబునఁ బిత్రార్జితసంపద ననుభవించి, అతిథుల నాదరించి, శాస్త్రజ్ఞాన మార్జించినను, పూర్వజన్మ పాపకర్మంబున కష్టము లనుభవించెను. పుణ్యతీర్థ క్షేత్రదర్శన భాగ్యంబున, సత్పురుష సందర్శనమున, హితబోధ ననుష్ఠించుటవలన సకలసంపదాకరుఁడు, సకలైశ్వర్య ప్రదుఁడునగు నారాయణుని అనుగ్రహమునకు పాత్రుఁడై చరితార్థుఁ డయ్యెను.

"ఏష స్సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణ" అన్న వేదవాక్య భావమును ఆత్మారాముని వృత్తాంతము బలపఱచుచున్నది. చతుర్విధ పురుషార్థములలో ధర్మార్థకామములను గాటి ప్రధానముగ మోక్షమును గోరువారు నారాయణునే కోరి భజింతురు. ఆ నారాయణుఁడే కలియుగ వైకుంఠవాసుఁడు, శ్రీ వేంకటేశ్వరుఁడు, తిరుమలక్షేత్రనివాసి. మోక్షమున కుపాశ్రయము శ్రీనివాసుఁ డొక్కఁడే. సద్గతికి నీ పుడమిలో భక్తిమార్గమును మించినది వేఱులేదు. ఒక వేళ శ్రీనివాసుని భక్తియోగంబునకు విఘ్నమొదవినను, మఱియొక్క జన్మములో నా జీవాత్ముఁడు విష్ణుపదంబుఁ జేరఁ గలఁడు. తీర్థక్షేత్ర దర్శనము ముక్తిసాధనము.

## 3. ఆకాశగంగా తీర్థము:

స్వామి పుష్కరిణీతీర్థమునకు ఉత్తరభాగమున మహావృక్షములతో, లతాగుల్మములతో, నానావిధ పుష్పఫలభరితములైన వృక్ష సముదాయముతోఁ గూడిన ఎత్తైన కొండబండలు ఎడనెడఁ గలవు. ఆ దట్టమైన అరణ్యమున వన్యమృగంబులు విచ్చలవిడిగా పూర్వము సంచరించుచుండె నందురు. అటనొక ఎత్తైన పర్వతసురంగ మార్గము నుండి క్రిందికి నిరంతరము జలము ప్రవహించుచునే యుండును. ఆ జలధారయే ఆకాశగంగ. ఈ ప్రవాహము పర్వతపు లోభాగమునుండి ప్రవహించుచు భూమి కవతరించుచున్నది. ఇందు దివిజ గంగా జలంబులు మిళిత మగుచుండు నందురు. ఇదియు మిక్కిలి పవిత్రమైన తీర్థము.

పూర్వము గౌతమీతీర గ్రామమందు సజ్జనసమ్మతుఁడు, సకల శాస్త్ర పురాణధర్మము లెఱింగిన పండితుఁడు, ధర్మశీలి, సత్కులజాతుఁడు, మాతాపితృగురుదైవతంబులం దత్యంత భయభక్తులుగలవాఁడు, పిత్రార్జిత మగు స్థిరచరాస్థుల ననుభవించుచు, అతిథుల నాదరించుచు, మిక్కిలి యుత్తముఁడని వాసిగాంచిన గృహస్థుఁడుండెను. ఒకనాఁడా తని యింటికి అభ్యాగతుఁ డొకఁడరుదెంచెను. అనాఁడు గృహమేధి ఇంట పితృశ్రాద్ధ మగుటచే నాతనిని శ్రాద్ధమునకు నిమంత్రించెను. గృహస్థు కడు భక్తిశ్రద్ధలతో పితృశ్రాద్ధక్రియులు జరిపి, దక్షిణతాంబూలంబులతో నతనిని సంతృప్తుని గావించి సాగనంపెను. ఆ పిదప కొంతకాలమున కా పుణ్య శీలునకు ముఖము క్రమముగా మార్పుచెందుచు, కడ కాతనికి గార్ధభాననము సంప్రాప్త మయ్యెను. అట్లగుట కా యుత్తముఁడు చింతించి, తరణోపాయ మన్వేషించుచు కృష్ణా పెన్నా నదుల స్నాన మాడుచు, అచట నచటఁగల క్షేత్రముల దర్శించుకొనుచు సువర్ణముఖీ తీరమునఁగల అగస్త్యాశ్రమముఁ జేరెను. [ఇప్పు డా యాశ్రమము తిరుపతినుండి చిత్తూరునకు పోవుమార్గ మున చంద్రగిరికి సమీపమునఁగల తొండవాడ గ్రామమునకు ఉత్తరముగ సువర్ణముఖీ నదీతీరమున అగస్త్యమహర్షిచే స్థాపింపఁబడిన ఈశ్వరాలయ ముగ ప్రసిద్ధిగాంచి యున్నది.] అట మునిపుంగవుల మధ్య తేజోధికుఁడై కూర్చుండియున్న అగస్త్యమహాముననిని గాంచి, నమస్కరించి, వినయ విధే యతలతో నిలుచుండి, దన యుదంత మెఱింగించి, తన వికృతా ననముఁ బాపుమని ప్రార్థించెను. అంత నా మహాముని కొంతతడవు సమాధి నిమగ్నుఁడై యుండి తనతపోమహిమవలన నాతని వృత్తాంతమెఱింగి, పితృ శ్రాద్ధమునకు అపుత్రకుని నియమించిన దోషంబున నట్టి ముఖ మేర్పడెనని చెప్పి మరల కొంతతడ వాలోచించి "వత్సా! నీవు సకల శాస్త్రపురాణంబుల నెఱింగితివి. సర్వసద్గుణంబులు గలిగియున్నాఁడవు. శాస్త్రజ్ఞానముతో పాటు అనుభవజ్ఞానముగూడ కలిగియుండవలెను. తనకుఁ దెలియని విషయములను పెద్దలవలనఁ దెలిసికొనుట మంచిది. దివ్యతీర్థములు మహిమోన్నతములై యున్నయవి. ఇచ్చటికి ఈశాన్యముగ మూఁడు క్రోసుల దూరమున వేంకటాచలము గలదు. అందు స్వామిపుష్కరిణి యను పుణ్యతీర్థ మున్నది.

నీ వా వేంకటాచల మధిరోహించి, స్వామిపుష్కరిణిని చేరి, భక్తిశ్రద్ధలతో నందు స్నానమాడితివేని నీ దోషము నివారణమగును. ఆ పుష్కరిణీ తీరమందున్న వరాహస్వామిని దర్శించి అచ్చటికి ఉత్తరదిశనున్న ఆకాశగం గాతీర్థములో కృతస్నానుండ వైతివేని నీ ముఖరూపము పూర్వము వలె నుండును. కావున వేగముగా వేంకటాచలమునకుఁ బొమ్ము" అని దీవించి పంపఁగా ఆ సజ్జనోత్తముఁడు మౌనీంద్రుని యానతిప్రకారము వేంకటాచల మెక్కిపోయి స్వామిపుష్కరిణిలో స్నానమాడి వరాహస్వామిని దర్శించి, ఆకాశగంగాతీర్థమునఁ గ్రుంకులిడి దోషవిముక్తుండై గార్దభముఖము తొలఁగి పూర్వముఖస్థితి గల్గుటచే, ఆకాశగంగా తీర్థమహిమను గొనియాడుచు, కొన్నాళ్ళట నివసించి తదుపరి తన యూరు చేరెనను జనశ్రుతులును గలవు.

పూర్వము అంజనాదేవి కేసరి యను వానరోత్తముని వివాహమాడి, ఎంతకాలమునకు సంతు లేనందున వంతఁ జెంది, మతంగ మహామునిని దర్శించి తనకు సంతానప్రాప్తికిఁదగు మంత్రముపదేశింపుమని ప్రార్థించెను. మతంగుఁ డామెభక్తికి మెచ్చి, "అమ్మా! వైకుంఠ క్రీడాద్రి భూలోకమున స్వర్ణముఖరీనదికి నుత్తరభాగమునఁ గలదు. అందు స్వామిపుష్కరిణి గలదు. ఆ పుష్కరిణిలో స్నానమొనర్చిన సర్వదోషములు పరిహారమగును ఆ పుష్కరిణీతీరమున వరాహస్వామి గలఁడు. ఆయన దర్శనమున నీప్సితార్థములు నెఱవేఱఁ గలవు. ఆ పుష్కరిణికి నుత్తరమున దివ్య పర్వతారణ్యము గలదు. ఆ పర్వతాగ్రమునుండి ఆకాశగంగానది ప్రవహించుచున్నది. ఆ నదిలో స్నానమాడిన పవిత్రతయేగాక ఆయురారోగ్యములు కల్గును. నీవు నిశ్చలమనస్సుతో వాయుదేవునిగూర్చి ఆకాశగంగాతీరమున తప మాచరింపుము; ఆ వాయుదేవుని వరప్రసాదమున నీకు మహాబలపరాక్రమ శాలియైన సుపుత్త్రుఁ డుదయింపఁ గలఁడు" అని వాయుదేవుని జపింపఁదగు మంత్ర ముపదేశించి పంపెను. అంజనాదేవి భూలోకక్రీడాద్రి చేరి మునీంద్రుని యుపదేశమనుసరించి స్వామిపుష్కరిణీ స్నానము వరాహస్వామి దర్శనము చేసి, ఆకాశగంగా తీర్థమున స్నానమొనర్చి మహాదీక్షతో వాయుదేవుని గూర్చి భక్తితో తపమాచరించెను. కొన్నాళ్ళకు వాయుదేవుఁడు ప్రసన్నుఁడై

ఆమె కోరిన వరము నిచ్చి వెడలిపోయెను. ఆ వరప్రసాదమున అంజనాదేవి అంజనేయుఁడను గొప్పబలశాలియైన పుత్త్రుని గనెను. ఆమె తపమా చరించిన ఆ క్రీడాద్రికి అంజనాద్రి యను పేరు త్రేతాయుగమునుండి ప్రసిద్ధముగ నున్నట్లు పురాణము దెల్పుచున్నది. ఆకాశగంగాతీర్థము సర్వపాపముల హరించి ఆయురారోగ్యైశ్వర్యముల నొసంగుటయే గాక సంతానము లేనివారా తీర్థము కడ వ్రత మాచరించిన సంతానము గల్గు ననుటకు అంజనాదేవి యితిహాసము దెలుపంబడినది.

ప్రతిసంవత్సరము చైత్రమాసమున చిత్తానక్షత్రయుక్త పూర్ణిమనాఁడు ఆకాశగంగలో స్నానమాడి తమ యిష్టదైవమును గూర్చి వ్రత మాచరించిన వారికి సంతానము కలుగునని తెలియుచున్నది.

## 4. పాపనాశన తీర్థము:

పాపనాశనతీర్థము సార్థకనామధేయము గలది. తనలో స్నాన మొన ర్చిన వారి పాపమో యనునట్లు ఆ జలముపైని తేలుచు పోవుచుండు కల్మషపు మరకలను జూడవచ్చును. ఈ పాపనాశనతీర్థము స్వామి పుష్కరిణికి నుత్తరదిశ పర్వతపులోయలలో నొక పర్వతము నందున్న ముఖ్యతీర్థములలో నొకటి. తిరుమలనుండి పాపనాశనమునకుఁ బోవుటకు సౌకర్యముగా దేవస్థానమువారి బస్సులు గలవు. యాత్రికులు పాపనాశన తీర్థమున స్నాన మొనర్చి, తమ పాపపరిహార మొనర్చు కొనుచున్నారు. పడమటి పర్వతము నానుకొని కొంత కొండభాగము చదరముగా ముందుకు వచ్చియున్నది. ఆ పైభాగమునుండి ధారలుగా నీరు క్రిందికి ప్రవహించుచుండును. దేవస్థానము వా రచ్చోటను యాత్రికుల కవసరమైన వసతులు గలిగించి యున్నారు. అచటి ప్రకృతి రామణీయకమును జూచి యానందింప వలయునేగాని వర్ణింపతరము గాదు. మహావృక్షములు మిట్టమధ్యాహ్నమందు చల్లని నీడల నిచ్చుచున్నవి. ఆ తీర్థసందర్శనమాత్రాన భక్తులు భగవంతుని దివ్యసృష్టి మహిమలగూర్చి తలపోయుచు ఆస్తికత్వమున భగవానుని నిశ్చలముగ ధ్యానించుచుండుట అనుభవైక వేద్యము.

ఈ తీర్థమహిమను తెల్పు పురాణకథ యొకటి గలదు.

పూర్వము భద్రమతి యను వేదవేదాంగాది సకల శాస్త్ర పురాణసంవేది యొకఁడుండెను. అతఁడు విద్యావినయసంపన్నుఁడు. సరస్వతీపుత్త్రుఁడైనం దున లక్ష్మీకటాక్షము లేకపోయెను. ఏ వృత్తియులేదు. దారిద్ర్యము సంపూర్ణముగ సంక్రమించియుండెను. అతని రూపయౌవన విద్యాదిక ములఁ జూచి కృత, సింధు, యశోవతి, కామిని, మాలిని, శోభయను వా రాఱుగురు అతనిని వివాహమాడిరి. వారియందు భద్రమతికి మిక్కిలి సంతానముకూడఁ గలిగెను. దరిద్రునకు సంతాన మధికమను టాతని యందు నిరూపింపఁబడినది. ఎట్లో జీవయాత్ర సాగించుచుండెను. క్రమక్రమముగ ఆలుబిడ్డల పోషించుటనునది అతని కొక సమస్య యైనది. ధనహీనుని ధనికు లాదరించనందుననే "ధనమూల మిదం జగ" త్తను నానుడి గలిగినది. విద్యా వివేకశూన్యుఁడు పూర్వపుణ్యంబున ధనవంతుఁ డయ్యేనేని వానిని లోకులు గౌరవించుట పరిపాటి. ఏ కొందఱో విద్యావంతులు సిరిసంపదలతో నుండవచ్చు. అది వారి పుణ్యవిశేషము. కాని నిత్యదారిద్ర్యముచేత బాధపడు వా రెందఱో గలరు. వారు పరధనాపేక్ష లేనివారు. తమ విద్యాసారమును దెలిసిన మహారాజులు కొందరే విద్యావంతుల పోషించినారు. రాజ సన్మాన మాశించినవారును కొందరు గలరు. కాని భద్రమతి సన్మానముల నాశించక స్వార్జితమై లభించు గంజిమేలని తలంచువాఁడు. భార్యాపుత్రుల పోషింప నితరుల యాచింపలేక, ఆత్మగౌరవంబును వీడలేక ఎట్లో బాధపడుచు కాలము గడుపుచుండెను.

దినదినమున కీ సంసారభార మెక్కువగుచుండెను. శరీరపాటవము తగ్గుచుండెను. ఇదియంతయుఁ దలపోసి ఒకనాఁ డా భద్రమతి చింతా క్రాంతుఁడై యున్నతఱి కామిని యను భార్య భర్తవిచార హేతువును గ్రహించి, అతనిని సమీపించి అనునయముగ మాట్లాడుచు నిట్లనియెను. "ప్రియా! నా చిన్నతనమున ఒకనాఁడు యతీశ్వరుం డొక్కఁడు మాతం డ్రితో మాటల సందర్భమున వేంకటాచలమందు పాపనాశన మను తీర్థ

మున్నదనియు, అందు స్నానమాడినవారి పాపములు తొలఁగి వారు లక్ష్మీ కటాక్షమునకు అర్హు లగుదురనియు స్నానమొనర్చి భూదాన మొనర్చినవారు సకలైశ్వర్యయుతులై సర్వసుఖముల ననుభవింతు రని ఆ తీర్థమాహాత్మ్యమును దెల్పెను. కావున మీరా తీర్థయాత్రగావించి లక్ష్మీయనుగ్రహము పొందుటయే మీ సమస్యకు పరిష్కారము" అన విని భద్రమతి వెంటనే వేంకటాచల యాత్రకు సకుటుంబముగా బయలుదేరి పోవుచుండెను. మార్గమధ్యమందు సుశాలి యను పట్టణంబును జేరెను. అక్కడ ధనవంతుఁడు, వితరణశీలి, బీదలయెడ ఆదరాభిమానములు గల సుఘోషుఁడను నుత్తముఁడున్నట్లు ప్రజలవలనఁ దెలిసికొని ఆతని నాశ్రయించు తలంపున అతనియొద్దకేగి ఆతనికి తన యుదంతమును దెలుపుకొని తనకుఁ గొంత భూదాన మిమ్మని యడిగెను. వేదశాస్త్ర పురాణపండితునకు, దారిద్ర్య మనుభవించు సంతానవంతునకుఁ జేయు దానము సత్పాత్రదాన మగునని తలంచి భద్ర మతికిఁదగిన ఆతిథ్య మొనర్చి, కోరిన భూదాన మిచ్చి సంతోషింపఁజేసి వీడుకొల్పెను. భద్రుఁడు తనకు భూమి లభించినందులకు సంతోషించి, కతిపయ ప్రయాణము లొనర్చి, తిరుపతి చేరి, కపిలతీర్థమున స్నాన మొనర్చి అటనుండి వేంకటాచలమునకుఁ బయనించెను.

వేంకటాచలముఁ జేరి స్వామిపుష్కరిణిలో స్నానమొనర్చి, వరాహ స్వామిని దర్శించి తదుపరి కుటుంబసమేతముగా పాపనాశన తీర్థముఁ జేరెను. చిత్తశుద్ధితో పాపనాశనతీర్థమున స్నానమాడి లక్ష్మీనారాయణుని గూర్చి ధ్యానించి, తాను సుఘోషునివలన దానముగ గ్రహించిన భూమిని సజ్జనుఁడు, సంతానవంతుఁడు, విద్యావంతుఁడగు బీదవానికి, భగవత్ప్రీతిగా దాన మొనర్చెను. అప్పుడు లక్ష్మీనారాయణుఁ డా భద్రమతికిఁ దన దివ్యదర్శనమును అనుగ్రహింపఁజేసెను. భద్రమతి లక్ష్మీనారాయణుని దర్శ నంబున పునీతుఁడై పెక్కు భంగుల సంస్తుతించి, పలుమారు నమస్కరించి, ఆనందాతిశయంబున కనులనుండి బాష్పధార లొలుక చేతులుగట్టుకొని నిలు చుండెను. భగవానుఁ డాతని యభిమతం బెఱింగి, సకలైశ్వర్యముల ననుగ్రహించి మాయమయ్యెను. లక్ష్మీనారాయణుల అనుగ్రహమునకుఁ బాత్రుఁడైన భద్రమతి భార్యలతో, బిడ్డలతో కతిపయ ప్రయాణముల మరల

తన యూరు చేరి స్వామి కటాక్షమున సకలభోగభాగ్యముల ననుభవించి కడపట ముక్తినొందెను. మరియు సుమతి, దృఢమతి యనువారును పాప నాశన తీర్థమున స్నాన మొనర్చి తమ పూర్వ పాపములఁ బోగొట్టుకొని ఇహపరసౌఖ్యములు చెందిరనియుఁ జెప్పుకొందురు.

సప్తమి భానువారము, పుష్యమీ హస్తానక్షత్రములతోఁ గూడిన సుదినంబున శ్రద్ధాభక్తులతో పాపనాశనతీర్థమందు స్నానమొనర్చిన వారి పాపములు తొలఁగి శుభములుగలుగునని పురాణము పేర్కొనుచున్నది.

## 5. కుమారధారా తీర్థము:

ఈతీర్థము పాపనాశనతీర్థమునకు వాయవ్యమూలగా నున్నది. ఇదియు సార్థకమైనది. పవిత్రమైనది, శతవర్షవృద్ధు లందు స్నానమాడిన కుమారా కారమున మిక్కిలి పటుత్వముగల శరీరులగుదురని చెప్పుదురు. మాఘ మాసమున పూర్ణిమ మఘానక్షత్రముతో గూడిన రోజు మధ్యాహ్న కాలమున శుచులై, స్నాన మొనర్చి దక్షిణలతో అన్నదాన మొనర్చినవారు గంగాది సర్వపుణ్యతీర్థములందు స్నానమాడిన ఫల మందుదు రని పురాణము పేర్కొనుచున్నది. ఇందుకు నిదర్శనముగా--

పూర్వము సకలశాస్త్రపారంగతుఁడు, సజ్జనుఁడు, దైవభక్తుఁడునగు వృద్ధుఁడు, కౌండిన్యుఁడను సజ్జనుఁడు తన శిష్యునితోఁ గూడి వేంక టాచలమున ఆశ్రమము నేర్పఱచుకొని, హోమాది కార్యము లొనర్చుచు తప మాచరించుచుండెను. ఒక నాఁ డాతఁడు నిత్యపూజాదులకు వలయు పుష్ప ఫల సమిధలకొఱకు అరణ్యమునకుఁ బోయి, కావలసిన వానిని సమకూర్చుకొని, తిరిగి ఆశ్రమమునకు వచ్చుటలో అరణ్యమున దారితప్పి తిరుగాడుచు, ప్రొద్దుపోవుచున్నందున, ఆశ్రమమందున్న తన శిష్యునికొఱకై "ఓ కౌండిన్యా! కౌండిన్యా!" అని అరచుచు దిక్కులు పిక్కటిల్ల విలపించుచుండెను. ఆ సమయమున వేంకటాచలపతి కుమారరూపంబున నవనవోన్మేషంబున, ఆ వృద్ధుని సమీపించి, "అయ్యా! ఇది నరసంచార ప్రదేశముగాదె? ఇందెవ్వరు లేరే, కౌండిన్యుఁ డెవరు? ఎందుఁగలఁడు?" అన

విని యా వయోవృద్ధుఁడు విరాకుపడి, ఎట్టకేలకు కొంత స్తిమితచిత్తుఁడై "అయ్యా! కౌండిన్యుఁడు నా శిష్యుఁడు. సమీపముననే నా యాశ్రమమం దున్నాఁడు. నే నా దారితప్పి తిరుగుచున్నాను. ఇచ్చ టెవ్వరు లేరా? నాకు చూపు తగ్గినది. చీకటి గ్రమ్ముకొన్న నేమియుఁ జూడఁజాలను. నా యాశ్రమమున కెట్లు పోవలయునో దిక్కు తోచలేదు. నా నిత్యకృత్యముల నెట్లు నెఱవేర్పఁగలనా అని చింతించుచున్నాఁడ. వయస్సు మీరి బక్కచిక్కినవాఁడను. దూరము నడువలేను. నా వా రనువా రెవ్వరు లేరు. స్వామీ! వేంకటేశ్వరా! నిన్నే నమ్మితి. సూర్యుఁడస్తమించుచున్నాఁడు. ఇఁక నా కేది దిక్కు?" అని వాపోవుచుండ, శ్రీవేంకటాచలపతి అతనితో "ఓయ్యా! శతాధిక వయోవృద్ధుఁడవు. బక్కచిక్కి, శక్తిలేక, కనుచూపు తగ్గి నడువలేని స్థితిలో నున్నాఁడవు. నీ వేల క్రూరమృగ సంచారమైన యీ యరణ్యమునకు రావలయును? ఇంకను జీవింపఁదలఁచితివా?" అని పరిహాసముగ నవ్వెను.

అప్పుడా వృద్ధుఁడు, "అయ్యా! నీ వెవరో నే నెఱుఁగను. నాకు జీవితాశలేదు. కాని, జన్మ తరించుటకు, జీవ మున్నంతవఱకు, దేవఋణము తీర్పకయే తనువు విడచుటకు మన మంగీకరింపక యున్నది. నిత్యపూజాదుల సక్రమముగ నొనరింపక నే నెట్లుండఁ గలనను విచారము తప్ప నా కెట్టి జీవితాశ లేదు" అన విని వేంకటాచలపతి, అతని చిత్తవృత్తి నెఱింగి, "అయ్యా! ఈ నా చేయి పట్టుకొని రమ్ము. నిన్ను సురక్షితముగ ఆశ్రమము చేర్చెదను" అని తనచేయి ఊఁతగా నిచ్చి, కొంతదూరముపోయి, యొకతీర్థమును జూపి, "ఈ తీర్థమున స్నానము చేయుము. ఆశ్రమమునకు బోదము" అన, నా వృద్ధుఁడా తీర్థమున మునిఁగి లేచునప్పటికి పదునాఱేడుల కుమారుఁడుగా మారి, తేజోవంతమైన కన్నులతో, లేతప్రాయంబుననుండుట కాశ్చర్యమగ్న మానసుఁడై యుండెను. తన నక్కడికిఁ గొనివచ్చిన యువకుఁడు కనుపించ లేదు. మింటనుండి శ్రీవేంకటాచలాధీశుని భక్తానురాగమునకు విస్మితులైన దేవతలు పూలవాన గురియించిరి స్వామిని పలువిధముల స్తుతించిరి. అనంతర మా బాలకుమారునకుఁ దేవఋణముఁ బాపుకొనుటకు వలయు సర్వసంపదల ననుగ్రహించి యంతర్ధాన మొందిరి. వృద్ధుఁడు కుమారుఁడై

వందులకా తీర్థమునకు కుమారధారాతీర్థమని సార్థకనామము గలిగెను. అతఁడు తన యాశ్రమమునకుఁ బోయి నిత్యహోమాది దైవకార్యముల నొనర్చుచు దేవ ఋణమును దీర్చుకొని దివ్యలోకముఁ జేరెను.

ఈ కుమారధారాతీర్థమున మాఘమాస పూర్ణిమ మఘానక్షత్రముతోఁ గూడిన నాటినుండి నిత్యము ముమ్మారు స్నానము చేయుచు మూఁడు మాసము లిట్లు శ్రీవేంకటాచలపతిని శక్తికొలఁది పూజించి ధ్యానించిన వయోవృద్ధులు తప్పక యౌవనప్రాయపు శరీర పుష్టిగలిగి ఇహసుఖముల ననుభవించి కడపట వైకుంఠముఁ జేరుదు రని పెద్దల సూక్తులు. ఇట్టి ప్రసిద్ధతీర్థములు వేంకటాచలమునఁ గలవు. కావుననే వేంకటాచలము దివ్యక్షేత్రము.

## 6. దేవతీర్థము:

ఈ దేవతీర్థము శ్రీవేంకటాచలపతి ఆలయ విమానమునకు వాయువ్య దిశ గిరిగుహయందుఁ గలదు. ఈ తీర్థమున పుష్యమీనక్షత్ర యుక్త గురువారమునఁ గాని, శ్రవణానక్షత్రయుక్తమగు ఇందువారమునఁ గాని లేదా వ్యతీపాతయోగమందుఁ గాని, మానవులు పరిశుద్ధులై దేవతీర్థమున స్నాన మొనర్చిరేని వారి సర్వదోషములు నశించును. ఆయురారోగ్యములతో పుత్త్రపౌత్త్రాది సంతానసౌభాగ్యములతో నిహపరసౌఖ్యముల ననుభవించెద రని పురాణమునఁ గలదు.

## 7. పాండవతీర్థము:

ఈ తీర్థము స్వామి పుష్కరిణీతీర్థమునకుఁ దూర్పుగా దాదాపు రెండు కిలోమీటర్ల దూరాన నున్నది. ద్వాపరయుగంబున పాండవులు తమ దాయాదులగు కౌరవవంశము నంతమొందించినందున పాప పరిహారమునకు శ్రీకృష్ణుఁడు వారిని కొంతకాలము శేషాద్రి యందు నివసింపఁబంపెను. శ్రీకృష్ణానుమతిని పాండవులు వైశాఖశుద్ధ ద్వాదశీయుక్త భానువారమున శేషాద్రిచేరి, అట నొక జలాశయతీరమున ఆశ్రమమేర్పరచు

కొని నివసించియుండిన కారణమున ఆ జలాశయమునకు పాండవతీర్థమని పేరు గలిగెనని పెద్దలసుద్దులు.

## 8. తుంబురుతీర్థము:

పూర్వము తుంబురుఁడను గంధర్వుఁడు వేంకటాచలము చేరి పాప నాశనతీర్థమున కుత్తరాన ఒక జలాశయతీరమున ఆశ్రమము నిర్మించుకొని అందు శ్రీవేంకటేశ్వరునిగూర్చి తపమాచరించుచుండెను. కొన్నాళ్ళకు భక్త వత్సలుఁడైన వేంకటాచలపతి తుంబురునకు దర్శనమిచ్చి యాతని కోరిక నెఱవేర్చెను. ఇట్లా తుంబురుఁడు శ్రీవేంకటేశ్వరుని దర్శనభాగ్యమున శాశ్వతవైకుంఠప్రాప్తి బొందె నందురు.

ఈ తుంబురు తీర్థమునందు ఫాల్గుణమాస శుద్ధపూర్ణిమ ఉత్తర ఫల్గుణీ నక్షత్రయుక్త సోమవాసరమున స్నానమాడి శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించిన వారికి పునర్జన్మ లేదని పురాణము దెల్పుచున్నది.

## 9. ఘోణతీర్థము:

ఈ తీర్థము తుంబురుతీర్థమునకు సమీపమునఁ గలదు. భూలోక మున మానవులుచేయు సకల పాతకములను హరించి వారిని పవిత్రులను జేయును. పూర్వము అగస్త్యుఁడు తన శిష్యవర్గముతో వేంకటాచలముఁ జేరి, అందు ఘోణతీర్థమున విడిదిచేసి ఆ తీర్థ మహిమను తన శిష్యుల కిట్లు తెలియఁజేసెను.

వనములను ఖండించువారు (పచ్చని వృక్షములను ఖండించుట మహా పాతకము), కన్యల విక్రయించువారు, దేవాలయ మాన్యము లాదిగాఁగల ఆస్తులహరించువారు, నిండుచెఱువుగట్లను పాపబుద్ధితో తెగ గొట్టువారు, పరస్త్రీలను బలాత్కరించువారు, భర్తల నిరాకరించువారు, మఱియు ఆడితప్పుట, కూటసాక్ష్యము చెప్పుట, సురాపాన మొనర్చుట బ్రహ్మద్వేష మును వహించుట, గురుద్రోహ మొనర్చుట, తను దాను పొగడుకొనుట,

నమ్మకద్రోహము చేయుట మున్నుగాఁగల మహాపాతకము లొనర్చినవారు ఈ ఘోణతీర్థమున మాఘమాసమున, సూర్యోదయమునకు పూర్వము స్నానముచేసి ఉదయించు సూర్యుని ఉపాసించిన సర్వదోషములు పరిహారమగును. మఱియు నా తీర్థతీరమున నివాసమేర్పరచుకొని శ్రీమన్నారాయణుని గూర్చి ఒక మాసము వ్రతనియమమున పూజించినవారికి సమస్త పాపములు నశించి మహాపుణ్యము గలుగునని ఘోణతీర్థప్రభావము వినిపించెను. ఆ సమీపమందలి పిప్పలవృక్షకోటరమున కప్పగా వసించుచుండిన తుంబురుఁడను గంధర్వుని భార్య భర్తృ శాపమనుభవించుచు చాలకాలమందుండినది. అగస్త్యుఁడు ఘోణతీర్థ ప్రభావమును తన శిష్యులకుఁ జెప్పుటను వినిన ఆ మండూకము భర్త యిచ్చిన శాప విమోచన మంది, తొలుతటి రూపమును బొందెను. ఆమె తన్ను ఆశ్చర్యమునఁజూచు అగస్త్యున కిట్లని విన్నవించుకొనెను. "మునీశ్వరా! నేను నా భర్తతో వివాదపడి అతనిని నిరాకరించుటచే నా భర్త నన్నొక మండూక మగునట్లు శపించియుండ నే నీ పిప్పలవృక్ష కోటరమున జీవించుచున్నాను. తాము తమ శిష్యులకీ ఘోణతీర్థమహిమను దెల్పుటను వినినంతనే నా శాపము పరిహారమైనది. ఇఁక నేను నా నాథుని యానతిమీరక నా సాధ్వీత్వమును నిరూపించుకొందును. నన్ను దీవించి పంపఁగోరుచున్న దాన" నని సాగిలపడి మునికి నమస్కరించి ఆతని దీవన లందెను. అగస్త్యుఁ డాయమ పశ్చాత్తాపమునకు సంతోషించి ఆమెకు పతివ్రతాధర్మముల బోధించి--

పతిరాత్మా పతిర్విష్ణుః పతిర్బ్రహ్మా పతిశ్శివః,
పతిర్గురుః పతిస్తీర్థ మితి స్త్రీణాం విదు ర్బుధాః.

అని హిత ముపదేశించెను. అంత నా గంధర్వసతి మునికిఁ కృతజ్ఞతాభివందనములు సమర్పించి, ఆతని ఆశీస్సు లందుకొని తన భర్త యాజ్ఞ ప్రకారము ఘోణతీర్థమున మాఘస్నాన వ్రతము సల్పి శ్రీమన్నారాయణుని పూజించి భర్త యనురాగమునుబొంది తన సతీత్వమును నిలుపుకొనెనని యితిహాసము గలదు.

## 10. సనక సనందనతీర్థము:

వేంకటాచలమున అతిపవిత్రములు, మహిమాంచితములైన తీర్థము లెన్నో గలవు. పాపనాశనతీర్థమున కుత్తరభాగమున దాదాపు ఐదారు కిలోమీటర్ల దూరాన సనకసనందన తీర్థము కలదు. మార్గశీర్ష శుక్లద్వాదశి అరుణోదయ కాలమున సనక సనందన తీర్థమున స్నానమాడి త్రయోదశి నుండి భక్తి ప్రపత్తులలో శ్రీవేంకటేశాష్టాక్షరీ మంత్రోపదేశముపొందిన ఒక మాసము నిష్ఠతో జపించి వ్రత మాచరించిన వారికి అన్నికోరికలు వెంటనే ఫలించుననియుఁ బెద్దలు చెప్పుదురు.

## 11. కాయ రసాయనతీర్థము:

సనక సనందనతీర్థమునకు సమీపముననే కాయ రసాయన తీర్థము కలదు. ఈ తీర్థమున శ్రద్ధాభక్తులతో స్నానమొనర్చి, జలపానము చేయుచుండిరేని కొన్నాళ్ళకు వారు సర్వవ్యాధిబాధలనుండి విముక్తులై పరిశుద్ధమైన శరీరసౌష్ఠవముతో, ముసలితనములేక కాయకల్పసిద్ధి బొందిన ట్లుందురని పురాణమునఁ గలదు.

## 12. క్షేత్రతీర్థముల ఆవశ్యకత:

గొప్ప మాహాత్మ్యములు గల దివ్యతీర్థములు వేంకటాచలమున ఎన్నో గలవు. తీర్థములే గాక దివ్యౌషధమూలికలు గూడ విశేషముగ నున్నవని ప్రసిద్ధము. వాని మహిమలను పూర్వపు మహర్షులు పురాణములందుఁ బేర్కొనియున్నారు. మన మా తీర్థసంసేవనము విలాసమునకై గాక, శ్రద్ధతో, భక్తితో, పారమార్థిక చింతనతో, ఓర్పున నొనరించినప్పుడే, మన కా తీర్థముల మహిమఁ దెలిసికొననగును. ఒక నాటి సాముతో మహావీరుఁడెట్లు కాఁడో, అదేవిధముగా ఒకపూట స్నానముచేత పవిత్రతీర్థముల మహిమఁ బొందఁజాలము. చిత్తశుద్ధితో పరిసరశుద్ధితో శ్రమకోర్చి వ్యయప్రయాసలను తలంపునకు రానీక భగవన్నామము జపించుచు, సర్వజీవులయందు దయ, ప్రశాంత చిత్తము గలిగి, నిత్యసంతృప్తితో పవిత్రతీర్థముల సేవించుట విధిగా

నొనర్చిన మానవులు భగవంతుని ప్రీతికిపాత్రులై ఇష్టార్థసిద్ధిఁ బొందగల రనుటే మన పురాణముల అంతరార్థము.

"గంగిగోవుపాలు గరిటెడైనను చాలు"

"భక్తిగలుగు కూడు - పట్టెడైనను చాలు"

అని మొదలుగాగల మహావాక్యముల మహార్థ తాత్పర్యములను గ్రహించి మానవులు మానయుతులుగా మెలఁగి మాధవసేవకు అంకిత మగుటయే మన మహాపురాణములయు ఇతిహాసములయు అంతరార్థము.

ఆ యా తీర్థములకు, క్షేత్రములకుపోయి వానిని దర్శించ లేక పోయినను, శ్రద్ధతో ఆ యా క్షేత్రములను గూర్చి వినినను, చదివినను, మనస్సున ధ్యానించినను మానవుల అభీష్టములు నెఱవేఱు ననుట సత్యము.

కలియుగమున మానవులు తరించుటకు పూర్వము మన మహర్షులు పెక్కువిధముల సాధనసంపత్తిని నిక్షేపించియున్నారు. వానిలో పురాణము లొక భాగము. మన పూర్వీకులెందరో పురాణసూక్తుల ననుసరించి భుక్తిముక్తులఁ గాంచినారు. కలియుగము పాపపంకిలమైనది. ఆ పంకిలమును ప్రక్షాళనముఁ జేసికొనుటకే మన పవిత్ర భారతావనియందు నదీ నదంబులేగాక తీర్థములెన్నో వెలసియున్నవి.

గంగాయమునలు - ఆ మహానదుల యుపనదులు, సింధు, బ్రహ్మ పుత్రాది దివ్యనదులు, గౌతమీ, కృష్ణా, తుంగభద్రా, కావేరీ పినాకినీ, దక్షిణప్రాంతపు నదులు మన భారతావనిలో భుక్తి ముక్తి సాధనము లనిన అతిశయోక్తి కాదు కదా? కాంచనగంగ మానససరోవర మాదిగాఁ దివ్యతీర్థము లెన్నో గలవు.

ఇఁక దివ్యక్షేత్రములు గౌరీశంకరునుండి కన్యాకుమారి రామేశ్వరము వరకు నెన్నో గలవు. పాదలేపమను దివ్యౌషధమున్నఁగాని మన మా తీర్థ క్షేత్రముల నన్నింటిని దర్శింపలేము. కావున నీ వైకుంఠవాసుడు మానవుల ఈతిబాధలనుండి, కలియుగపు నేతిబీరకాయ లను ఆశానంద క్షణిక

సంతోషములనుండి సుస్థిరత పొందు నిమిత్తమే వేంకటాచలముఁగ జేరి మనకు తీర్థక్షేత్ర సేవాఫలంబు నిచ్చు చున్నాఁడనుట నిజము - నిజము.

"కలఁడు" అను నమ్మక మున్నప్పుడే ఫలమనుభవింపఁగలము. కావున క్షేత్ర తీర్థయాత్ర లత్యంత ప్రయోజనకరములని విశ్వసించి ఆచరింపవల యును. అదియే మానవకళ్యాణ సౌధమునకు సోపానము.

*"పుణ్యం పవిత్రమాయుష్యం మాహాత్మ్యమిదముత్తమమ్,*
*యః పఠేత్ప్రయతో భక్త్యా శృణుయాద్వా లిఖేదపి,*
*సర్వాన్కామా న వాప్నోతి సంప్రాప్నోతి చ మఙ్గళమ్."*

(వరాహపురాణము)

## గద్యము:

ఇది శ్రీ శ్రీనివాస పాదారవింద ధ్యానామృతాస్వాదన మత్తచిత్త, శ్రీ జ్ఞానప్రసూనాంబికా సహిత శ్రీకాళహస్తీశ్వరానుగ్రహలబ్ధ కవితావిశేష, శ్రీ కైలాసవాసచింతన మానస సరోవర విహార మరాళమిథున లక్ష్మార్య లక్ష్మి నరసాంబా ద్వితీయపుత్త్రి, శ్రీ వేంకటకృష్ణార్యానుజ, బుధవిధేయ గుంటకట్ల తిరువేంగడసూరి నామధేయ ప్రణీతంబైన తిరుమల తిరుపతి క్షేత్రము - మాహాత్మ్యమను కావ్యమున ప్రథమాశ్వాసంబు సంపూర్ణము.

---

# ద్వితీయాశ్వాసము

* * *

ఆ. శ్రీ సతీశ! దేవ! శ్రితజన రక్షకా!
భక్తిఁదలతు నిన్ను శక్తికొలఁది,
కరుణఁ జూపి మమ్ము కాపాడు నిత్యంబు
శేషశైలవాస! శ్రీనివాస.

క. కలిబాధమాన్ప తిరుమల
కలియుగ వైకుంఠమనఁగఁ గై సేసిన మీ
సలలిత కరుణాహృదయము
కలనైనను మఱువఁజాల కంజదళాక్షా!

క. అలమేలుమంగ సతితో
అలరుచు నిజభక్తజనుల నలరించుచు, ఈ
కలియుగ వైకుంఠుఁడనన్
వెలసెదు తిరుమలనివాస! విజయవిలాసా!

క. పలికెద పావన తిరుమల
సలలిత చరితము జనులకు సమ్మతి కాఁగన్
పలికిన దంతయు శుభమగు
కలియుగ వైకుంఠవాసు - కథనం బగుటన్.

గీ. వ్యాసముని పురాణ చయమునందు
వేంకటేశుని లీలలు వెదకి వెదకి
జాను తెనుఁగున వివివెద పామికథను
వేడ్క విన్నంత కనినంత విశద ఫణితి.

## 1. శ్రీ వేంకటాచలపతి అవతరణ ప్రస్తావన:

కృతే తు నరసింహోఽభూ త్త్రేతాయాం రఘునందనః,
ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః.

నాలుగు యుగములందును ప్రజాసంరక్షణార్థము, భూదేవిని ఉద్ధరించుటకొఱకు వైకుంఠవాసుఁడు భూలోకమున నేదో యొకనెపమున అవతరించుచు శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేయుచుండునని పురాణములు మనకుఁ దెలుపుచున్నవి.

కృతయుగమున భక్తప్రహ్లాదుని రక్షించుటకై శ్రీహరి నరహరియై యవతరించి, హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని రక్షించెను.

త్రేతాయుగమున శ్రీనివాసుఁడు శ్రీరాముఁడై దశరథమహా రాజునకు జన్మించి, మునులను, మహర్షులను వేధించు రాక్షస సమూహముల వధించి ప్రజల కానందమును గూర్చుటతో సంతృప్తిఁజెందక, బ్రహ్మరాక్షస నాయకుఁడును, లంకాధీశుఁడైన రావణుని హతమార్చి, పరస్త్రీల పరాభవించరాదని తెలియఁజేసెను. మఱియు లోకశ్రేయము నభిలషించి, గురుభక్తి, పితృవాక్య పరిపాలనము, ఏకపత్నీ వ్రతము, ఆశ్రితరక్షణ, దీనజన పోషణ మున్నగు సాంఘికధర్మములతో పాటు చిత్రకూటమున భరతునకు రాజ్యపాలన ధర్మమును సుబోధమొనర్చి, తన రాజకీయపరిజ్ఞానమును సామాన్యుఁడు సహితము గ్రహించునట్లు తా నడచి, ఇతరు లాతని ననుసరించునట్లు బోధింపకయే గ్రహింపఁజేసెను.

శ్రీరామావతారమున వైకుంఠవాసుఁడు మానవధర్మముల నెన్నింటినో ఆచరించి చూపెను. కావుననే నేటికి లోకమున శ్రీరాముని అత్యంత భక్తితో భజించుచున్నారు. మానవమాత్రుఁడుగనే ఆ భగవానుఁడు ధర్మపాలన గావించి సజ్జనహృదయములందు నిలచి యున్నాఁడు.

ద్వాపరయుగమున, రానున్న కలికాలచ్ఛాయలు కనిపించుటచే వైకుంఠవాసుఁడు శ్రీకృష్ణావతారమెత్తి, గోపాలకుఁడుగా వర్తించి, చిన్ననాఁడే మదాంధుల నుక్కడఁగించి, ఆనాటి కాలుఁడగు కంసుని మర్దించి లోకరక్షణ

మొనర్చెను. సత్రాజిత్తుచే తనపైఁ బడిన అపవాదమును తొలఁగించుకొని, ఘనవులకెంతో సుబోధకావించెను. పాండవ కౌరవులకు సమీపబంధువై, తన రాజకీయ చతురతఁజూపి ధర్మరక్షణయే తన పరమావధిగ నిరూపించినాఁడు. కురుపాండవుల రణక్షేత్రమైన కురుక్షేత్రమందు అర్జునునకు క్షత్రియధర్మ ముపదేశించు నెపమున, భూలోకమున సర్వమానవ సౌభ్రాత్రమునుచాటు గీతోపదేశము చాటెను. మనువంశ సంభవులైన మానవుల మనుగడయెట్లుండవలయునో, ఏది ధర్మమో, జీవితపరమావధి ఎద్దియో నిరూపించుటతో పాటు 'ధర్మ ఏవ జయతే' అను సత్యమును ప్రచారము చేసిన మహనీయుఁడు శ్రీకృష్ణుఁడు. కలియుగమునందలి దురాచారముల ముందుగనే యూహించిన పరమాత్మ ద్వాపరయుగముననే కలియుగచ్ఛాయలను వాని నెదుర్కొను విధమును జూపినాఁడు. శిష్ట రక్షణ, దుష్టశిక్షణ తన కర్తవ్యమైనందున, తా నా యా యుగములందు అవసరోచితములైన అవతారములఁ దాల్తునని వచించినాఁడు. శ్రీరామకృష్ణులు మానవజీవితములకు గొప్పసంస్కారమును చూపినారు.

శ్రీరాముఁడు తన నడవడిని, శ్రీకృష్ణుఁడు తన దివ్యగీతోపదేశమును మనకు ఆదర్శములుగా చిరస్థాయిగా నిలిపినారు. అవి హైందవ సంస్కృతికి ఆరని జ్యోతులు.

సృష్టి, స్థితి, లయంబులతోఁ గూడిన లోకమును బ్రహ్మ సృష్టించును, విష్ణువు పోషించును, శివుఁడు లయింపఁజేయునని పురాణములు పేర్కొనిన సత్యము మానవుల కనుభవమైన సత్యమే. విష్ణువు తనపాలి ధర్మమును ఆచరించుటకే అవతరించును.

కలియుగమున ధర్మధేనువునకు ఒక్క పాదమే యుండుననుటను గ్రహించిన వైకుంఠవాసుఁడు తన నగరిమందలి క్రీడాద్రిని భూలోకమున గరుడునిచే స్థాపింపఁజేసెను. ఆ క్రీడాద్రియే వేంకటాచలముగ ప్రసిద్ధి గడించియున్నది. ఆ వేంకటాచల నివాసియే శ్రీ వేంకటేశ్వరస్వామివారు. "కలౌ వేంకటనాయకః" అని పురాణము ప్రశంసించినది.

ఈ వేంకటాచలము నాల్గు యుగములందును వివిధ నామములతో విలసిల్లినట్లు పురాణములు తెలుపుచున్నవి.

కృతయుగమున ప్రహ్లాదుని అనుగ్రహింప హిరణ్యాక్షుని చంపి వానిచే పాతాళమునకు గొనిపోఁబడిన భూదేవిని శ్వేతవరాహరూపమున ఉద్ధరించెను. అది మొదలు వరాహస్వామి వేంకటాచలమందే యుండెను. తదుపరి త్రేతాయుగమున భగవానుఁడు దుష్టశిక్షణకై దశరథమహారాజునకు శ్రీరాముఁడుగ జన్మించెను. ఆ వైకుంఠవాసుని పరివారములు, పరికరములే భరత-లక్ష్మణ-శత్రుఘ్నులు శేషులుగా జన్మించెనని కావ్యము తెలుపుచున్నది. దశరథుఁడు శ్రీరాముఁడు వేంకటాచలమును దర్శించినట్లు పురాణమందుఁగలదు. ద్వాపరయుగమున శ్రీకృష్ణుఁడు పాండవులను వేంకటాచలమందలి తీర్థములను సేవింపఁబంపినట్లు పురాణమున కలదు. అందుచే కృత త్రేతా ద్వాపరయుగములందును వేంకటాచలము పవిత్రమై మహిమోన్నతమై యుండినట్లు తెలియుచున్నది. ఇఁక కలియుగమున వైకుంఠవాసుఁడు వేంకటాచలమందే అవతరించి, అం దానంద నిలయమున నిలచి, తిరుమల భూలోక వైకుంఠముగ, భక్తులకు దర్శన భాగ్యమిచ్చి రక్షించుచున్నాఁడు.

ద్వాపరంబున దేవకీదేవి కనిన శ్రీకృష్ణుని వ్రేపల్లెవాడలోని నందుని పత్ని, యశోద తన కన్నబిడ్డగా లాలించి పెంచి పెద్దచేసి, తనకుఁగల పుత్త్రి వ్యామోహమును బాయలేక, ఆ కృష్ణపరమాత్మచే, తన కోరిక తీర వరముఁ బొంది, వేంకటాచలమున వకుళమాలగా తొలుత వరాహస్వామిని సేవించుచుండెను.

వేంకటాచలము ఆనందామృతైశ్వర్యముల నిచ్చు పవిత్రక్షేత్రము. అందు లోకరక్షణకై వేంకటాచలపతి అవతరించి కొంతకాలము వల్మీకమున అజ్ఞాతముగాఁ గడపి, ఆకాశరాజు పుత్త్రిక పద్మావతిని వివాహమాడి, సువర్ణముఖీ తీరమందలి అగస్త్యాశ్రమమునకు సమీపమున (అదియే యిప్పటి శ్రీనివాస మంగాపురము) కొంతకాలము వసించి తరువాత తిరుమలచేరి తొండమాను చక్రవర్తిచే నిర్మింపఁబడిన ఆనందనిలయమున నిలచి భక్తుల పాలించు

మన్నాఁడు. ఆ వేంకటాచలపతి లీలావిలాసములను వ్రాసిన, చదివిన, వినిన మానవులు ఆ పరమాత్ముని అనుగ్రహమునకు పాత్రు లగుదురు. ఇందుల కనేక నిదర్శనము లున్నవని చోళరాజుల చరిత్ర, మరికొంతమంది భక్తుల చరిత్రలు తెలుపుచున్నవి. వేంకటాచలపతి ప్రత్యక్షదైవమనుటకు భక్తుల చరిత్రములను మున్ముందు తెలిసికొనఁగలరు.

శ్రీకృష్ణావతార సమాప్తితో ద్వాపరయుగము గడచి కలియుగము ప్రారంభమైనది. కలుష కలితమైన కలియుగమున ప్రజలు బుద్ధి నిలకడలేని వారై, స్వార్థపరులై, ఆధ్యాత్మిక చింతలేక కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములకు లోనై, పాపభీతిలేక, ఒక తెన్నున నడవక, గురువులను, పెద్దలను, తలిదండ్రులను తిరస్కరించి, సంఘదురాచారములకు లొంగి, సత్యధర్మములకు దూరులై, ఉపకారి కపకార మొనర్చుచు, న్యాయమును అన్యాయముగ, అన్యాయమును న్యాయముగ వాదించుచు లంచగొండులై పాపభూయిష్ఠవర్తనులై ముక్తికి దూరమగుదురని, సృష్టికర్త ముందుగనే గ్రహించి, పతితులైన మానవుల రక్షింప పెక్కువిధముల ఆలోచించి, కడకు మానవుల సర్వపాపముల హరింపఁజేసి ముక్తినియ్యగల విష్ణుదేవుఁడే కలియుగ ప్రజల రక్షింపఁగలఁడని నిశ్చయించి తన మానస పుత్త్రుఁడైన నారదుని పిలిపించెను.

అట్లు వచ్చిన నారదునకు, కలియుగ ప్రజల పాపకృత్యముల వివరించి, వారినుద్ధరింప వైకుంఠవాసుఁడు భూలోకమున అవతరించు నుపాయ మాలోచించి కార్యము సాధింపు మని నొక్కి చెప్పెను.

ఆ కాలమున విష్ణుదేవుడు శేషతల్పమునఁ బవ్వళించి కలియుగ ప్రజారక్షణనుగూర్చి యాలోచించుచు యోగనిద్రలో మునిఁగి యుండెను.

## 2. మహర్షుల యజ్ఞము - భృగుమహర్షి త్రిమూర్తులలో సత్త్వగుణుని పరీక్షించుట:

కలియుగము రాక్షసకృత్యములతో ప్రారంభమై ఎటుచూచినను శాంతి లేక అలజడి యధికమైనందున ప్రజలు భయభ్రాంతులై యుండిరి. ఆ

పరిస్థితులను మహర్షులు కలిపురుషుని విజృంభణముగఁ దలంచి లోక క్షోభమును శాంతింపఁ జేయఁ దలంచి గంగాతీరమున నైమిశారణ్యమున సమావిష్టులై మహాయజ్ఞము నొనర్ప నిర్ణయించు కొనిరి.

ఆ యజ్ఞఫల భోక్త ఎవ్వరా యని వారు ఆలోచించసాగిరి. ఆ సమయమున నారదమహర్షి ఆ మునుల సమావేశ ప్రదేశమునకు రాఁగా, మును లాతనిని గాంచి, యెదురేగి, గొనివచ్చి ఉచిత సత్కారము లొనరించిరి. మాటల సందర్భమున మహర్షులు తాము కలియుగము ప్రారంభమైనందున ప్రజాక్షేమము కొఱకు గొప్ప యాగముఁ జేయఁదలపెట్టుట, ఆ యజ్ఞభోక్త విషయమై ఆలోచించు చున్నట్లు తెలియఁజేసిరి. అప్పుడు నారదుఁడు ఈ కలియుగమున సత్త్వగుణప్రధానుఁడైన దేవుని మీ రారాధించుట ఉచిత మని చెప్పెను. వెంటనే మునులు నారదునే అట్టి దేవునిగూర్చి తెలుపుమనిరి. అప్పుడు నారదుఁడు "అత్రి, వసిష్ఠుఁడు, భృగువు మున్నగు మహాత్ములుండఁగా నే నెవరిని చెప్పగలను. మీలో ఒక రా కార్యమునకుఁ బూనుకొని ముల్లోకములు ఒక్కమారు పర్యటించి కనుఁ గొనుటయే మంచి"దని యభిప్రాయమును దెల్పి నారదుఁడు వెడలిపోయెను. అప్పుడు మహర్షులు త్రిలోకాధిపతులలో సత్త్వగుణప్రధానుఁడైన దేవుఁడెవరా యని తర్జన భర్జన చేయసాగిరి. వారిలో ఏకాభిప్రాయము కుదరలేదు. అప్పుడు భృగుమహర్షి తాను త్రిమూర్తుల పరీక్షించి సత్త్వమూర్తిని కనుఁగొని వచ్చెదనని వారి సమ్మతితో, తాను త్రిలోకసంచారమునకు బయలు దేరెను.

తొలుత భృగుమహర్షి సత్యలోకమునకుఁ బోయెను. అట నలువ నలు ముఖంబులనుండి వేదపారాయణ మొనర్చుచుండెను. వాణి యాతనిపజ్జ ఆసీనురాలై లయబద్ధముగ వీణ మీటుచుండెను. అష్టదిక్పాలు రాదిగాఁ గల దేవతలు, మహర్షు లా సభలో నాసీనులై బ్రహ్మోపదేశంబులను శ్రద్ధతో వినుచుండిరి. చతురాననుఁడు వేదోక్తుల అంతరార్థములతో వినిపించుచుండెను. ఆ నిండుపేరోలగమున భృగువు నెమ్మదిగఁ బ్రవేశించి బ్రహ్మకు సాష్టాంగ నమస్కారమిడి లేచి యొక ప్రక్కగ నిలుచుండి, విరించి తనవైపు పరికించి చే సైగచే తనను ఆహ్వానించు నేమో యని రెప్పవాల్పక

ఆతనివైపు చూచుచుండెను. కాని కమలగర్భుఁడు తన యుపన్యాసధోరణిలో లీనమై ఆగంతుకుఁడైన భృగుమహర్షిని గమనింపలేదు. సభ్యు లెవ్వరును భృగుమహర్షిని పలుకరించలేదు. అందుచే భృగుమహర్షి కించిత్కోపముఁ జెంది, తపో ధనుఁడైన తనను బ్రహ్మ గమనించనందున, అపూజ్యుండని భావించి వెంటనే యటనుండి నిష్క్రమించెను.

భృగువు కైలాసమార్గ మనుసరించి అచ్చటికి చేరుసరికి భృంగి, నంది, ప్రమథగణంబులు ఫాలాక్షుని పలువిధముల ప్రస్తుతించుచుండ మహర్షి యా ప్రస్తుతుల వినుచు, మహోత్సాహంబున కైలాసనాథుని యంతఃపురమున కేగెను. అప్పు డా యాదిదంపతులు సరస వినోద సంభ్రమంబున మునిఁగియుండిరి. పార్వతీదేవి యా మహర్షి రాకను గమనించి మహేశ్వ రునకు సైగఁ జేసెను. అది తెలిసిన శంకరుఁడు భృగుని రాకచేఁ దమ ఏకాంతమునకు విఘ్నము గలిగెనన్న కోపమున నిర్లక్ష్యముగ నా మునివైపు చూచెను. అది గమనించిన భృగుమహర్షి యచ్చోట నిలువరాదని తలంచి యటనుండి వెడలి పోయెను.

సత్యలోకమున, కైలాసమున, తను వచ్చిన కార్యమునకు అనుకూల పరిస్థితులు గలుగనందున నిరాశ, నిరుత్సాహమున ఎట్లో ప్రయాణించి వైకుంఠముఁ జేరెను. అట శ్రీమన్నారాయణుని నామ సంకీర్తనలఁ బాడుచు, భజనలు చేయుచుండెడి భక్తజనంబులను అతఁడు గాంచెను. భృగువు పూర్వానుభవంబులను స్మరించుకొనుచు సౌధోపరిభాగంబున నున్న అంతఃపురంబునఁ బ్రవేశించెను. అట నిశ్శబ్దముగ నున్నది. శేషపర్యం కమున మహావిష్ణువు నిద్రించుచుండెను. లక్ష్మీదేవి యతని పాదముల కడఁగూర్చుండి పాదములొత్తు చుండెను. అట తనను పలుకరించు వారెవ్వరును లేనందున విష్ణువు మాయనిద్ర యభినయించు చున్నాఁడను తలంపున భృగుమహర్షి కోపోద్రేకంబున, పాన్పును సమీపించి నిద్రించు విష్ణువు వక్షఃస్థలమున తన యెడమకాలితో నొక తాపు తాచెను. భృగుమహర్షి రాక తన కార్యసాధన కనుకూలించునని తలంచియుండిన విష్ణుదేవుఁడు దిగ్గున మేల్కాంచినట్లు నటించి మహర్షిని గాంచి "మహాత్మా! తమరాక తెలియక నిద్రించినందులకు క్షంతవ్యుఁడను. తపోధను లతి పవిత్రులు.

వారి పాదధూళి మహాపవిత్రము. నేను ధన్యుఁడనైతిని. కాని తావక మృదుపాదము నా కఠినంపు ఱొమ్మును తాకుటచేఁ దమ చరణ మెంత నొచ్చినదో గదా!" అని యాతని వామపాదమును తన రెండుచేతులతో నొత్తుచు అతని పాదమందలి నేత్రమును అణఁచి వేసెను. సహనమున సాధ్యముగాని పను లేవి? భృగుమహర్షి విష్ణుదేవుని మృదూక్తులకు, ఉపచారమునకు ముగ్ధుఁ డయ్యెను. కాని నిగూఢ లోకరక్షణ ప్రయోజనములను గ్రహింపలేదు. లోకమున కార్యసాధకు లెంత సౌమ్యముగ వర్తింపవలెనో విష్ణుభగవానుఁడు నిదర్శనముగ చూపినాడు. తనను తన్నిన మునిపాదములు కడిగి, ఆ జలమును శిరమునఁ జల్లుకొని మితహితోక్తులతో నా మునిని సంతృప్తి పరచెను. భృగువు మహానందమును జెంది త్రిమూర్తులలో మహావిష్ణువే సర్వోత్తముఁడని, ఆ పురుషోత్తముని భక్తిశ్రద్ధలకు సంతోషించి, సమయోచితముగ మాటలాడి వైకుంఠవాసునివద్ద సెలవుతీసికొని, తన రాకకై నిరీక్షించుచున్న మహర్షులున్న నైమిశారణ్యమునకు సంతోషమున బయలుదేరెను.

తన రాకకై నిరీక్షించుచున్న మహర్షుల కూటమి చేరెను. ఆతని వాలకము గాంచిన మహర్షులు కార్యము సఫలమై యుండునని తలంచి "మునివర్యా! తమ ప్రయత్నము సుసాధ్యమైనదని తలంతుము. కాని మీవలన వినఁగోరుచున్నారము" అన విని భృగువు విరించి, త్రినేత్రుల గూర్చి తన యభిప్రాయ మెఱింగించి, ఆ సదస్సు ఆశ్చర్యమగ్న మగునట్లుగా తాను వైకుంఠవాసుని పరీక్షించిన పద్ధతిని ఆతని సత్త్వగుణ ప్రాముఖ్యమును, ఆ దేవుని సహనము, ఆదరాభిమానములను నాటకీయముగ నభినయించి

*"హరి స్సర్వోత్తమః సాక్షాద్రమాదేవీ తదంతరా*
*తదధో విధివాణ్యౌ చ తదధః శర్వపూర్వకాః"*

అని వచించి కూర్చుండెను. భృగుమహర్షి వాచక భాషణంబులకు మహర్షులందురు మహానందమును జెంది మహావిష్ణువే దేవోత్తముఁడని నిర్ణయించి, తాము తలపెట్టిన మహాయాగమున కుపక్రమించి సాంగముగ సంపూర్ణ మొనర్చి యాగఫలమును విష్ణుదేవునకు సమర్పించిరి.

## 3. లక్ష్మీదేవి కరవీరపురము (కొల్హాపురము)నకుఁ బోవుట:

వైకుంఠమున విష్ణువు భృగుమహర్షి రాకవలన తన మాయానాటకము నకు నాంది సమాప్తమైనట్లు సంతోషముగ నుండెను. కాని లక్ష్మీదేవి భృగుని రాకవలన తన కవమానము జరిగెనని విషణ్ణహృదయయై యేదో విచారమున మౌనముగా నుండెను. అప్పుడు వా రిరువుర కీ సంభాషణ జరిగెను.

"లక్ష్మీ! ఏమో దీర్ఘాలోచన చేయుచున్నట్లున్నావు?"

"స్వామీ! ఆలోచన ఏమీలేదు. జరిగిన పరాభవమునకు పరితాప మందుచున్నాను."

"పరాభవమా--"

"కాక! మరేమి? ఎంత ధైర్య మా మానవునకు? తమరిని ఆ విధముగా అవజ్ఞచేయునా?"

"ఆ మహర్షికి మనల నవమానపరచు ఉద్దేశము లేదు"

"మరి--"

"ఇంటి కేతెంచిన అతిథి రాకను గమనింపకుండుట గృహయజమాని తప్పుగాదా?"

"ఆ మహర్షి నా యెదుట అట్లు ప్రవర్తించుట మన్నించరాని తప్పు కా దందురా?"

"తలిదండ్రులు తమ బిడ్డల నెత్తుకొని ఆడించునప్పుడు ఇట్టి పాద తాడనములు సహజములు. తలిదండ్రులు సహింపఁదగినవి, సంతోష జనకములు."

నే నేదో పాపము పూర్వ మొనర్చినందున నాథునకు నా యెదుట నా నివాసమున ఇట్టి అవమతి జరిగినది. నే నేమాత్రము సహింపఁజాల.

నా తల తిరుగుచున్నట్లున్నది. ఏకాంతముగ తపము ఆచరించినఁగాని మనశ్శాంతి గలుగదు. నాథా! సర్వజగద్రక్షకుఁడవు. నీవు సహింతువు. నన్ను క్షమింపుము. ఇఁక నే నే మాత్ర మీ వైకుంఠమున నివసింపలేను. ఇప్పుడే మిమ్ము విడిచిపోవుచున్న దాన."

"లక్ష్మి ఏల యింత పరితాపము? సర్వము నన్నుగా భావించు. నాయం దత్యంత భక్తిపరులను నేను విడువఁజాలను. వారు మనబిడ్డలు. లోకోపకారకములైన నా భావములకు వారు రూపకల్పనఁజేయుచుందురు. జగద్రక్షణ భారమందు మహర్షులు నాకుఁ దోడ్పడుచుందురు."

"కావచ్చును. కాని నేను మాత్ర మిఁక నిందుండఁజాల. ప్రశాంత ముగా నొకచో తపస్సుచేయుచు నా పరాభవ పరితాపమును శాంతింపఁ జేసికొనవలెను. నారాయణా! చరాచర ప్రపంచభారము నీ యది. కావున నీవు సహింపవచ్చును."

"ఆఁ - నిజము చెప్పితివి. లక్ష్మి! నీ తోడ్పాటుతో ప్రపంచ పోషణభారము వహించుచున్నాననుట నీవును ఎఱిఁగిన విషయమే."

"అయిన ఈ విషయమున నా మన స్సంగీకరింపకున్నది. నా ప్రార్థన ఆలకింపుము. ఇదే వైకుంఠమును వీడి కొల్హాపురమున నుండెద" అని లక్ష్మీనారాయణులు వాదులాడుకొనిరి. లక్ష్మి వైకుంఠమును వీడి కరవీరపుర క్షేత్రమునకుఁ గదలిపోయెను.

## 4. విష్ణువు వైకుంఠమును వీడి వేంకటాచలము చేరుట:

ఇల్లాలులేని యిల్లు కళావిహీనముగ నుండుట సహజము. ఇంటి కిల్లాలు నిత్య దివ్యజ్యోతి. జ్యోతిలేని గృహ మెంత గొప్పదైనను అంధ కార బంధురమే గదా! పురుషునకు సకలసౌఖ్యములఁ గూర్చునది సతి. సతిలేని పతి మతి గతిలేని వ్యక్తియే. భార్య భర్తకు సహధర్మచారిణియై ఇహపరసుఖములకు తోడ్పడుచున్నది. ఆదర్శ దాంపత్యమునకు అనుగుణ ముగా భగవానుఁడు నడచుకొనవలసివచ్చినది. మానవులు తన్ననుసరించి

సద్ధర్మవర్తను లగుటయే పరమాత్మ తన కానందముగ భావించునను టెలియఁగలదు.

వైకుంఠవాసుఁడు వైకుంఠనగరమును వదలి ఏకాంతముగ నెచ్చటె చ్చటనో సంచరింపసాగెను. లక్ష్మీదేవిని శాంతింపఁజేయు నాలోచనలతోఁ బ్రయాణించుచు నందందు సంచరించుచు గంగానదీతీరము చేరెను. అచ్చట మనస్థిమితత గానరానందున, అటనుండి దక్షిణాభిముఖుఁడై వచ్చి వింధ్యపర్వతములనుదాటి, గోదావరి, కృష్ణా పినాకినీ నదులను గడచి, కడపట స్వర్ణముఖీనదికి ఉత్తరమున నున్న వేంకటాచలముఁ జేరెను. అందలి ప్రకృతిసౌందర్యము తనకుఁ గొంత యూరటఁ గలిగింప, నందందు సంచ రించుచు స్వామిపుష్కరిణీ తీర్థమునుగాంచి మరింత మనఃస్థైమిత్యమును జెందెను.

అట జింకలు స్వేచ్ఛగా విహారము చేయుచుండినవి. వివిధ పక్షుల మనోహరకూజితములు విన నింపుగా నుండెను. కన్నులపండువుగ నెమ ళ్ళాడుచుండినవి. మహావృక్షములు, లతలు, గుల్మములు పుష్పఫలాదులచేఁ జూడఁజూడ మనోహరముగా నుండెను. ఆ వసంతము జాతిశోభను గాంచి యీర్ష్యచెందిన జాజి లేకున్నను వివిధ పుష్పోత్కరము దర్శనీయముగ నుండెను. శ్రీపతికి సంపూర్ణమనశ్శాంతి గలిగినది. అందు నివసింపఁదగిన వసతికై వెదకి, స్వామిపుష్కరిణికి దక్షిణమున నుండిన పెద్ద చింతచెట్టు క్రింద పెద్దపుట్టను, ఆ పుట్టకు చక్కని ద్వారమును గాంచి, సంతో షించి, అది తన యావాసముగాఁజేసికొని యట తపోనిష్ఠాగరిష్ఠుఁడై నివసించుచుండెను.

## 5. చోళరాజు - గోవు వృత్తాంతము:

విష్ణువు వైకుంఠమును వీడి వేంకటాచలమున వల్మీకమందు గాఢ తపో నిమగ్నుఁడై యుండుటను దెలిసిన సురర్షులు, శంకరుని నాయకత్వమున సత్యలోకమునకుఁ బోయిరి. శంకరుఁడు విష్ణుదేవుని గాఢతపమును గూర్చి బ్రహ్మకుఁ దెలియఁజేసి కారణ మడిగెను. అందులకు వాణీవల్లభుఁడు

జగద్రక్షకుఁడైన నారాయణుఁడు కలియుగమున ప్రజలను పాపవిముక్తులఁ జేయుటకే వైకుంఠమునుండి వచ్చి భూలోకమందలి పుణ్యభారతావని దక్షిణప్రాంతమందలి వేంకటాచలమం దున్నట్లు దేవతలకు విశదపరచి, ఆ భగవానుని కార్యసాధనకు తమపాలి కార్యము నొనర్చుటకు "కైలాసవాసా! విష్ణు దేవునకు మనవంతు కార్యముగ నేను గోవు నగుదును. నీవు గోవత్సముగ నుండవలెను. ఓ ఆదిత్యా! కరవీరపురమునందున్న లక్ష్మి దేవికి మన కార్యము నెఱిఁగించి, ఆమె యాదవవనితగ గోవత్సములను వేంకటాద్రిప్రాంతపు రాజ్యమును పాలించు చోళరాజు ముఖ్యపట్టణమగు నారాయణపురమునకుఁ దోలుకొనిపోయి గోవత్సముల నా రాజున కమ్ము నట్లు చెప్పి ఒప్పించి పిలుచుకొనిరమ్ము. ఇది వైకుంఠవాసుని జగద్రక్షణ కార్యమని చెప్పుము" అని సూర్యుని కరవీరపురమునకుఁ బంపెను. సూర్య భగవానుఁడును తనపాలి కార్యము నెఱవేర్చ కరవీరమందలి లక్ష్మీదేవిని దర్శించి బ్రహ్మ చెప్పినచొప్పున లక్ష్మీదేవికి చెప్పి, ఆమెను పిలుచుకొని వచ్చులోపల బ్రహ్మ శంకరులు గో, గోవత్సములుగా మారి సిద్ధముగ నుండిరి. లక్ష్మీదేవి తన పాలికార్యము నిర్వహింప గోవత్సములఁ దోలుకొని పోయి నారాయణ పురమున రాజమందిరము చెంత ఆవుదూడలతో నిలిచి యుండెను. అప్పు డా యంతఃపుర పరిచారకులు మంచి పాడియావును దూడను ఎవరో యాదవవనిత అమ్ముటకై వచ్చియున్నదని మహారాజులకుఁ దెల్పిరి. వెంటనే రాజు అంతఃపురమునుండి గోవత్సములను గాంచి కొనఁదలఁచి, ఆ యమ్మ చెప్పిన మూల్యమిచ్చి కొనెను. లక్ష్మీదేవి కరవీరపురమునకుఁ బోయెను. రాజు గోవత్సములను గోపాలకునికి చూపి తన యాలమందలో మంచి జాగ్రత్తగా మేపున ట్లాజ్ఞచేసి అంతఃపురము లోనికి పోయెను. గోపాలుఁ డా యావును తక్కిన ఆవులతోపాటు మేఁతకై వేంకటాచలమునకుఁ దోలుకొనిపోవుచుండెను. ఆవు చక్కగామేసి నిత్యము ఎక్కువ పాలిచ్చుచుండెను. మహారాజ్ఞికూడ క్రొత్త ఆవుపాలకు చాల తృప్తిఁజెంది దానిని ప్రత్యేకముగా బుట్టమేఁతలతో పోషింపవలసినదిగా గోపాలునికి నాజ్ఞ చేసెను. దూడయును కడుపునిండుగా పాలుత్రాగి చక్కగా నెదిగి దొడ్డిలో గంతులు వేయుచు నెగురుచుందు టా యంతఃపుర పరివారము నానందపరచు చుండెను.

ఆ నాటి చోళరాజు ధర్మాత్ముఁడు. ప్రజలను తాఁ గన్న ప్రజలట్లు లాలించుచుఁ బాలించువాఁడు. నీతిమంతుఁడు, గుణవంతుఁడు. అతని రాజ్యము సుభిక్షముగ నుండెను. గోవులకు జలము, పచ్చిక పుష్కలముగ లభించుచుండెను. గోగణ మభివృద్ధిఁ జెంది యుండెను. నెలకు మూఁడువానలు. పైరు పచ్చలు చక్కగా ఫలించు చుండెను. కరువు కాటకములు లేవు. ప్రజలు రాజభక్తితో పాడిపంటలతో సుఖజీవనము చేయుచు అన్యోన్య సహనభావమున ఏలాటి భేదబుద్ధిలేక కలసి మెలసి జీవించుచుండిరి. కుగ్రామ మం దైనను అతిథి అభ్యాగతులను గౌరవముగ నాదరించుచుండిరి. పెద్దలయందు గౌరవము, తల్లిదండ్రులయందు భక్తి, బీదసాదలయం దాదరణ, పుణ్యకార్యములం దాసక్తి, సత్యవర్తన, పాపభీతి మున్నగు గుణములు గలిగి రాజునకు కీర్తి గలిగించుచుండిరి.

గోపాలుఁడా యావును ప్రత్యేకముగ సాలలో గట్టి, పాలు పిదికి రాణివాసమున కంపి, దూడ పాలు త్రాగిన పిదప, ఆవు కట్టు త్రాఁడువిప్పి, మందగోవులతో మేపుటకు వేంకటాచలమునకుఁ దోలుకొనిపోవు టాతని నిత్యకృత్యము. ఇట్లు వేంకటాచలము చేరెడి ఆలమందనుండి నూతనగోవు శ్రీనివాసుఁడు తప మాచరించు పుట్ట దగ్గరకు రహస్యముగ పోయి, ఆ పుట్టపై నున్న రంధ్రమున తన పొదుగు నుంచి, శ్రీనివాసునకుఁ దన క్షీరము లిచ్చుచు, ఆ పిదప ఆలమందతోఁ గలసి ఇల్లుచేరుచుండును. ఇట్లు కొన్నాళ్ళు జరుగఁగ, లేఁగదూడ బక్క చిక్కిపోయెను. ఆవు పాలిచ్చుట లేదని రాణివాసమునకుఁ దెలిసెను. ఒకనాఁడు మహా రాణి గోపాలకుని పిలిపించి విచారింపఁగా ఆతఁడును తనకు ఏమియు బోధపడుట లేదనియెను. కాని రాణి వానిమాటలు నమ్మక గోపాలుఁడే పాలు పిదుకు కొనుచున్నాఁడని తలచి వానిని చీవాట్లు పెట్టి, ఇఁక ఆవు పాలియ్యకున్న నీవే కారణ మౌదువు. కావున జాగ్రత్తగా కనిపెట్టవలసినదిగా హెచ్చరించెను. మరునాఁడు గోపాలుఁ డావులను వేంకటాచలమునకుఁ దోలుకొనిపోయి, నూతనగోవును ఒక కంట కనిపెట్టియుండెను. గోవు వాడుక ప్రకారము పుట్టరంధ్రమున పొదుగునుంచి పాలు పుట్టలోనికి స్రవింపఁజేయుటను గ్రహించి, తన కపవాదము కలిగించె నన్న కోపమున

చేతిగొడ్డలిని గోవుపై నిసరునంతలో శ్రీనివాసుఁడు తటాలున తన శిరము పైకెత్తి గోవును రక్షించెను. కాని గోపాలుని కుఠారము శ్రీనివాసుని శిరమునకు గాయము గలిగించెను. ఆ గాయమునుండి రక్తప్రవాహ మేర్పడెను. గోపాలుఁడు రక్తప్రవాహమును గాంచి నిశ్చేతనుఁడై నేలఁబడి ప్రాణములు విడచెను. వెంటనే గోవు నారాయణపురము వైపు పరుగు లిడుచు పోయెను.

## 6. గోవు చోళరాజును వేంకటాచలమునకుఁ గొనివచ్చుట రాజునకు శ్రీనివాసుని శాపము-శాపావసానము

గోవు అంబా యని అరచుచు నొక్కపరుగున రాజమందిరము ప్రవేశించి, అరచుచు తల నాడించుచు రాజు నెదుట నిలచెను. రాజు గోవు అరపును, చేయు సంజ్ఞలను గ్రహించి, ఏదోప్రమాదము వాటిల్లి యుండునని తలఁచి గోవు ముందు పోవుచుండ దాని ననుసరించి వేంకటాచలముఁజేరి అటనుండి గోవు పోవుమార్గమున స్వామిపుష్కరిణి యొద్దునఁగల వల్మీకము చెంతకు పోయెను. గోపాలుఁడు చచ్చిపడి యుండుటను, రక్తప్రవాహమునుగాంచి వింతపడి రాజు "ఇచ్చటెవ్వరును లేరే! గోపాలునికి గాయములేక మృతుఁడయ్యె. ఈ రక్తమండలమేమి?" అని అనుకొనుచుండ, శ్రీనివాసుఁడు పుట్టనుండి వెలువడి వచ్చి, రాజును చూచి "ఓయీ! నీవు పాపివి. రాజ్యగర్వపూరితుఁడవు. కార్యాకార్యము లెఱుంగవు. నేను తల్లిదండ్రులు లేక, స్వజనము నెడఁబాసి, కష్టము లనుభవించుచున్న నిరపరాధిని. ఇట్టి నన్ను నీ సేవకునిచే నా తల పగులఁగొట్టించినాఁడవు. కుటుంబము లోనివా రొనర్చు పాపకృత్యముల పరిదిద్దకున్న ఆ పాపఫలముల ఇంటి యజమాని యనుభవించును. అట్లే ప్రజలు చేయు తప్పులకు రాజు బాధ్యుఁ డగును. రాజు భోగముల ననుభవించుటకే కాదు, ప్రజాదోషములను గూడ భరింపవలెను. కావున నీ సేవకుఁడు చేసిన ఈ పాపఫలమును నీ వనుభవింపక తీరదు. కావున నీవు పిశాచమవై వర్తింపు" మని శపించెను.

ఆ శాపవాక్కులు అశనిపాతము కాఁగా రాజు, కొంత తడవు చేతనారహితుఁడైయుండి, ఆ దివ్యపురుషుఁడు మహావిష్ణువని గ్రహించి పాగిలఁబడి నమస్కరించి, లేచి, నిలుచుండి చేతులు గట్టుకొని, వంగి వినయ వినమితోత్తమాంగుడై "స్వామి! లోకరక్షకా! నా కే పాపముఁ దెలియదు. నోరులేని యీ గోవు నా యంతఃపురమునకు వచ్చి, అరచుచు, నన్ను తనవెంట రమ్మని సంజ్ఞ చేయుటచే, ఏదో వింత విషయ ముండునని తలంచి గోవువెంట నిచ్చటికివచ్చి యిచ్చటి పరిస్థితులు చూచి తమవలన విషయము తెలిసి కొంటిని. నన్ను క్షమించి, ఈ శాపమును ఉపసం' ారింపఁ బ్రార్థించు చున్నాఁడ" అని భక్తిభావంబున స్వామికి విన్నవించుకొనెను. అప్పుడు శ్రీనివాసుఁడా సువీరరాజునందు కనికరము గలిగి, "ఓ సువీరా! నీ పూర్వపుణ్యమున నన్నుఁజూడగల్గితివి. నీ పూర్వీకులును, నా కత్యంత ప్రియులును నగు పాండవులు చంద్రవంశపు రాజులు. ఆ చంద్రవంశపు రాజులకుఁజెందినవాఁడవు. నీ భక్తికి సంతసించితిని, కాని నే నిచ్చిన శాపము నకుఁ దిరుగులేదు. నా భక్తులయెడ నా కత్యంత వాత్సల్యము. వారి కొఱకేమైనను చేయఁగలను. కొంతకాలము నీవు నా శాపఫల మనుభవించిన తురువాత ఈ స్వామితీర్థమున స్నానమాడి శాపవిమోచన మునుబొందుదువు. ఆ తురువాత నీకు సుధర్ముఁడను కుమారుఁ దుద యించును. ఆ సుధర్మునకు ఆకాశరాజు తొండమానులను నిరువురు పుత్త్రులు గలుగుదురు. ఆకాశరాజు పుత్త్రిని నేను వివాహ మాడుదును. ఆ కారణమున నీవు పుణ్యలోకముఁ జెందుదువు, అని ఓదార్చిపంపెను. గోవత్సములు బ్రహ్మ మహేశ్వరులుగా మారి తమ లోకములకుఁ బోయిరి. అంత సువీరుఁడు సంతోషించి కొంతకాలము పిశాచరూపమున వేంకటాద్రిని వసించి, స్వామి పుష్కరిణీ తీర్థస్నానమున శాప విమోచనముఁ బొంది మరల తన రాజ్యమును ప్రజాసమ్మతముగఁ బాలించెను. కొంతకాలమునకు పుత్త్రోదయ మయ్యెను. వానికి సుధర్ముఁడని నామకరణ మొనర్చి, పెద్దవాఁడైన పిదప పాండ్యరాజ తనూజయగు మనోరమాదేవితో వివాహ మొనర్చి రాజ్య మిచ్చెను. తాను వేంక... లంబున తప మాచరించుచు కడపట పుణ్యలోకముఁ జేరెను.

## 7. వరాహస్వామి శ్రీనివాసుల కలయిక -- వకుళమాలిక శ్రీనివాసునకు సేవచేయుట:

· చోళరాజు వెడలిపోయిన పిదప శ్రీనివాసుఁడు, బృహస్పతిని స్మరించి వచ్చిన దేవగురుని తన తలమీఁద గాయమునకుఁ దగిన చికిత్స చెప్పుమని కోరెను. బృహస్పతి కొన్ని మూలికలను తెచ్చి నూరి ప్రత్తితో పట్టు వేసి, దానినే పట్టు వేయునట్లు చెప్పిపోయెను.

ఒకనాఁడు శ్రీనివాసుఁడు ఔషధముకొఱకు వనములో తిరుగు చుండ, దుష్టరాక్షసుల సంహరించి తిరిగి స్వామిపుష్కరిణీ తీరవాసమునకు వచ్చుచు మార్గమధ్యమున వరాహస్వామి శ్రీనివాసుని గాంచి "నీవెవ్వ"రని యడిగెను. శ్రీనివాసుఁ డతనికి బదులియ్యక వేగముగా పోయి తన వల్మీక మునఁ బ్రవేశించెను. అప్పుడు వరాహస్వామి దీర్ఘముగ యోచించి, అతఁడు వైకుంఠవాసుఁడని నిశ్చయించి పుట్టసమీపమునకుఁబోయి శ్రీనివాసుని పలుకరించెను. శ్రీనివాసుఁడు ఆ వరాహస్వామి తన అంశసంభూతుఁడే యని తెలిసికొని పుట్టనుండి వెడలివచ్చెను. భిన్నరూపముల వెలుఁగు నా మూర్తి ద్వయము ఏక రూపజ్యోతులే యని యెఱిఁగిన దేవతలు వారిపై పూలవాన గురియించి నుతించి వెడలిపోయిరి.

తదనంతరము వరాహస్వామి శ్రీనివాసుని వైకుంఠనగరము వీడి వచ్చుటకుఁ గారణ మడిగెను. అప్పుడు విష్ణువు భృగుమహర్షి వైకుంఠమునకు వచ్చి నిద్రించుచున్నతనను వక్షఃస్థలమున తన్నుట, ఆ కారణమున లక్ష్మి తనను వీడిపోవుట, తాను ఒంటరిగా వైకుంఠమున నుండలేక అట నుండి బయలుదేరి భూలోకముచేరి, అందందు తిరిగి పుణ్యనదీనదంబుల సందర్శించి వింధ్యపర్వతము చేరినను, తనకుఁ బత్నీవియోగవ్యథ శాంతిం పనందున, వింధ్యకు దక్షిణముగ ప్రయాణము సాగించి, గౌతమీ, కృష్ణా, పెన్నానదులఁ గడచి, సువర్ణ ముఖీనదిని దర్శించి, చివరకు వేంకటాచలముఁ జేరుట, అట స్వామిపుష్కరిణిని చూచి, అచ్చటి ప్రకృతిసౌందర్యము తనకు శాంతి గల్గింపఁగలదని తలంచి తింత్రిణీవృక్ష మూలమందున్న వల్మీకమున తప మాచరించుచున్నట్లు, తన వృత్తాంతమును వివరించెను. ఆపై

తలమీఁది గాయమును గూర్చి వరాహస్వామికి వివరించెను. అంతయు విని వరాహస్వామి "లోకరక్షకా! ఎంతకాలము మీరిచ్చట నుందు రనెను?" "నేను కలియుగాంతము వఱకుందును" అని శ్రీనివాసుఁడు చెప్పఁ విని వరాహస్వామి, "తాము కలియుగమానవులు కష్టముల నుండి విముక్తు లగుటకే యిటకు వచ్చియుందురని తలంచెదను. మఱియు మానవులు నైతికమార్గ మవలంబించి, ఆధ్యాత్మికసంపద గలిగి సద్ధర్మవర్తను లగుటయే తమ ఆశయ మని గ్రహించితిని. తామిదివరలో లోకరక్షణకై ఎన్నియో యవతారములుఁదాల్చితిరి. కలియుగ మానవుల పాపములనుండి తప్పించుటకే వేంకటాచలమును భూలోకవైకుంఠముగాఁ జేయఁదలచియున్నట్లు ద్యోతకమైనది. ఈ ప్రాంతము వరాహప్రాంతముగాఁ బిలువఁబడుచున్నందున మీరిచ్చట నివసించుటకుఁ గొంతసొమ్ము ముందుగా చెల్లింపవలసియున్నది"

"అవును. ప్రస్తుతము లక్ష్మి నన్ను వీడి పోయినందున మీకు సొమ్ము నెట్లు చెల్లించఁగలను."

"శ్రీనివాసా! తాము మానవుల శుభమును గోరి యిచ్చట నివసింపఁ దలఁచితిరి. తమ భక్తులు క్రమముగా వందలు, వేలుగా తమ దర్శనమునకు వచ్చి తమకు సమర్పించు నివేదనలలో మొదటి భాగము నాకు చెల్లించునట్లు మాటనిచ్చినఁ జాలును."

"చాల సంతోషము, అట్లే యగును గాక. మఱియు నా దర్శనార్థమై వేంకటాచలమునకు వచ్చు భక్తులు తొలుత స్వామిపుష్కరిణిలో స్నానమాడి, ఆ తీరముననున్న మిమ్ము సేవించి, నివేదనలు సమర్పించి, తమ యనుగ్రహము పొందిన తరువాత నా దర్శనమునకు వచ్చి తమ నివేదనలు నాకిచ్చుకొందురు. అట్టివారి నివేదనల నే నత్యంతప్రీతితో స్వీకరింతును. నా భక్తులు తొలుత మిమ్ము సేవించిన తరువాత నన్ను సేవించు వారియందు నా కత్యంత ప్రీతి. వారిని తొలుత నాదరించుచుందును" అని పలుక విని వరాహస్వామి 'తథాస్తు' అని పలికి కొంతతడ వుచితసంభాషణ మొనర్చి తనయొద్ద సాచకిగానున్న వకుళమ్మను శ్రీనివాసునకు సేవఁజేయుటకై పంపుదునని చెప్పి యటనుండి వెడలిపోయెను.

వరాహస్వామి తన నివాసము చేరి వకుళాదేవితో "అమ్మా! నీ కోరిక ఫలించు సమయము వచ్చినది. ఆ మూల చింతచెట్టుక్రింద నున్న వల్మీకమున నీ శ్రీకృష్ణుఁడు వైకుంఠమునందుండివచ్చి శ్రీనివాసుఁడుగా నివసించుచున్నాఁడు. ఇప్పుడు తలమీఁది గాయముతో బాధపడుచున్నాఁడు. కావున మీ రచ్చటికి పోయి శ్రీనివాసునకుఁ దగిన సేవ లొనర్చుచు పుత్త్రి వాత్సల్యమును దీర్చుకొనుము" అన విని యా వకుళమ్మ అత్యంతానందమును జెంది, తన మనోరథము ఫలించినదని మిక్కిలి సంతోషించి, వరాహ స్వామిచే వీడ్కోలు పొంది శ్రీనివాసుని నిలయము చేరెను. శ్రీనివాసుఁడా వకుళమ్మను గాంచి సంతోషభారమున 'అమ్మా!' అని ఆనందాశ్రువులు కన్నుల నిండ ఆమెకు నమస్కరించెను. వకుళమ్మ శ్రీనివాసుని తనివి తీర కౌఁగిలించుకొని చిన్ననాటి శ్రీకృష్ణునిగా భావించి, ముద్దాడి శరీరము నిమిరి, "నాయనా!" అని మాటాడలేక కొంత తడవట్లే యుండెను. శ్రీనివాసుఁ డామె విధమును మార్చుటకై "అమ్మా!' తలమీఁది గాయము నొప్పిగా నున్నది." అనగానే వకుళమ్మ మాయవీడి, తెప్పరిలి, "నాయనా! ఇప్పుడే మందు వేయుదునని చెప్పి లేచిపోయి వనములోఁ గొన్ని మందు ఆకులను తెచ్చి పసరుదీసి జిల్లేడు దూదితో పట్టువేసెను. తగిన ఉపచారములు చేయుచు, ప్రతిదినము గాయమునకు కట్టుగట్టుచు, తగిన ఫలహారము లిచ్చుచు చంటిబిడ్డను పోషించినట్లు సేవఁజేయుచుండెను.

కొన్నాళ్ళకు గాయము మానిన పిదప శ్రీనివాసుఁడు వనములకుఁబోయి కందమూలములు, పండ్లు, నివ్వరిధాన్యము, వెదురు బియ్యము, తేనె మున్నగు ఖాద్యములఁదెచ్చి యిచ్చుచు ఆమె కత్యంత ప్రీతిపాత్రుఁడై మెలగుచుండెను. వకుళమ్మ శ్రీనివాసునకు ప్రియమైన వంటకములు చేసిపెట్టుచు పుత్త్రివాత్సల్యమున శ్రీనివాసుని అత్యంత గారాబముగ చూచుకొనుచుండెను. జన్మాంతర మందలి యశోదమ్మ శ్రీనివాసుని శ్రీకృష్ణునిగనే భావించి, ఆతని కిష్టమైన వంటకములు అలంకరణములు చేయుచు తన జన్మ సార్థకము గావించుకొనుచుండెను. శ్రీనివాసుఁడు

వకుళమ్మను గన్నతల్లిగా భావించి అత్యంత ప్రేమ, భక్తి, మర్యాదలతో, నామె మనస్సుకెక్క వినయమున వర్తించుచుండెను.

## 8. ఆకాశరాజు తొండమానుల జన్మవృత్తాంతము:

పూర్వము మాధవుఁడను వైదికశిఖామణి పరమ నిష్ఠాగరిష్ఠుఁడై యుండి, విధివశంబున కుండల యను వనితను కామించి కామాతురుఁడై బలాత్కారమున భోగించి, ఆమెను భార్యగా చేసికొని కొంతకాలము వనములందే చరించుచుండెను. కొలఁది కాలమునకు కుండల కాలవశంబున మరణించెను. ఆ తురువాత మాధవుఁడు బుద్ధిచలింప, పిచ్చివానివలె నందు నందు తిరుగుచు విధివశంబున సత్సంగమునఁజేరి వారితోఁ బుణ్యస్థలంబులకు యాత్రలు చేయుచు కపిలాది వేంకటాచల తీర్థములందు స్నానమొనర్చుచు, స్వామిపుష్కరిణిలో స్నానముఁ జేసి, వరాహస్వామిని దర్శించి పరమ పావనుఁ డయ్యెను. పూర్వజన్మ సుకృతమున వేంకటాద్రి యందు దివంగతుఁడై మరుజన్మమున వేంకటాచలప్రాంత చోళరాజ్యమును పాలించు చంద్రవంశపురాజగు సుధర్మునకు ధర్మపత్నియగు మనోరమాదేవి యందు పుత్త్రుఁడై జన్మించి, ఆకాశరాజన్న నామమున పెరిగి పెద్ద వాఁడగుచుండెను.

ఆకాశరాజు జన్మించినది మొదలు రాజ్యమున మంచి వర్షములు కురియుటచేత, జలవసతు లేర్పడి, మంచిపంటలు పండుచుండెను. మంచి పచ్చిక లభించుటచేత గోవులు చక్కగా పాలిచ్చుచుండెను. ఈతిబాధలు లేక ప్రజలు పాడిపంటలతో సంతోషముగ జీవించుచుండిరి.

ఒకనాఁడు సుధర్ముఁడు మృగయా విహారార్థము వనములకేగి, వేటాడఁదగిన వన్యమృగములు కనఁబడనందున వాని నన్వేషించుచు వేంకటాచల ప్రాంతారణ్యమున కేగెను. అట ఘాతుకమృగములను గని వానివలన సాధువులకు, సాధుమృగములకు కీడుగల్గునని, సింహశార్దూలా దుల సంహరించి, చాల దప్పిగొని జలములకై వెదకి వెదకి, కడకు శేషాద్రి క్రిందిభాగమున నున్న కపిలతీర్థమునుఁ జూచెను.

సుధర్ముఁడు కొలనిలో దిగుచు నెట్టయెదుట నొక కన్యారత్నము జలకమాడుచుండుటను గాంచెను. సుధర్ముఁడా కన్యయందు మోహమున ఆమె దరిఁజేరి పిదప తన యభిలాష నామెకుఁ దెలియఁ జేసెను. అప్పుడా కన్య, అయ్యా! నేను ధనంజయుఁడను నాగరాజు ఏకైక పుత్రికను. మా తండ్రి నన్ను సుప్రసిద్ధవంశజుఁడైన క్షత్రియున కిచ్చి పెండ్లి చేయఁదలంచి యున్నాఁడు. మా తండ్రి యభిమతమునకు భిన్నముగా వర్తింపఁజాల" అనెను.

"అట్లయిన నేను చంద్రవంశపు క్షత్రియుఁడను, ఈ ప్రాంతపు చోళ రాజ్యమును బాలించుచున్నాఁడను. క్షత్రియులకు గాంధర్వవివాహము ధర్మమైనదే"

"కావచ్చును. అయిన నా దొక్కమాట. నీ వలన నా గర్భమున జనించు కుమారునకు రాజ్యాభిషేకము చేయునట్లు మాటనిమ్ము."

"నా కిదివరకే ఒక కుమారుఁడు గలఁడు. జ్యేష్ఠుఁ డుండగా కనిష్ఠునకు రాజ్యమిచ్చుట తగదు."

"అట్లయిన రాజ్యమటి నిరువురికి సమభాగములుగా విభాగించి యిమ్ము."

ఆ మాటలకు సుధర్ముఁడు సమ్మతించి, సంతోషపడి తన వ్రేలి యుంగరము తీసి నాగకన్యక వ్రేలికి వేసి గాంధర్వమున వివాహమాడి కొంతకాల మా ప్రాంతమున వినోదముగ, ఆ దొండతీఁగల పొదలక్రింద విహరించుచు నివసించియుండెను. ఒకనాఁడు నాగకన్య తాను నాగలోకమునకుఁ బోవలయునని రాజుతోఁ జెప్పఁగా రాజందులకు సమ్మతించి "నీ గర్భమున జనించు కుమారుని పెంచి పెద్దవానినిఁ జేసి నాయొద్దకుఁ బంపుము. అట్లు పంపునపు డాతని వ్రేల నేను నీ కిచ్చిన రత్నాంగుళీయకమును వేసిపంపిన, అది నాకు గుర్తు పరచును. నే నా కుమారుని చేరఁదీసి అర్ధరాజ్యమునకు నభిషిక్తుని చేసెద" అని యొప్పించి వీడ్కొలిపెను.

నాగకన్య నిజలోకముఁజేరి తండ్రితో జరిగిన వృత్తాంతమును జెప్పఁగా చోళరాజుల వృత్తాంత మెఱిఁగియున్న ధనంజయుఁడు వారి వివాహమునకు

సంతోషించెను. ఇట్లుండ కొన్నాళ్ళకు నాగకన్య నవమాసములు నిండి చక్కనికుమారునిఁ గనెను. ఆ కుమారుని పదునాలేండ్లు పెంచి, విద్యలు నేర్పించి, తన తండ్రి యాజ్ఞనుపొంది ఒక శుభదినమున కుమారుని దగ్గర కూర్చుండఁబెట్టుకొని "నాయనా! నీ విఁక రాజధర్మములను, క్షత్రియోచితవిద్యలను నేర్చుకొనుటకై నీ తండ్రికడకు పోవలసియున్నది. భూలోకమున వేంకటాచలప్రాంతమును నీ తండ్రి సుధర్ముఁడను చోళరాజు పాలించుచున్నాఁడు. నీ వీ రత్నాంగుళీయకమును ధరించి, నాగలోకము నుండి భూలోకము చేరు సమీపమున కపిలతీర్థ మున్నది. ఆ చెంత ఆ దొండతీఁగల పొదలున్నవి. నీవు రాజ దర్శనమునకు ఁబోవునపుడు ఆ దొండతీఁగలు నీ నడుమునకు చుట్టుకొనిపోయి యీ యుంగరమును జూపుము" అని యుంగర మిచ్చి, బుద్ధిమాటలు చెప్పి కొంతదూరము పుత్త్రునితోఁ బ్రయాణముచేసి సాగనంపెను.

ఆ కుమారుఁడు తల్లి చెప్పిన ప్రకారము పాతాళమార్గము గడచి భూలోకమునఁ బ్రవేశించి, కపిలతీర్థము దర్శించి ఆ ప్రాంతమందలి ఆ దొండతీఁగలు కొన్నింటిని తీసికొని, వానిని తన నడుము నకుఁ జుట్టుకొని, నారాయణపురముఁ జేరి, అందంతఃపురము సమీపించి రాజదర్శనమునకు నిరీక్షించుచుండెను. రాజపరివార మా కుమారుని రాకను రాజునకు విన్నవించిరి. రాజాజ్ఞప్రకార మా భటులు బాలకుని రాజాంతఃపురము ప్రవేశ పెట్టిరి. సుధర్ముఁ డా కుమారుని గాంచి, నాగకన్య వృత్తాంతమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని, కుమారుని చేతి యుంగరమును, నడుమునకు చుట్టియున్న ఆ దొండ తీఁగలను చూచి, తాను నాగకన్యతో విహరించిన విధమును, ఆమెతో నాడిన బాసను ఆకళింతకుఁ దెచ్చుకొని, పుత్త్రగాత్రపరిష్వంగ సుఖం బనుభవించి, ఆ కుమారుని వృత్తాంత మంతయు తనభార్యకు చెప్పి, కుమారుఁని ఆకాశరాజునకు, తక్కిన బంధుమిత్ర పరివారములకు పరిచయ పఱచి, ఆ దొండతీఁగల గుర్తుగా నా కుమారునకు తొండమానుఁడను నామ కరణము చేసి, తన రాజ్యమును నారాయణపురము ముఖ్య పట్టణముగ పశ్చిమోత్తర భాగములు జ్యేష్ఠపుత్త్రుఁడైన ఆకాశరాజునకు, తూర్పు దక్షిణ భాగములు ద్వితీయకుమారుఁడు తొండమానునకు నిర్ణయించి, వందమంది

మార్బలముతో దాసదాసీజనంబులఁ వలసిన పరివారముంతో రెండు సమ భాగ్యవంతములైన [illegible] విభజించెను. [illegible] సువర్ణముఖీనది పశ్చిమభాగమునకు పెద్ద[illegible] నిర్మించి, కోట [illegible] తొండమానునకుఁ గట్టించెను. తొండమానుఁడు ఆ క్రొత్తరాజ్యవిభాగమునకు తొండమనాఁడని నామకరణము చేసెను. సుధర్ముఁడిట్లు రాజ్యవిభాగ మొనర్చి నాగకన్యకుఁ దా నిచ్చినమాట నెఱవేర్చెను. కాని ఆకాశరాజు, తొండమానుఁడు పసి వారుగా నుండుటచే సుధర్ముఁడే రాజ్యపాలన చేయుచుండెను. కుమారు లిరువురు అన్యోన్యానురాగమున తలిదండ్రుల మాట జవదాటక ప్రజల సంతోషపఱచుచు పెరుగుచుండిరి.

[illegible] నాటి [illegible], ఈ నాటికి సువర్ణముఖీనదీతీరమున శ్రీకాళహస్తికి నిర్ఋతిభాగమున నున్నది. ఆ ప్రాంతమంతయు నేఁడు చిన్నచిన్న గ్రామములు ఏర్పడియున్నవి. ఆనాటి కోటగోడలు చాల కాల ముండినవి. ఇప్పుడచ్చట అగడ్తలు కోటపునాదులు గలవు. తొండ మానుఁడు త్రవ్వించిన పెద్దచెరువు-తొండమనాటి చెరువను పేర నేటికి ప్రసిద్ధముగ నున్నది. కోటలో తొండమాను చక్రవర్తి గట్టించిన వేంకటేశ్వ రాలయము నేటికి గుర్తుగా నిలిచియున్నది. ఆకాశరాజు తొండమానులకు తండ్రి సుధర్ముఁడు రాజ్యభాగముల పంచియిచ్చి నను ఆ యన్నదమ్ములు శ్రీరామ లక్ష్మణు లట్లు పాయని మైత్రితో నుండిరి రెండు రాజ్యములు నారాయణపురమునం దుండిన రాజుల చేతనే పాలింపఁబడుచుండెను. కుమారు లైకమత్యమునఁ మెలఁగు చుండుటకు, వారి వారి రాజ్యములు ప్రజామోదకరముగ పాలింపఁ బడుటకు సుధర్ముఁడు మిక్కిలి సంతోషించి, కుమారు లిరువురకు వివాహములుచేసి, ప్రజాపాలన ధర్మముల నుపదేశించి మనశ్శాంతితో వేంకటాచలముఁ జేరి తప మాచరించుచు ముక్తిఁ బొందెను.

ఆకాశరాజు భార్య ధరణీదేవి ఆ దంపతులు అందచందము లందును, సద్గుణములయందును, దైవభక్తియందును, ప్రజాసంక్షేమ కార్యములందును సహధర్మచరులై ప్రజల కత్యంతానందదాయకముగ నుండిరి. ఆ రాజ్యమున

ప్రజలు సుభిక్షముగ ప్రశాంత జీవనము చేయుచు రాజభక్తిపరులై పాలక పాలిత ధర్మములఁ దెలిసి, తమ కావశ్యకములైన పనులను రాజుగారికి మనవి చేసికొని నెఱవేర్చు కొనుచుండిరి అనాటి ప్రజలు స్వార్థమును విడనాడి పరమార్థమునకు పాటుపడువారు. సోమరులు గాక కాయకష్టము చేసి, సుఖజీవనము చేయుచుండిరి. [illegible]హారము [illegible] పన్నులు చెల్లించు చుండిరి అది [illegible] ధర్మ[illegible] అతిథి అభ్యాగతుల[illegible] రాజు స్వతము[illegible] [illegible]డెను.

తొండమాను[illegible] దాక్ష్యభాగమును సమర్థతతో పాలించుచుండెను. తాను పాండ్యరాజ పుత్త్రికను వివాహమాడెను. ప్రజల సేద్యపునీటికై పెద్దచెరువును త్రవ్వించి దానికి జలాధారమునకై సువర్ణముఖీ నదినుండి కాలువ త్రవ్వించెను. ఆ చెరువు ఆ రాష్ట్రమంతటికి తగిన జలమును సమకూర్చునంత పెద్దది. ఈ నాటికీ అది తొండమానాఁడు చెరువని పిలువఁబడుచున్నది.

ఇట్లు నారాయణపురము, తొండమనాఁడురాజ్యము లొక్కసమష్టి రాజ్యముగ అన్నదమ్ము లిద్దరు అన్యోన్య భావంబున ప్రజల క్షేమమే ప్రధానముగఁ దలంచి పాలించుచుండ ప్రజలు చల్లగా వర్ధిల్లుచుండిరి.

## 9. ఆకాశరాజునకు పద్మావతి లభించుట -- వసునాయకుఁడను పుత్త్రుఁడు గల్గుట:

ఆకాశరాజు, ధరణీదేవి యౌవనసుఖము లనుభవించుచుండిరే కాని ఫలసంపద పొందలేకపోయిరి. ధరణీదేవి వ్రతములు చేసెను. ఎన్నో నోములు నోచెను. దానధర్మములు, సంతర్పణలు, నాగప్రతిష్ఠలు చేసెను. ఆకాశరాజు పుత్త్రిని మోముఁ జూడకున్న పుణ్యగతులుండవను [illegible] మాటలు తలంచి, పరిపరివిధముల వింతించుచు, సంతానాభిలా[illegible] ణాది పుణ్యకాలములందు వేదశాస్త్ర పారం గతులైన పండితులకు, [illegible] దగిన దానములు చేసి సంతృప్తి పఱచి, వారి ఆశీస్సులఁ బొందుచుండెను. జ్యోతిష్కులఁ బిలిపించి తన జాతకఫలము నడుగుటయు, వా రా రాజు

జన్మలగ్న, రాశి ఫలముల ననుసరించి సంతాన భాగ్యము గలదని చెప్పు చున్నను సంతులేని బాధ పెనుభూత మట్లు మనస్సును వేధించుచుండ, రాజు వ్యాధి కాని వ్యాధి, మనోవ్యాధికిఁ జిక్కియుండెను.

ఒకనాఁడు రాజు తపోధనులను, వేదశాస్త్రపండితులను, జ్యోతిశ్శాస్త్రవేత్తలను బిలిపించి సభచేసి తనకు సంతానము లేని కారణ మేమోఁ దెల్పుడని ప్రార్థించెను. వారందరు రాజుగారి భూతవర్తమాన భవిష్యత్తులను, జన్మకుండలిని శాస్త్రవిధానములను జక్కగా పరికించి తమ తమ ప్రజ్ఞల ననుసరించి ఏకాభిప్రాయమున రాజుతో, "రాజా! పూర్వము సూర్యవంశపురాజు ముప్పురు భార్యలుండియు సంతానము లేకుండినందున తమ కులగురువగు వసిష్ఠుని యానతిని వేంకటాచలము సందర్శించి పుత్రకామేష్టి జరిపి నలువురు పుత్త్రరత్నములఁ బడసెనని పురాణమునఁ గలదు. కావున నీవును వేంకటాచలము సేవించి పుత్త్రప్రాప్తికై యజ్ఞ మొనరింపుము. సంతానవంతుఁడ వయ్యెద"వని చెప్పిరి.

ఆ మాట లాలించి రాజు మిక్కిలి సంతోషించి, సభ కేతెంచిన మహా మునులు, వేదశాస్త్రవేత్తలు, జ్యోతిష్కులు, తన పురోహితులఁ బ్రార్థించి యాగప్రయత్నము సఫలీకృత మొనర్పఁ గోరెను. వారును మంచిలగ్నమున యాగమునకుఁ దగిన భూమి నిర్ణయించిరి. ఆకాశరాజు వేంకటాచల దర్శనము చేసివచ్చి పెద్దలు నిశ్చయించిన సుముహూర్తమున, క్షేత్రమును బంగారునాఁగటితో దున్నుట కుపక్రమించెను. ఆ సుముహూర్తమున మహ ర్షులు, వేదశాస్త్రపురాణపండితులు, యాగ పురోహితులు క్షేత్రమునఁ జేరి జరుపవలసిన తంతు వేదోక్తముగ జరుపుచుండిరి. ముహూర్తసమయమున గురుహోరయందు ఆకాశరాజు సర్వదేవతల, అష్టదిక్పతుల పూజించి, వారి యనుగ్రహ మంత్రాక్షతలు శిరమునఁ దాల్చి పెద్దల యనుమతిఁ బొంది నాఁగటి మేడిపట్టి భూమి దున్నుట ప్రారంభించెను. తొలుత రాజు రెండు కొండ్రలు దున్ని మూఁడవకొండ ప్రారంభించెను. కొంతవరకు నాఁగలిసాగి ఒక చో నాఁగేటికొఱ్ఱు భూమిలో నేదో యడ్డ మేర్పడుటచే తగులుకొని ముందుకు సాగలేదు. అప్పుడు పనివా రా చోట గునపములతో భూమిని త్రవ్వగా ఒక పెద్ద మందసము బయలుపడెను. దానిని మెలఁకువగా త్రవ్వి

పైకి తీసిరి. పెద్ద లందరు గుమిగూడిరి. రాజు మందసపుమూత తెఱచెను. అందు మెత్తని పద్మములందు నిండు చంద్రబింబమువలె ప్రకాశించు కన్యక పరుండియుండెను. ఆ సదస్సు ఆనందమునకు అవధులు లేవు. వారందరు రాజును పెక్కువిధముల దీవించి, "రాజా! జనకమహారాజునకు పూర్వము సీతగా లక్ష్మీదేవియే కుమార్తెయై లభించినది. నీ పుణ్యమున ఆ లక్ష్మీదేవియే పద్మముల పాన్పున నీకు పుత్త్రికగా నిపుడు లభించినది. ఈమెకు పద్మావతి యని నామకరణ మొనరింపుము" అని చెప్పి, ఆ బిడ్డను పొత్తిళ్ళతో నెత్తి పురోహితుఁడు రాజచేతుల కందించెను. రాజా బాలికను సంతోషమున నెత్తుకొని పెద్దలయనుమతిఁబొంది అంతః పురమునకు పోయెను. అట ధరణీదేవి చారులవలన ముందుగనే ఆ సువార్త విని భర్త కెదురేగెను. రాజా బిడ్డను మహానందమున భార్య కందించి, "పద్మావతి మనకు లభించినది. కన్న బిడ్డగా పోషింపు" మనెను. రాణివాసము మహానందముగ నుండెను. ఆనాఁడు పట్టణప్రజలు మహోత్సాహముతో వేఁడుకలు చేసిరి. క్రమముగా నామకరణోత్సవాదుల వేఁడుకలుజరిగెను. పండితులను పురోహితులను. రాజా సముచితముగ గౌరవించెను. బీదలకు అన్నదానము చేయించెను. వేదశాస్త్రవేత్తలకు హిరణ్య భూ గోదానము లనేకము లొసంగెను. రాజ్యమంతయు సంతోషముగ నుండెను. తొండమానుఁడును అన్న గారికి పుత్త్రిక లభించి నందుల కమందానందము నొందెను.

బాలిక క్రమముగా పక్షములు మాసములు జరుగుచుండ ఊఁ కొట్టుచు, తల్లిదండ్రుల గుర్తించుచు, చుట్టుప్రక్కలచూచుచు, నవ్వుచు బోర్లబడి జరుగుచు, దోఁగాడుచు, క్రమముగా మాసములు గడుచుచుండ తప్పటడుగులతో నడయాడసాగెను. తల్లిదండ్రుల కా పద్మావతి ప్రాణ ప్రియముగ నుండెను. ఆమె తొక్కుపల్కులను ముచ్చటగా వినుచు లాలించుచుండ రెండు వసంతములు జరిగినవి.

అప్పటికి అంతర్వత్నియై యుండిన రాణి ధరణిదేవికి నవమాసములు నిండినవి. సూర్యుఁడు మేషమున, గురువు కటకమున ఉచ్చరాసులందున్న శుభలగ్నమున ధరణీదేవి తేజోవంతుఁడు, రాజలక్షణ లక్షితుఁడగు కుమారుని

గనెను. రాజు చిరకాలవాంఛ నాటితో తీరెను. అతని యానందసాగరము ఉవ్వెత్తున తరంగములతో నుయ్యాలలూఁగుచుండి నట్లుండెను. రాజ్యమందలి ప్రజలును సంతోషభరితులైరి. రాజు శాస్త్రపండితుల, పురోహితులఁ బిలిపించి క్రమముగా జాతకర్మ, నామకరణము, డోలారోహణాది సంస్కారములు మిక్కిలి వేఁడుకగా జరిపించెను. బాలుఁడును శుక్లపక్ష చంద్రునివలె వృద్ధిపొందుచు క్రమముగా అన్నప్రాసన, కర్ణవేధ, కేశఖండనాక్షరాభ్యాసాది సంస్కారములఁ బొంది పెద్దవాఁ డగుచుండెను. ఆ రాకుమారుఁడు వసునాయకుఁడన్న ప్రసిద్ధనామమున సకలవిద్యలు నేర్చి తల్లిదండ్రుల నానందపరవశులఁ జేయుచుండెను. ఇట్లు ఆకాశరాజునకు పద్మావతి యను పుత్రిక, వసునాథుఁడను పుత్రుఁడు గలిగిరి.

పద్మావతి సాక్షాత్తు మహాలక్ష్మియే యని ఆమెను గాంచిన వా రనుచుండిరి. సిరిసంపదలకు తోడు ఆమె సౌందర్యసంపద, సుగుణ సంపద, అన్నిటినిమించి శీలసంపదఁ గలిగియుండెను. పద్మావతి వసునాయకుఁడు శైశవక్రీడలాడుచు, విద్యలనేర్చుచు శరీరసౌష్ఠవముఁ గలిగియుండిరి. పద్మావతి తన యీడు చెలులతో గూడ ఆటపాటలతో ప్రమదవన విహారములతో, అంతఃపురమున కోలాటములు, బంతులాటలు మున్నగు క్రీడలాడుచు ఆటపాటలచేఁ దల్లిదండ్రులకు నిండుసంతోషము గలిగించుచుండెను. వసునాయకుఁడును చెలికాండ్రతోఁగూడ యాడుచు సాము చేయుచు, గురువులకడ శ్రద్ధాభక్తులతో వినయవిధేయతలతో మెలఁగుచు శాస్త్రవిద్యలు, అర్థశాస్త్రము, ధర్మ న్యాయశాస్త్రములు చదువుచుండెను. తల్లిదండ్రుల కా యిరువురు రెండు కనులుగా నుండిరి.

## 10. శ్రీనివాసుఁడు వనమున విహరించుట:

అది వసంతఋతువు; ఋతురాజము. ప్రకృతిశోభకు విజృంభణ కాలము. సెలయేరులు తియ్యని తేటనీటితోఁ బ్రవహించుచుండును. లతాగుల్మములెల్ల నవనవ కిసలయములతో వివిధపర్ణ పుష్పములతో, పూఁబిందెలతో, కాయలతో, పండ్లతో నిండియుండును. ఫలవృక్షములు తమ ఫలభారమున

వంగి బాటసారుల నాహ్వానించుచు, తమఫలంబుల గ్రహింపుఁ డన్నట్లుం డును. వసంతము మనోహరమైన పుష్పవిలాసమునకు సహజ ప్రకృతి. సూర్యుఁడు వృక్షములకు, పచ్చిక బయళ్ళకు, పుష్పములకుఁ దగినంత వెచ్చఁదనమును గలిగించి, వాని యింపు సొంపులను గాంచుచు వీడలేక పశ్చిమాద్రికి మెల్లఁగఁ జేరుచున్నాఁడా యన్నట్లుండును.

వన్యమృగముల కది ముచ్చట మురిపంబులకు సమయము. అవిచక్కని లేఁబచ్చిక మేసి, బలసి సంతోష విహారములతోఁ గూడియాడుచుండును. కోయిలలు తియ్యని మామిడిచిగుళ్ళు మెక్కి మత్తిలి కూఁ కూఁ కూఁ యని యరచుచు విహరించుచుండును. నోరు లేనిప్రాణులే వసంతకాల శోభ కత్యంతానంద పరవశములై తమను గాంచిన వారినిసైత ముద్రేక పరచుచుండును. అట్టిచో యువతీయువకుల వసంతవిహారములఁగూర్చి చెప్పనేల? వారిని వయస్సు, పరిసరములు ఉత్సాహభరితులఁను జేయుట ప్రకృతి స్వభావము.

అంతఃపుర కన్యాలలామ పద్మావతి నవ నవ వసంతమును ...చూచు చున్నదా యన్నట్లుండెను. చెలులతోఁ గూడి, శృంగార వనంబుల, ఉప వనంబుల చిట్టడవుల, ఆడుచుపాడుచు వసంతఋతువు నానందముగా ననుభవించుచుండెను.

వేంకటాచలమున నిత్య యౌవనశోభతో తొణికిసలాడు వేంకటాచల పతి, సుపర్వుఁడై, ఆ వసంతసమయమున ఉదయమునలేచి పుష్కరిణిలో స్నానమాడి పీతాంబరముల ధరించి, నుదుట చక్కని చిక్కని నామమును దిద్దుకొని, మేన శ్రీ చందన మలఁది, అమ్మ కట్టియిచ్చిన పొగడ పూహారం ధరించి, వకుళమ్మ వడ్డించిన బిలభోగము నారగించి తాంబూలము వేసికొని, ధనుర్బాణములఁ దాల్చి, బంగారు పాదుకలను దొడిగి, స్మరణమాత్రమున సంసిద్ధమైన అశ్వము నధిరోహించి, వకుళమ్మవద్ద సెలవు తీసికొని వేంకటాచల విహారమునకు వెడలెను. ఘాతుక మృగముల శిక్షించి సాధు మృగంబుల రక్షించును. వేఁటలో నలసిన వేంకటాచలపతి ఒకచోట గున్న మామిడి చెట్టును చూచి, గుఱ్ఱముదిగి చెట్టునీడలో గుఱ్ఱమునుకట్టి తాను

కొంత తడవు విశ్రమించెను. సాయంసమయమున, ఆ సమీపప్రదేశములు తిరిగి తన కిష్టమైన కాయలు పండ్లు గడ్డలు సమకూర్చుకొని, గుఱ్ఱమునెక్కి నివాసమునకు వచ్చి లమ్మ కానందము గూర్చుటాతని నిత్యకృత్యము.

## 11. ఉపవనమందున్న పద్మావతికి నారదుఁడు సాముద్రికము దెల్పుట:

ఒకనాఁడు పద్మావతి చెలులతో నుపవనమున విహరించుచు పుష్పా పచయ మొనర్చి, మాలగాఁ గట్టుచుండెను. చెలులును పూలు పండ్లు గోరింటాకు సంగ్రహించుట కందందు తిరుగుచుండిరి. పద్మావతి దట్టమైన పొగడచెట్టు నీడ చేరి యందొక శిలాఫలకమునఁ గూర్చుండెను.

ఆ సమయమున త్రిలోకసంచారి సర్వజ్ఞుఁడైన నారదమహర్షి కన్నె మనస్సులో ప్రేమబీజము నాటనేమో యన వృద్ధముని రూపమున చెంత కేతెంచెను. పద్మావతి యాతనిని గాంచి భీతిల్లుటను గ్రహించిన నారదుఁడు "అమ్మా నేనొక వృద్ధ తాపసిని. భయపడకు, నీ మేలు కోరి వచ్చితిని. నీకుఁ దగిన వరుఁడెవ్వఁడైయుండునా యని నీ సాముద్రికముఁ జూడ వచ్చితిని. నీవు సామాన్య వనితవు కావు. ఆకాశరాజు పూర్వపుణ్యమువలన లభించిన దేవాంశ సంభూతురాలవు. నీ యందచందములకుఁ దగిన వరుఁ డెవ్వఁడో చెప్పెద. ఏదీ నీ యెడమ హస్తము చూపు" మనిన నా పద్మావతి శిలాఫలకము దిగి మునికి నమస్కరించి, ఆతని నా శిలాఫలకమున కూర్చుండకోరి, ముసిముసి నవ్వుల, భీతహరిణేక్షణయై మునికి సిగ్గున తలవొంచి తన వామ హస్తము చూపెను. ఆమె అరచేతి ముద్రలను నారదుఁడు కొంత తడవు పరీక్షించి, కనుబొమ్మలెత్తి తల పంకించుచు, మిక్కిలి సంతోషముఁ జెందినవానివలె "ఆహాహా! అమ్మా! నీవు నిజముగ జగన్మాతవు. నీ వయోరూప సంపదకుఁదగిన వరుఁడు జగన్నాథుఁడే యగును. సందేహము లేదు. పూర్వము రుక్మిణీదేవి శ్రీకృష్ణుని రూపగుణాదులు విని యాతనిని నిజవల్లభునిగా నిశ్చయించుకొన్నది. పురుషోత్తముఁడైన వరుని వివాహమాడెదవు. నీ తలఁపుపూలు పుష్పించి

ఫలింపనున్నవి. భర్తృకారకుఁడైన శుక్రుఁడు నీ కన్ని విధముల అనుకూలుడై మీనమం దున్నాఁడు. కంకణ ప్రాప్తియు సమీపించినది. వరుఁడే నిన్ను వెదకికొనుచు రాఁగలఁడు. దేవతలే నీ పెండ్లి పెద్ద లగుదురు" అని నారదుఁడు చెప్పుచుండ పద్మావతి హృదయగతమగు నానందము ముఖ మునఁ బ్రతిఫలించుచుండెను. నారదుఁడు తన కార్యము నెఱవేరినందున ఆమె నాశీర్వదించి వెడలిపోయెను.

## 12.శ్రీనివాసుఁడు ఉద్యానవనమున పద్మావతిని గనుట:

ఒకనాఁడు శ్రీనివాసుఁడు వాడుకచొప్పున వనసంచారమునకు బయులు దేరెను. అమ్ములపొదిని వీపున గట్టుకొని, చేత విల్లునమ్ములను ధరించి, చిత్రవర్ణిచల్లాడము, అంగీని ధరించి తలకొక రుమాలుగట్టి వేఁటకానివలె గుఱ్ఱమెక్కి పోవుచున్న కుమారుని చూచుచు తల్లి వకుళమ్మ చూపుమేర దూర మట్లే నిలిచియుండి ఆ పిదప నివాసము లోనికిఁబోయెను.

గుఱ్ఱ మతివేగముగాఁ బోవుచు మార్గమున పెద్దపులులు రెండు పెనఁగులాడుచుండుటచే తన వేగము తగ్గించి సకిలించెను. శ్రీనివాసుఁడు వెంటనే ఆ పులులఁగాంచి ఒక్క బాణమువ క్షణమాత్రమున నా పులుల నుక్కడఁగించి, గుఱ్ఱమును తట్టి మరల వేగమున దారి సాగిపోవుచుండెను. కొంతదూరము పోవుసరికి లేళ్ళు తమ పిల్లలతో గంతులు వేయుచు శ్రీని వాసున కెదురుగా భయమున పరుగెత్తు చుండుటను గని శ్రీనివాసుఁడు ముందునకు చూడ ఒక మత్తశుండాలము ఘీంకరించుచు వచ్చుచుండెను. లేళ్లభీతికి కారకమైన మత్తశుండాలము శ్రీనివాసుని సమీపించుచుండెను. వెంటనే శ్రీనివాసుఁడు వింట బాణము సంధించి గజముపై నెక్కు పెట్టునంతలో నా గజము భీతిచే వెనుదిరిగి వేగముగఁ బోవుచుండెను. శ్రీనివాసుఁడా కరిని వెంబడించి పోవుచుండ నాగ మొక వనమును బ్రవేశించి ఘీంకారము చేసి, శ్రీనివాసునకు తొండమెత్తి నమస్కరించి కనఁబడక పోయెను. శ్రీనివాసుఁ డాశ్చర్యమున నలువైపులు చూచుచు మెల్లగా వనములోఁ బ్రవేశించి గజముకొఱకు వెదకుచుండెను.

అది ఆకాశరాజు నిర్మించిన ఉపవనము. ఇప్పుడు పద్మావతి నిత్యమా వనవిహార మొనర్చుచు పూలు ఫలముల సేకరించుకొని మరల నగరమునకుఁ బోవుచుండును. ఆనాఁడు పద్మావతి చెలులతో వచ్చుచు, చెలులను పూవులను సేకరింకపఁబంచి తానొంటరిగ పొగడ చెట్టుక్రింది శిలాఫలకమునఁ గూర్చుండి యుండెను. శ్రీనివాసుఁడా వనమంతయు ఏనుఁగు కొఱకు వెదకుచు వచ్చి పద్మావతిని చూచి ఒక్క క్షణమాగి ఆమె సౌందర్యమునకు సమ్మోహితుఁడై గుఱ్ఱము దిగి మెల్లఁగా నామెవైపు వచ్చుచుండెను. జగన్నాథుఁ డామెను రమాదేవిగా భ్రమసి సమీపించుచుండెను.

ఎవరో నూతన పురుషుఁడు వచ్చుటను గాంచిన పద్మావతి సంభ్రమోత్సాహ భయంబులు ముప్పిరిగొన, రాజపుత్త్రియగుటచే ధైర్యమున శిలాఫలకమునుండి లేచి, "ఎవరు మీరు? రాజపుత్త్రినైన నే నొంటరిపాటున నుండఁగా నన్ను సమీపింతు రేల?"

"తన్వీ! నే నొక రాజవంశస్థుఁడను. శ్రీకృష్ణుఁడను. నా తల్లి దండ్రులు దేవకీ వసుదేవులు. నే నొక మత్తగజమును వెంబడించి వచ్చుచుండ ఆ గజ మీ వనములోఁ బ్రవేశించి కనఁబడలేదు. దాని కొఱకు వెదకుచుండ నిన్ను చూడఁగల్గితిని. నేను రాజకుమారుఁడ నగుటచే నీయం దనురాగము గలిగినది. క్షత్రియోచితమైన గాంధర్వ విధానమున నిన్నుఁ బెండ్లాడు తలంపున నున్నాఁడ" అనుచుండ పద్మావతికి ముందటిరోజు నారదముని చెచప్పినమాటలు చెవుల వినిపించుచుండ, ప్రేమబీజము మొలకెత్తి పెద్దదై తన కేదోవిధమైన యభిమాన మా పురుషునిపైఁ గల్గింప నేమియు పలుక లేక, తలవంచి, క్రీఁగంట నాతనిని చూచుచు నట్లే నిలచియుండెను. శ్రీనివాసుఁడామె యింగిత మెఱింగి చిఱునవ్వులతో రెండడుగులు ముందుకు వేయునంతలో దూరమందుండి వచ్చుచున్న పద్మావతి చెలు లాతనిని గాంచి కేకలు వేయుచు పరుగుపరుగున నచ్చోటి కేతెంచి పద్మావతి శ్రీనివాసులకు మధ్య నిలచిరి. శ్రీనివాసుఁడు నాలు గడుగులు వెనుకకు వేసెను. పద్మావతి ఒక నిట్టూర్పు విడచెను. చెలు లా పురుషునితో "అయ్యా! ఎవరు మీరు? చూడ గొప్ప వంశమునకుఁ జెందినట్లే

యున్నారు. ఒంటరిగా నున్న మా రాజపుత్త్రిని సమీపించు సాహస మేలచేసితిరి? జవరాలు ఏకాంతమున నున్నదని తలంచితిరా? వేయి కన్నులతో కనిపెట్టి మేముండఁగా, మగతుమ్మెదయైన ఆమెపై వ్రాలదు. హెచ్చరిక. మా రాజున కీ విషయము తెలిసెనా నీకు జరుగఁబోవు కల్యాణము నీకే తెలియఁగలదు. జాగ్రత్తగా వెనుదిరిగి చూడక వచ్చిన దారిఁబట్టి వెడలిపొమ్ము."

"వయోరూప గుణంబుల నీడైనతోడని జాడతెలిసి వచ్చితిని."

"ఏమయ్యా! శ్రుతి మించుచున్నది. మా రాజు ఆకాశరాజని తెలియదా?"

"ఆఁ--ఎప్పుడో తెలిసికొంటిని."

"తెలిసియుండియు మా రాజపుత్త్రిని సమీపింతువా?"

"భృంగము తన కావశ్యకమైన పుష్పముచెంత చేరుట తప్పా?"

"తప్పా! మహాతప్పు తీఁగలోనో, చెట్టుకొమ్మలోనో, ఉన్న పువ్వనుకొంటివా?"

"కాదు. అంతఃపురమున అల్లారుముద్దుగా పెంచఁబడుచు, కంటక యుతపత్ర మధ్యమందలి గులాబిపుష్పమే యని"

"ఓహో! అయ్యా! స్వామీ! మీ నర్మగర్భిత భాషణములిఁక చాలించి, దుష్టుల నతికఠినముగ శిక్షించు మా రాజున కీ విషయము తెలియక మునుపే తాము పలాయనము చిత్తగించవలె."

"మీరు తొలుత నా మాటలు చిత్తగించి మమ్మీచోట విడచి పొండు" అని శ్రీనివాసుఁడు పలుకగనే ఒక చెలి "విజయా? నీ వా గుఱ్ఱమెక్కి వేగముగా పట్టణమునకుఁ బోయి రాజుగారి కీ ప్రబుద్ధునిగూర్చి చెప్పి సైనికులఁ బిలుచుకొని రమ్ము" అన విని విజయ యను చెలి సమీపమందలి గుఱ్ఱమును చేరఁబోయెను. ఆ గుఱ్ఱమామెను దరిచేరనియ్యక ఎగురుచు,

వెనుక కాళ్లతో జాడింపసాగెను. కొంతమంది ఆమెకు తోడుగాఁ బరుగిడి గుఱ్ఱమును రాళ్ళతోఁ గొట్టసాగిరి. ఆ దెబ్బల కా గుఱ్ఱము క్రిందఁబడెను. అంత నొకచెలి "నేనే పరుగునఁబోయి రాజుగారినే పిలుచుకొని వచ్చెద" నని పోఁబోవ పద్మావతి యామె రెట్టఁబట్టి నిలిపెను. శ్రీనివాసుఁ డది గాంచి పకపక నవ్వసాగెను. అంత చెలులు "ఈతఁడు మతి మతిలోలేని పిచ్చి వాఁడేమో" అని పరిహాసముగ నవ్వసాగిరి. అపుడు శ్రీనివాసుఁడు "ఇప్పుడు తెలిసికొంటిరా యీ ప్రేమ పిచ్చివానిని" అనుచుండ చెలులందరు పద్మావతిని మధ్య నిడుకొని నగరమునకు బయలుదేరిరి. పద్మావతి యతనిని తిరిగి తిరిగి చూచుచు పోవుచుండెను. శ్రీనివాసుఁ డామెను చూచుచు అట్లే నిలిచియుండెను. పద్మావతి చెలులతోఁ గలసి వడి వడిగ అంతఃపురములోనికి దారితీసెను.

శ్రీనివాసుఁడు పద్మావతినే తలంచుచు చాలసేపు నిలుచుండి ఆమె పోయిన దారివైపు చూచుచుండెను.

సూర్యుఁ డస్తమించెను. సంజ చీకట్లు క్రమ్ముచుండెను. పాలకడలిపట్టి బావస్థితిని చూచి పరిహాసముగా నవ్వుచున్నాఁడా యను నట్లు ఉదయపర్వతమెక్కి చిరునవ్వులు చిందించుచు క్రమక్రమముగా నవ్వుల భేదములను తన వికాసములఁ జూపసాగెను. శ్రీనివాసుఁడు బావమఱఁది మబ్బు తెరచాటునుండి తొంగి చూచి నట్లుండుటకు సిగ్గిలి వెంటనే గుఱ్ఱమునుఁ జేరి దానిని తట్టి లేపి, ఎక్కి వేంకటాచలమందలి తన నివాసమునకుఁ బోవుచుండెను.

## 13. శ్రీనివాసుని రాకకై వకుళమ్మ నిరీక్షించుట -- శ్రీనివాసుని విచారమును గూర్చి యడుగుట:

వకుళమ్మ నిత్యము సంజవేళకే వచ్చెడు శ్రీనివాసుఁడు నాఁడు రాకుండుటకేమి ఆటంకమో యని ఎదురు చూచుచుండెను. నాఁడు పున్నమ. పట్టపగలట్లు వెన్నెలలో సర్వవస్తువులు కనఁబడుచుండెను. కాని తన పుత్త్రుని జాడ కనిపించలేదు. ఆమె ఏమేమో తలంచెను. రాత్రి

మూఁడుగడియలు దాటెను. శ్రీనివాసుని జాడ తెలియక చింతాక్రాంత యయ్యెను. అప్పుడామెకు దూరమున గుఱ్ఱపుడెక్కల చప్పుడు వినిపించెను. మఱికొంత తడవునకు కుమారుని రాకగాంచి చింత యుడిగి సంతోషమున నుండెను. కాని మునుపటివలె శ్రీనివాసుఁడు గుఱ్ఱము దిగి అమ్మను బలుకరించి తెచ్చినపండ్లు మున్నగునవి అందియ్యక, ఆనాఁడు గుఱ్ఱముదిగి దానిని తరిమివేసి తల్లితోఁబలుకక తలవంచుకొని నివాసములోనికిఁ బోయి పాన్పున పండుకొనెను. వకుళమ్మ కిది యేమియుఁ దోచని పరిస్థితిని గలిగింప మెల్లగా నామె కుమారుని దగ్గరకుఁజేరి, ఎన్నో విధములఁ బలు కరించెను. కాని శ్రీనివాసుఁ డేమియు బదులు పలుకలేదు. అప్పుడు వకుళమ్మ గద్గద కంఠమున, "నాయనా! నా తప్పేమి? ఏల నాతో మాటాడవు? నీకేమి కష్టము గలిగినది? నాతోఁ జెప్పుము. బిడ్డల యిడుమపాటు తలిదండ్రులు చూచి సహింపలేరు. నా హృదయ మెంత బాధపడు చున్నదో నీకుఁ దెలియదా? నిన్ను కలవర పెట్టిన దెవరు? ఏల? చెప్పిన నావలననైన సమకూర్చెదను. నీ మనస్సు స్తిమితపరచెదను" అన విని--శ్రీనివాసుఁడొక దీర్ఘమగు నిట్టూర్పు వదలి ప్రక్కకుఁ దిరిగి "అమ్మా! ఈనాటి సాయంకాలము వేంకటాచల ప్రాంతరాజ్యమును పాలించు ఆకాశ రాజు కూతురఁట, పద్మావతి యను కన్యకను జూచితిని. ఆమె తన వాడిచూపులతో నన్నాకర్షించినది. ఆమెయందు లగ్నమైన మనస్సును మరలించుకొనలేని స్థితిలో నున్నాను."

"నాయనా! అందని మ్రానిపండ్ల నాశింతువేల? నారాయణ పుర మేలు రాజుకూతురు పర్వతారణ్య నివాసుల నపేక్షించునా? ఆ రాజంగీకరించునా?"

"అట్టు గాదమ్మా? ఆ కన్నియ గూడ నన్ను ప్రేమించినటుల గ్రహిం చితిని. ఆమె నాకొఱకే పుట్టిపెరుగుచున్నది. పురోడాశమునకు నేనే యధికారిని గదా? నీవు వినవలతువేని ఆమె పూర్వజన్మ వృత్తాంతమును వినిపించెద వినుము" అని శ్రీనివాసుఁడు వకుళమ్మకు పద్మావతి కథ నిట్లు చెప్పెను.

## 14. పద్మావతి పూర్వజన్మ వృత్తాంతము:

ఒకానొకప్పుడు కుశధ్వజుఁడను మహర్షి హిమవత్ప్రాంతమున ఆశ్రమము నిర్మించుకొని నా యం దత్యంతభక్తితో నిత్యహోమాదులతో పూజ గావించుచు నిష్కాముఁడై నన్ను ఆరాధించుచుండెను. ఒక నాఁ డాతఁ డగ్నిపూజచేసి హోమ మాచరించుచు వేదమంత్రములతో నన్ను స్తుతించుచుండెను. ఆ హోమాగ్ని చెంతనుంచిన దర్భలపై ఒక పసిబాల రోదనమును విని, ముని యటు చూచి విస్మితుఁడై, ఆ ముద్దులొల్కు బాలను చూచి, ఆమె నా కొఱకే జన్మించినట్లు సంతోషించి, వేదమంత్రోపాసనా సమయంబున జన్మించిన ఆ బిడ్డకు వేదవతియని నామకరణ మొనర్చి పెంచి పెద్దచేసెను. ఆ బాల చిన్నతనమునుండి నా యందు భక్తిగలదై తండ్రికి పూజావేదిక శుభ్రపరిచి, ముగ్గులువేసి పూజకుఁ గావలసిన దర్భలు, పూలు, పండ్లు, జలము సమకూర్చు చుండెడిది. యుక్తవయస్సు వచ్చిన పిదప నొక నాఁడా వేదవతి తండ్రితో, "నాయనా! మహావిష్ణువును పెండ్లాడవలె నని కోరికగానున్నది. ఇఁక తమ యిష్టప్రకారము నడచుకొనుదాన నని" చెప్ప, మహర్షి తన కుమార్తెకుఁ గలిగిన యున్నతాశయమునకు సంతోషించి "అమ్మా! నీ యాశయము గొప్పదే. ఉన్న తాశయము గలిగియుండుట సజ్జనసమ్మతము. అట్టి ఆశయముఁగలవారి కోరిక లేనాటికైన నెఱవేరఁగలవు. నీ యాశయము ఫలించుగాక! నీ యాశయసిద్ధికి విష్ణుదేవునిగూర్చి తపస్సుచేసి యాతని యనుగ్రహముఁ బడసి సిద్ధింప చేసికొనుము. ఒకప్పుడు పార్వతీదేవి పరమేశ్వరుని పతిగాఁ బొందుటకై తండ్రియైన హిమవంతుని యాజ్ఞగొని హిమాలయ సానువులయందు తపస్సుచేసి ఫాలాక్షుని పతిగాఁ బడసినది. కావున నీవును హిమవంతమున కేగి నీ దీక్షకుఁ దగినచోటు చూచుకొని తప మాచరింపుము. ఆ రమాపతి నీ కోరిక నెప్పటికైనను నెఱవేర్పఁగలఁడని నమ్మియుండుము" అని సలహా యిచ్చెను. అంత నా వేదవతి తండ్రి చెప్పినట్లు హిమాలయమున కేగి యొక సెలయేటి యొద్దున ఆశ్రమము నేర్పాటు చేసికొని తప మాచరించెను.

కొన్నాళ్ళకు లంకాధిపతి రావణుఁడు విమానమున సంచరించుచు, హిమవత్పర్వతశిఖరములఁ దిరుగుచు తపమాచరించు వేదవతిని గాంచి, ఆమెకు సమీపములో విమానము దించి, ఆమెను సమీపించెను. వాని రాకతోఁ దన నిశ్చలతకు భంగము కలుగగా కనులు తెరచి చూచెను. ఎదుట భీకరాకారము గాంచియు చలింపక ఆమె మరల కనులుమూసి తప మాచరించుచుండెను. అప్పుడు రావణుఁ డామె సమీపమున కేతెంచి, "సుందరీ! నీ తపమునకు మెచ్చి వచ్చితి. నన్ననుగ్రహింపుము."

"నీ వెవఁడవు? నా చెంత కేల వచ్చితివి"

"నేను లంకాధిపతియైన రావణుఁడను. వికసించిన పుష్పమును వెదకుచు భృంగము పగిది వచ్చినవాఁడను. మధువు నాస్వాదించుటయే తడవు"

"ఓ రావణాసురా? కామాంధకారమున నేమి మాట్లాడు చున్నాఁడవో గమనింపలేకున్నాఁడవు. ఇఁక నేమియు నవాక్కులు పలుకక వెడలిపో."

"నిన్ను వెంట నిడుకొని పోవచ్చిన వాఁడను. ఒంటరిగ పోరాదు కదా!"

"ఛీ! నీ వక్రసంభాషణ మాని దూరముగా పో!"

"వాది వక్రసంభాషణ కాదు. వలపు సంభాషణ. రమ్ము; విమాన మెక్కి కూర్చుండుము" అని పైఁ బడఁబోయెను. వేదవతి లేచి దూరముగా నిల్చుండి వానిని తీక్ష్ణముగఁ జూచుచుండ, రావణుఁడు "పై కురికిన నీ కనుగ్రుడ్లపోయుగము నీ ముఖమునకు వింత వికాసమును గల్గించుచున్నవి" అని పైఁ బడఁబోవ, నా యతివ రక్కసిఘాతుకముల నెదుర్కొనరాదని తలఁచి, "ఓరీ అవివేకీ; వనితల బలాత్కరించుటయే నీ వంశాంతమునకు మూలకారణ మగుఁగాక!" అని శపించి, ఆ ప్రక్కన రగిలి మింటినంటుచున్న దావాగ్నిజ్వాలలో దూకెను. రావణుఁడు హతాశుఁడై వెడలిపోయెను.

అగ్నిదేవుఁ డా వేదవతిని భద్రముగాఁగొనిపోయి తన భార్యయైన స్వాహాదేవికి నొప్పగించి కన్నకూఁతుగా చూచుకొనుమని చెప్పెను.

త్రేతాయుగమున దేవతల ప్రార్థన నెఱవేర్ప, భూలోక రాక్షసుల వధించుటకు, అయోధ్యను పాలించు సూర్యవంశపురాజైన దశరథ మహారాజునకు కౌసల్యయను పట్టపురాణియందు శ్రీరాముఁడనై జన్మించితిని. కైకేయీ సుమిత్రలను తక్కిన దశరథుని భార్యలకు భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను కుమారులు జనించిరి. నేను జనకమహారాజు పుత్రియగు సీతావివాహమునకు పణముగాఁ బెట్టిన శివునివిల్లు విఱచి సీతను బెండ్లాడితిని. నా తండ్రి కైకేయి కిచ్చినమాట నిల్పుటకై పితృవాక్య పరిపాలనార్థము పదునాలుగేఁడులు సీతాలక్ష్మణులతో వనవాసమునకు పోవలసివచ్చెను. నేనుఅట్లు దండకారణ్యమున నుండుగా, శూర్పణఖయను రావణునిచెల్లెలి ప్రవర్తనవలన లక్ష్మణుఁడు దాని ముక్కుచెవులుఁ గోసి పంపెను. అది లంకకుఁ బోయి రావణుని సీతాపహరణోద్యోగమునకుఁ బురిగొల్పినది. దాన రావణుఁడు నాచే దెబ్బతినిన వాని మేనమామ మారీచుని సహాయమున సీత నపహరింపఁదలంచెను. మారీచుఁడు మాయలేడియై ఆశ్రమమున తిరుగుచుండ సీత తన కా లేడి కావలెనని కోరెను. నేనా లేడికై దానివెంట వనములు తిరిగి, కడకు దాని మాయఁ దెలిసి బాణప్రయోగమున దానిని చంపితిని. ఆ మాయలేడి చచ్చుచు 'హా! సీతా! లక్ష్మణా!' యని యఱచుట సీత విని నాకై లక్ష్మణుని వనమున కంపెను. ఆ సమయమున అతిథియై రావణుఁడురాఁగా వానికి భిక్షతెచ్చిన సీతను భూమితో పెల్లగించి యెత్తి రథమున నిడుకొని పోవుచుండ సీతాదేవి యాక్రందము విన్న అగ్నిదేవుఁడు తన యింటనున్న వేదవతిని వెంటఁబెట్టుకొని రావణున కెదురై "రావణా! పరామర్శింపకయే పలాయనమంత్రము పఠించుచున్నావు. ఓహో! కామవిషము తలకెక్కిన వానికి కన్నులు కనఁబడవు. వ్యక్తుల తారతమ్యములు గ్రహింపలేరు అనెను."

"ఆఁ- ఏమంటివి? అగ్నిదేవా!"

"ఏమి? నీవు గొనిపోవునది మాయసీత. నీవు నీ మేనమామ మారీచునితో మాట్లాడిన దంతయు విని శబ్దవేదియైన శ్రీరాముఁడు నన్ను పిలిచి నా కీ నిజసీతను చూపి ఆమెను నా యింట కాపాడు మని కోరి, తా నా మాయ సీతను వెంటఁబెట్టుకొనెను. ఇప్పు డా మాయ సీతయే నీ రథములో నున్నది."

"అట్లనా! అగ్ని దేవా? మంచి సమయమునకే వచ్చితివి, ఆ నిజసీతను నా రథ మెక్కించి ఈ మాయ సీతతో శీఘ్రముగ వెడలి పొమ్ము. రాముఁడు రాకముందే నేను లంకచేరవలె" నని చెప్పి యట్లు గావించి వేదవతితో రావణుఁడు లంకచేరెను.

వేదవతి లంకలో అశోకవనమం దుండెను. హనుమంతుఁడామె యునికిఁ దెల్పుటచే నేను లంకకు వారధిగట్టి వానరసైన్యముతో విభీషణుని తోడ్పాటున రావణకుంభకర్ణాదుల నంత మొందించితిని. కాని లోకమునకు సీతా పాతివ్రత్యము నిరూపించుటకై మాయసీత అగ్ని ప్రవేశించెను. అప్పు డా యగ్ని వేదవతిని తాను గ్రహించి నిజసీతను గొనివచ్చి, కుశధ్వజమహర్షి వృత్తాంతమును, వేదవతి సంకల్పమును వివరించి సీతతోఁ గూడ వేదవతిని భార్యగా గ్రహింపు మని కోరెను. ఆ రామావతారమున నేకపత్నీ వ్రతముఁ బూనిన నేను, అగ్నిదేవుని యానతి, వేదవతి చిరకాల సంకల్పము నెఱవేరుటకై అగ్నిదేవునితో నిట్లంటిని. "అగ్నిదేవా, రానున్న కలియుగమున భూలోకమందలి ప్రజలు పాపకార్య కలాపములం దాసక్తు లగుదురు. వారిని పాపములనుండి రక్షింప నేనా కాలమున వేంకటాచలమందు వేంకటే శ్వరుఁడుగా నవతరింతును. ఆ వేంకటాచల ప్రాంత నారాయణపుర మేలు ఆకాశరాజునకీ వేదవతి, జనకునకు సీత లభించినట్లు, పద్మావతిగా లభించును. అప్పుడు నేనీ పద్మావతిని వివాహమాడుదును. అంతదనుక నీ వీమెను బ్రహ్మలోకమం దుంచుము" అని చెప్పితిని. ఆ మాటప్రకారము వేదవతియే నన్ను వివాహమాడుటకై ఇప్పుడాకాశరాజునింట పద్మావతిగా నున్నది. అమ్మా! నేనా పద్మావతిని వివాహమాడుట కిఁక ప్రయత్నింపు" మని వేంకటాచలపతి చెప్పెను.

పద్మావతి జన్మవృత్తాంతము వినిన వకుళాదేవి, "దైవ విధి తనంతట తానుగా జరుగుచుండును. ఇతరు లుపకరణములు. దైవ నిర్ణయమును తొలఁగింప బ్రహ్మయైనను సమర్థుఁడు గాడు. వీసమైన తొలగింపఁ లేఁడు. ఏ కాలమున కేది జరుగవలెనో అది జరుగక మానదు. కాని మానవ ప్రయత్నముఁ జేయుట ముఖ్యము. ఫలము పరమాత్మ నిర్ణయము. ఇఁక నేను నా ప్రయత్నము చేసి, కార్యము ఫలోన్ముఖమగునట్లు చూచెద" నని తలంచి, "నాయనా! ఇఁక నేను నిన్నొక ఇంటివానినిగా చేయు ప్రయత్న మందుండెదను. నా మార్గము శుభదము సులభ మగునని తలంతును" అని శ్రీనివాసుని సంతృప్తిపఱచెను. శ్రీనివాసుఁడు ప్రాకృతునట్లు వకుళమ్మను సంతోషపఱచెను.

## 15. వకుళమ్మ పద్మావతీ సఖులద్వారా ధరణీదేవిని సందర్శించుట:

ఉద్యానవనమునుండి ఇల్లుచేరిన పద్మావతి తీరు వింతగ నుండినది. ఎప్పుడు నేదో యాలోచన. క్షణనిద్రయందే ఏదో కలవరింపు. ఆహారమున అరుచి, తనమనస్సున నేదో తలంపులచే క్షణము సిగ్గు, క్షణము సంతోషము, క్షణము ఆవేదన అప్పుడప్పుడనుభవించుచుండెను. ఈ వింతపరిస్థితులను ధరణీదేవి భర్త కెఱిఁగించినది. రాజును కుమార్తె పరిస్థితిని గని ఏదియుఁ దోఁచక బృహస్పతిని పిలిపించి, పద్మావతి పరిస్థితిని దెల్పి, కారణ మడిగెను. అప్పుడు బృహస్పతి కొంత తడ వాలోచించి, "రాజా! పుష్పాపచయమునకై ఉద్యానవనమునకుఁ బోయిన నీ కుమార్తె ఒకచో నొకపురుషునిగాంచి, మనోవికారము చెందియున్నది. మరేమి భయములేదు. స్వర్ణముఖీతీరమునందున్న అగస్త్యాశ్రమమునకు నీ పురోహితులఁబంపి అగస్త్యమహర్షిచే ఈశ్వరునకు సహస్రఘటాభిషేకము చేయు నేర్పాటు చేయుము. నీ కుమార్తెకు శుభము గల్గుగాక" అని చెప్పి దేవగురువు వెడలిపోయెను. ఈ విషయము పౌరులకుఁ దెలిసి చాల పరితాపమును జెందిరి. వెంటనే ఆకాశరాజు తనపురోహితుల, వేద పండితుల, శాస్త్రజ్ఞులఁ బిలిపించి వారికి దేవగురు నాదేశము దెల్పి, ఆ

కార్యము శాంతముగా నొనర్చ అగస్త్యాశ్రమమునకుఁ బంపెను. పరివారము కావలసిన వస్తుసామగ్రులగొని చెలులతో బయలుదేరి అగస్త్యాశ్రమమునకుఁ బోయిరి. వారి వెంట పద్మావతి సఖులును నుండిరి.

ఉద్యానవనమున పద్మావతి నూతన పురుషుని కనిన విషయము పద్మావతి చెలుల నెవ్వరికి తెలుపవలదని ముందుగనే కట్టడచేసి యుండిన కతంబున వా రా విషయమునే మఱచిపోయిరి.

అగస్త్యమహర్షి తాను స్థాపించిన పరమేశ్వరునకు ఒక శుభ ముహూర్తమున ఆకాశరాజు కోరినట్లు అభిషేక కార్యక్రమమును జేయసాగెను. వేదపండితులు, ఆగమాది శాస్త్రవేత్తలు, పురోహితులు జరుపవలసిన కార్యములందు శ్రద్ధగలిగి తమ కార్యముల నెఱవేర్చు చుండిరి. ఆశ్రమవాసులు వచ్చినవారికి వలసిన సదుపాయము లొనర్చుచుండిరి. పరమేశ్వరుని ప్రీతికై అభిషేకము జరుగుచుండెను. ఆ యాశ్రమము కోలాహలముగ నుండెను. పూజాద్రవ్యముల కొని వచ్చిన పద్మావతి చెలులు విశ్రాంతికై ఆశ్రమోపాంత వనమున గుమిగూడి యుండిరి.

శ్రీనివాసునికోరిక నెఱవేర్చుటకై వకుళమ్మ వేంకటాచలముదిగి దక్షిణముగ నున్న సువర్ణముఖీ తీరమున జనులు సందడిగా నుండుటచే నట చని పద్మావతీ చెలులున్న వనములోనికి పోయి వారిని సమీపించెను. చెలు లా యమ్మ యడిగిన తమ వృత్తాంతము నెఱిఁగించిరి. పద్మావతి పరిస్థితిని దెల్పి శివుని కభిషేక కార్యమునకై వచ్చినట్లు విశదపఱచిరి. అప్పుడు వకుళమ్మ తాను ధరణీదేవిని సందర్శింపఁదలఁచినట్లె చెప్పగా వా రామెను తమతో పూజానంతరము నారాయణపురమునకుఁ గొనిపోవునట్లె చెప్పిరి.

## 16. వేంకటేశ్వరుఁడు ఎఱుకలసానిగా నారాయణపురము చేరి రాణి ధరణీదేవికి సోదె చెప్పుట:

వకుళమ్మ నారాయణపురము చేరులోపల నారాయణుఁడు తానొక ఎఱుకలసానియై కార్యము సాధింపఁ దలఁచెను. వెంటనే తానొక ఎఱుకతయై

ముఖమునిండుగ పసుపుపూసి చేరెడు కుంకుమ బొట్టు పెట్టి, చెంగావిచీర గట్టి, గురిగింజలు, మువ్వలు, గవ్వలు, గాజులు తగిన ట్లలంకరించుకొని, ప్రక్కగా వేసిన ముంతకొప్పున నిండుగా పూలుదురిమి, పసిబిడ్డ నొకదానిని పైటకొంగున వీపునకుఁ జేర్చి కట్టుకొని, పసుపు కుంకుమ బొట్లు పెట్టిన సోదెగంపలో కొంత ధాన్యముపోసి గవ్వలు తాపిన చదరపు సోదెపలకను పసుపుకుంకుమ పూలతో పూజించి గంపలో పెట్టుకొని మూరెడు సోదె వెదురును చేతపట్టుకొని సోదెగంప నెత్తిన పెట్టి, వక్కలాకులు నములుచు నారాయణపురము ప్రవేశించి వీథిలో తిరుగుచు "సోదెమ్మో సోదె! బాగ సెపుతా! జరిగేది సెపుతా! జరిగింది సెపుతా! జరగఁబోయేది సెపుతా! సోదెమ్మో సోదె!," అని అరచుచు తిరుగుచుండెను.

నారాయణపుర పౌరకాంత లా సోదెకత్తెను చూచి, తమరాణి పుత్త్రిక విషయమై సోదె అడుగవచ్చునని తలంచి రాణివాసమునకుఁ బోయి ధరణీదేవితో ఎఱుకలసానిని పిలిపించి సోదె చెప్పించుకొనిన పద్మావతి పరిస్థితి తెలిసికొనవచ్చునని చెప్పిరి. వెంటనే ధరణీదేవి పరిచారికల నంపి ఎఱుకలసానిని పిలుచుకొని రండని చెప్పెను. పరిచారికలు ఎఱుకతను పిలిచి తమతో రాజభవనమునకు రమ్మనికోరిరి. అప్పు డా యెఱుకత "అమ్మో! నే నా రాచనగరుకు రాను. నా బీదస్థితి, నా వేషము, తిండిలేక బక్కచిక్కిన నా బిడ్డను చూచి, నన్ను తరుమఁగొట్టించుటకా? అమ్మో వద్దు. నేను రాను" నా విని చెలు లా విషయము ధరణీదేవికిఁ దెల్పిరి. సోదెవలన తనబిడ్డ పరిస్థితి తెలిసికొన తొందరపడుచున్న ధరణీదేవి సందు గుమ్మమునకడ నిలిచి ఎఱుకల సానితో, "ఓ సోదె ఎఱుకతా! ఇటురమ్మ. భయపడకు. నా మనసులోని అభిప్రాయమును గూర్చి చెప్పిన నీకు మంచి బహుమతులిత్తును రా రా! అని ఆహ్వానించి, లోనికి తీసికొనిపోయి ఒకచోట తగిన ఆసనముచూపి కూర్చుండు మనెను. కాని ఎఱుకత ఆసనము వలదని నేలమీఁదనే గూర్చుండి, "ఓ దొరసానమ్మా! తానముచేసి, పట్టుచీర కట్టి రవిక దొడఁగి, పసుపు కుంకుమ గంధమలంకరించుకొని నగలు ధరించి నీ కులదేవతకు మొక్కుకొని రమ్ము. నీ కడుపులోని మాట ఏదో నిజము చెపుతా!" అనఁగానే ధరణీదేవి ఎఱుకత చెప్పినట్లు

చేసికొని వచ్చెను. అప్పుడు ఎఱుకలసాని "అమ్మో! నా కులదేవతకు వాయిన మిమ్ము" అనఁగా రాణి చెలులను పిలిచి, బంగారుచేటలో నిండుగా ముత్యములు, క్రొత్తరవిక, ఏలా లవంగాది పరిమళ వస్తువులతోఁగూడిన తాంబూలము, పసుపు, కుంకుమ, చందనము, పూలు పండ్లు తెప్పించి యెఱుకలసాని యెదుట పెట్టెను. ఎఱుకలసాని ఆ వాయనమును దగ్గరకు లాగుకొని 'తాంబూలములో దక్షిణలేదమ్మో' అన విని ధరణీదేవి దోసెడు వరహాలు తెప్పించి తాంబూలములో పెట్టించెను. రాణిగారూ 'బంగాఁరుపీటమీఁద కూర్చుండుడు' యని ఆమె కూర్చున్న తరువాత "అమ్మో! నా బిడ్డఁడు ఆఁకలి గొని యున్నాఁడు. వానికంత అన్నము పెట్టించు తల్లీ!" అనఁగానే రాణి యానతిని చెలులు బంగారుగిన్నెలో పాలన్నము తెచ్చి పెట్టిరి. బిడ్డఁడా యన్నము తినక మారాము చేయఁగా ఎఱుకత కోపమున చిరాకున వానినిగొట్టి తానే యా యన్నముతిని జలము తెప్పించి త్రాగి చేతులు కడుగుకొని ఒయ్యారముగా రాణిని చూచుచు వక్కలాకులు నములుచు "అమ్మో! నేను సోదె బాగ చెపుతా! నీ మనసుకోరిక చెబుతా! విను. విను, నరనారాయణుఁడు నా మొగుడు. ఈ సిన్నోడు ఆయనకు పుట్టినోడు. ఆయన మీ ఊరు పొమ్మంటే వచ్చాను. మీరు సాల సంతోషము చేసారు. నే నబద్ధం చెప్పను. నా మాట తప్పదు. నీ మనస్సుపడే కష్టము తొలిగేది చెపుతా నమ్మో" అని చెప్ప ధరణీదేవి మిక్కిలి సంతోషించెను. ఎఱుకత రాణిని తూర్పుముఖముగాఁ గూర్చుండు మని చెప్పి తా నుత్తరముఖముగా నామెదగ్గర కూర్చుండి కుమారుని దగ్గరగా కూర్చుండఁ బెట్టుకొని వాయనమును తన సోదె గంపపైఁ బెట్టి, గంపలోని సోదెపలక నా వాయనమునఁ బెట్టి, వెదురును వాయనముపై నుంచి సోదెపలక యందలి గవ్వలను పసుపు కుంకుమ పూలతోఁ బూజించి యిట్లు సోదె కుపక్రమించెను.

ఎఱుకత: ఓ మధుర మీనాక్షమ్మా! తల్లీ కంచి కామాక్షమ్మా! ఆఁ కాశీవిశాలాక్షమ్మా! ముక్కోటి దేవతలారా! ముందుగ గణపయ్య నిన్ను నే గొల్తు, విఘ్నాలు లేకుండ మోద ముగఁ జెప్ప నా నోటిమాటలు సత్తెముఁ జేసి. దేవత లారా! ఈ దొరసాని

మనసులోని కోరిక దెలుపరే! నా మాటలందున ఓ కాళాస్తి గ్యానమ్మ! ఆఁ కనకదుర్గమ్మ పలుకరే సత్యంపుమాట పొల్లుబోనీక నామాటలు చెల్లింపరే నా సోదెలోన (అని నమస్కారము చేసి). ఆఁ! ఓ యమ్మి నీ మనసులో పెద్దచిక్కే అయినది. ఎట్లా అని బాధపడతావు? ఎటు వచ్చి ఎటు పోవునో యని దారపాని దిగులుపడతావు. గడ్డమేచూపితే బుఱ్ఱోడు అనుకో ఎడమచెవి చూపితే బుఱ్ఱదే అనుకో నీ మదిలోని చింతకు బుఱ్ఱదేనమ్మా! కలవరంబున బాల కలతపడివుంది. అది జబ్బు గాదు. దెయ్యమే గాదు. భూతనాఁదుఁలు లేవు బంగారుబొమ్మకు. చిన్నారిబాలకు వనములో మొన్న నామాల నల్లనయ్య అగుపించి నాఁడు. వానిపై మోజు పడ్డది నీ బాల.

రాణి: ఎవరా పురుషుఁడు?

ఎఱుకత: లోకాలు ఏలేటి సామియే యగును. నీ బాలకోసమే దివినుండి భువి కొచ్చినాఁడు.

రాణి: ఎక్కడుంటాడు? ఎట్టిగుణములు గలవాఁడు?

ఎఱుకత: ఒక్కచో టననేమి? అన్నిటా గలవాడు. నీ బాలకై ఇపుడు దగ్గరే యున్నాఁడు. మూఁడు గుణములలోన ముఖ్యమైన గుణము. సత్త్వమే యంటారు తెలుసుకోయమ్మ.

రాణి: దగ్గరంటివే ఎక్కడ?

ఎఱుకత: ఇక్కడా ఎక్కడో యని తలఁచబోకు ఎక్కడా అతడుగా నుంటాడు గాని. నీ బాలకై ఇపుడు ఇటు ఉత్తరాన ఆ కొండమధ్యలో నున్నాఁడు తల్లీ!

రాణి: నీ మాట నిజ మెట్లు?

ఎఱుకత: ఉద్యానవనమున జరిగినా గోల చెలులనే అడుగుమా చెప్పేరు నిజము. రేపో మాపో వచ్చు మా యమ్మ లాంటి ముసలమ్మ ఇటుకు తా మనువుఁ గోరి.

రాణి: ఎవరో కులగోత్రములు తెలియని వాని కివ్వమంటావా?

ఎఱుకత: నీ బిడ్డ వానికే ఆలిగా జనియించినాది. తప్పింప బమ్మకే కాదు మాయమ్మా? మూడులోకాలకు ముచ్చటై వెలిగే నామాల నల్లనయ్య నీ కల్లుడే యగును.

రాణి: అట్లు వాని కియ్యకపోతే?

ఎఱుకత: ఆఁ.....ఎంత మాట, ఎంత మాట, తప్పు, తప్పు. ఆ అయ్యను కట్టుకోడానికే నీ బిడ్డ పుట్టింది. అట్లాకాదంటే నీ బిడ్డ నీకు దక్కదు.

రాణి: (కోపముగా) ఏమీ? అవాక్కు?

ఎఱుకత: ఆఁ అమ్మో? నాది అవాక్కు కాదు, సత్తెము. ముమ్మాటికీ సత్తెమే. నీ బాలనే అడుగు. తెలిపికో సత్యము. నా మాట ఏనాఁడు తప్పంది లేదు. వెంటనే నీ రాజును పెండ్లికి పురికొలుపు. లక్షణంగా పెండ్లి జరుగుతుందే యమ్మా. నీ బిడ్డ లక్ష్మికి తోడౌట నిజము. రానున్న సిరిని తొలగించుకోకు. ఆ నామాల ఆయనకే బిడ్డ నిస్తానని చెప్పుకో. ముడుపులే కట్టుకో, నీ బిడ్డకో జబ్బు అంటదే తల్లి.

రాణి: నీవు చెప్పినట్లు మనువు మాటాడ ముసలమ్మ వస్తే చూస్తాము.

ఎఱుకత: చూచేదేమి? ఇస్తానని మాట ఇమ్మోయమ్మా.

రాణి: ముసలమ్మ మాట నిజమైతే నామాలయ్యకే నాబిడ్డనిస్తా.

ఎఱుకత: శుభమమ్మ! నీ మాట ఈడేర గలదు. మధుర మీనాక్షమ్మ! కంచి కామాక్షమ్మ! కాశి విశాలాక్షమ్మ తోడౌను నీకు, దేవతలే పెండ్లి పెద్దలయ్యేరు. ఇపుడే వచ్చెను మా తల్లినమ్మ."

అన విని ధరణీదేవి "అట్లే రానిమ్ము" అని ఎఱుకలసానికి సెలవిచ్చి, అంతఃపురములోనికిఁబోయెను. ఎఱుకలసాని వాయనము గంపలో బెట్టుకొని కొడుకు నెత్తుకొని వెడలిపోయెను.

## 17. వకుళమ్మ ధరణీదేవిని గలిసికొనుట:

మహారాణి పద్మావతి గది చేరినది. ఆమె నీరసముగ పడకపై బరుండి యుండెను. చెలులు పద్మావతికి సేవఁ జేయుచుండిరి. రాణి పద్మావతి ప్రక్కన సెజ్జపై కూర్చుండి, "అమ్మా! ఉద్యానవనములో నొక పురుషుని చూచితివా? వానిని వలచితివా?" అని యడుగుచుండ చెలుల కప్పు డా నాటి వృత్తాంత మంతయు జ్ఞప్తికి రాఁగా రాణిగారికా విషయము చెప్పు చుండిరి. పద్మావతి నవ్వుముఖముతో మౌనముగ నుండుటను గమనించి ధరణీదేవి ఎఱుకత చెప్పిన దంతయు యథార్థమని తలంచి, మనస్సున నామాలయ్యను ప్రార్థించి ముడుపు కట్టించెను. క్షణములో పద్మావతి గొప్ప భారము దించుకొన్నట్లు శరీరము నెమ్మదింప, సంపూర్ణారోగ్యము పొంది నవ్వుచు పాన్పుపై కూర్చుండెను. తల్లి యానందమునకు మేర లేదు. పద్మావతిని కౌఁగిలించుకొని ముద్దాడుచుండ, నింతలో అగస్త్యాశ్రమ మందలి పరమేశ్వరుని పూజకై పోయియుండిన చెలులతో, వకుళమ్మ రాణి దర్శనమునకు వచ్చెనన్న విషయ మా చెలులవలన నెఱిఁగి రాణి, ఆమెను తన మందిరము ప్రవేశపెట్టి చెలులకు నాజ్ఞ యిడి తాను వకుళమ్మ రాకకై ముందుగా తన మందిర మందుండెను.

చెలులు వకుళమ్మను రాణిమందిరమునఁ బ్రవేశపెట్టిరి. ఎఱుకత మాటలు సత్యము లగుచున్నవని ధరణీదేవి తలంచి, వకుళమ్మకు స్వాగత మిచ్చి, ఉచితాసనమునఁ గూర్చుండఁ జేసి, కుశలప్రశ్నములైన పిదప, ఆమె రాకకుఁ గారణ మడిగెను. అప్పుడు వకుళమ్మ "వేంకటాచలాధిపతికి మీ కన్య పద్మావతిని అడుగఁ గోరి వచ్చితి" నని చెప్పెను. అది విని లోలోన సంతోష మందిన ధరణీదేవి, "వరుని కులగోత్రములు దెలియక ఎవ్వరైన కన్య నిత్తురా?" నా విని వకుళమ్మ ధరణీదేవికి శ్రీ వేంకటాచలపతి గూర్చి యిట్లు చెప్పెను. "అమ్మా! మా వేంకటాచలపతిఁ దలిదండ్రులు దేవకీ వసుదేవులు. చంద్ర వంశము, వసిష్ఠగోత్రము, జన్మనక్షత్రము శ్రవణము, నవయౌవన మందున్న ప్రాయము. తొలుతటి పేరు శ్రీకృష్ణుఁడు. వేంకటా చలనివాసి యగుటచేత వేంకటాచలపతి అని వ్యవహార నామము. సర్వశుభ

గుణము లాతనినే యాశ్రయించినవా యనిపించును. ముందు శ్రీయును గలదు. సిరి రాకపోకలు గలదని లోకు లందురుగదా? కాని ఆతనికి నిత్యశ్రీ యెడఁదయుండే యుండును. వానికన్న గుణవంతుఁడు, బుద్ధిమంతుఁడు, భాగ్యవంతుఁడు, సుందరపురుషుఁడు, ముల్లోకములయందు లేఁడనిన అతిశయోక్తి గాదు. మీ వియ్యమునకు దగినవాఁడనియే నేను వచ్చితిని. అతఁడు మొన్న ఉద్యానవనములో మీకన్యను చూచినప్పటినుండి, కన్యా వ్యామోహమున దిగులొందియుండ, నేను కన్యార్థ మేతెంచితిని. ఆతఁడు నన్ను తల్లిగా చూచుకొనుచుండును. కావున మీరు శ్రీ వేంకటాచలపతికి కన్యాదానము చేసిన త్రిలోక పూజ్యు లగుదురు" అన విని సంతోషించిన ధరణీదేవి కుమారుఁడైన వసునాయకుని బిలిచి రాజుగారిని తోడ్కొని రమ్మని పంపెను. ఆ వచ్చెడి ఆకాశరాజును వేరొక గదికి తీసికొనిపోయి, రాజుతో, "నాథా! ఉదయము సోదె చెప్పించుకొంటిని. ఎఱుకత చెప్పిన దంతయు సత్యముగ జరుగుచున్నది. ఆమె చెప్పినట్లు ముడుపు కట్టించితిని. వెంటనే మన పద్మ సంపూర్ణారోగ్యమును జెందినది. పద్మావతి వనములో నొక పురుషునిఁ జూచి, అతనిని దప్ప నితరుని వివాహమాడఁ దలఁపక, ఆ విషయము మనతోఁ జెప్పటకు భయపడి వేదనఁ జెంది యుండుటను ఎఱుకలసాని చెప్పినది. విచారింప యథార్థమని చెలులు చెప్పిరి. పద్మావతి మౌనమున నంగీకరించినది. ఆ పురుషుఁడు వేంకటాచల మందున్న వేంకటాచలపతియని, అతనిది చంద్రవంశము, వసిష్ఠగోత్ర మని, వయోరూపగుణాదుల ముల్లోకములందు అతనికి నెవ్వరును సరిలేరని, పద్మావతికిఁ దగిన భర్తయని, వంశగోత్ర మర్యాదలలో మనకుఁ దగిన జామాతయని వకుళమ్మ చెప్పినది. వేంకటాచలపతిని నామాలనల్లయ్యగా వర్ణించిన ఎఱుకత పద్మావతిని ఆతనికిచ్చి పెండ్లిచేయనిచో పద్మావతి మనకు దక్కదనియు చెప్పినది. ఇది యంతయు దైవనిర్ణయము ఆ దైవమును దలఁచి ముడుపు గట్టగనే పద్మ పరిపూర్ణారోగ్యభాగ్యమందినట్లున్నది. రండు చూతురు గాని" అని ఆకాశరాజును పద్మావతి గదికిఁ దోడ్కొని వచ్చెను. తండ్రిని చూచి పద్మావతి పాన్పుదిగి నవ్వుచు ఎదురేగి కౌఁగిలించుకొనెను. ఆకాశరాజు భార్య చెప్పినదంతయు దైవానుగ్రహమున తమ మేలునకే యని కౌఁగిలించిన

కుమార్తెను బుజ్జగించుచు, "అమ్మా! నీవు కోరిన భర్త యెవ్వఁడు?" అని యడుగగా నామె సిగ్గున తలవంచి యూరకుండెను. రాజు "అమ్మా! మేము ధన్యులము. వరాన్వేషణశ్రమ లేకయే తగిన అల్లుని విధి సమకూర్చినాఁడు. నీవుకోరిన వానికే నిన్నిచ్చి పెండ్లి చేసెద. సంతోషముగ నుండుము" అని చెప్పి కుమారునితో సభాభవనమునకుఁ బోయి, వెంటనే మంత్రి పురోహిత బంధుమిత్ర పౌర ప్రముఖుల సమావేశ పరచి, వారికి తనకుమార్తెయగు పద్మావతిని శ్రీ వేంకటాచలపతికిచ్చి పెండ్లిచేయఁ దలంచినట్లు తెలుప అందఱు ఏకగ్రీవముగ సమ్మతించి సంతోషించిరి.

## 18. ఆకాశరాజు బృహస్పతిని, శుకమహర్షిని పిలిపించి వారితో పద్మావతీ శ్రీనివాసుల వివాహవిషయముఁ దెల్పి సుముహూర్తము నిర్ణయించుట:

ఆకాశరాజు కుమారునివలన బృహస్పతిని, తమ్ముఁడైన తొండమానునివలన శుకమహర్షిని తోడితెచ్చుటకై పంపెను. వసునాయకుఁడు దేవలోకమునకేగి బృహస్పతికి తన తండ్రి సందేశమును దెలిపెను. వెంటనే దేవగురువు వృత్తాంతమును దివ్యదృష్టిని జూచి, భగవత్కార్యమును భావించి వసునాయకుని వెంట బయలుదేరెను.

శుకమహర్షి సువర్ణముఖీనదికిఁ దూర్పున దక్షిణకైలాసపర్వతములకుఁ బడమరగ నున్న శుకతీర్థ మను నాశ్రమమున నివసించుచుండెను. తొండమానుఁడు శుకుని యాశ్రమముఁ జేరి అన్నగారి ఆహ్వానమును మహర్షికి విన్నవించెను. అతఁడు తన దివ్యదృష్టితో విషయమును దెలిసికొని, తొండమానునితో రథముపై నెక్కి నారాయణపురమునకు బయలుదేరెను.

[ఈ శుకతీర్థము చాలకాలముగఁ బ్రసిద్ధిగల్గి యున్నది. అది దక్షిణ కైలాస పర్వతములకుఁ బశ్చిమదిక్పర్వతముల చెంతనున్న దివ్యతీర్థము ఇప్పుడది వ్యవసాయదారుని స్వాధీనములో నున్నది. ఈశ్వరాలయమునకుఁ దక్షిణదిక్కున ఒక కిలో మీటరులోపున, భరద్వాజ తీర్థమునకుఁ బోవు కొండదారికి సమీపమున దక్షిణదిక్కున నున్నది. కొన్ని మామిడిచెట్లను

గల్గియున్నది. శ్రీకాళహస్తి క్షేత్రమందలి తీర్థములలో శ్రీశుకతీర్థము నేఁటికిని గలదు. ఇప్పుడది యొక చిన్న బావిగా నున్నది.]

ముందుగా బృహస్పతి నారాయణపురము చేరెను. ఆ వచ్చిన దేవగురునకు ఆకాశరాజు ఎదురేగి సగౌరవముగ ఆహ్వానించి అంతః పురమునకుఁ గొనివచ్చి ఉచితరీతిని సంభాషించి ఉచితాసనమునఁ గూర్చుండఁ జేసెను. తదుపరి తన పుత్త్రికయైన పద్మావతిని, వేంకటాచలపతి కిచ్చివివాహమొనర్చు తన యభిమతమును దేవగురునకు విశదపరచెను. ఈ కార్యముగా వేంకటచలమునుండి పుణ్యసాధ్విగొోర్తు న[illegible]న్నట్లు తెలియఁజేసెను. రాజు మాటలను విని బృహస్పతి "రాజా! వేంకటాచలపతియే వైకుంఠవాసుఁడు. శుకమహర్షికి భూలోకవేంకటాచలపతి విషయము తెలిసియుండవచ్చు. ఆయన నడుగుటయును మంచిది" అని చెప్పచుండునంతలో తొండమానుని వెంట శుకమహర్షియు రాజమందిరమును బ్రవేశించెను. రాజు మహర్షిని సత్కారపూర్వకముగ నాహ్వానించి, యుచితాసనమునఁ గూర్చుండఁ జేసి పద్మావతీ వేంకటాచలపతుల వివాహవిషయముఁ దెలిపెను. అంతయువిన్న శుకమహర్షి, "రాజా! దైవసంఘటనచే నెఱవేఱఁగల కన్యాదానమున నీవు ధన్యుఁడ వగుటయే గాక, నీ పూర్వపుణ్యఫలంబున వైకుంఠవాసుఁడే నీకు జామాత కా నున్నాఁడు. ఏమియు సంకోచింపక "శుభస్య శీఘ్ర"మ్మను పెద్దల వాక్యానుసారము ఆచరింపుము. దేవగురువును నన్ను బలపరచగలఁడు" అనవిని దేవగురుఁడు శ్రీశుకునితో తాను నేకీభవించునట్లు చెప్పి తదుపరి జరుగఁగల కార్య మడిగెను.

అప్ప డాకాశరాజు, "పెద్దలైన మీ రానతీయ నెఱవేర్చు ప్రయత్నము చేయకుందునా? ఇఁక తామే వధూవరుల వివాహ సుముహూర్తమును నిశ్చయింపుఁ" డన, బృహస్పతి వధూవరుల వంశగోత్ర జన్మనక్షత్రముల నను సరించి వధూవరుల వివాహ వింశతి వర్గముల పరీక్షించి, తిథి వార నక్షత్ర యోగకరణములతో, తారాబల చంద్రబలములు గలిగి, నిష్పంచక పుష్కరాంశము గల్గి, గ్రహములన్నియు శుభ[illegible]ముగనున్న శుభలగ్నమున సుముహూర్తము నిర్ణయించెను. గురూపదేశ మనుసరించి ఆకాశరాజు,

సముచితమైన యుత్తరమును వ్రాసి దానితో పెద్దలు నిశ్చయించిన పద్మావతీ వేంకటేశ్వరుల వివాహపత్రిక నుంచి, శుకమహర్షి వేంకటాచలమున కంపెను. రాజు బృహస్పతికి మిక్కిలి కృతజ్ఞతఁ దెలుపుకొని వివాహకార్యమును దగ్గరుండి జరిపింపఁ గోరెను. అందులకు బృహస్పతి సమ్మతించి దేవలోకమున కేగెను.

ఆకాశరాజు పద్మావతిని శ్రీవేంకటాచలపతి కిచ్చి వివాహముచేయుటకు సమ్మతించి ప్రకటించినతోడనే వకుళమ్మ ధరణీదేవిచే వీడ్కోలుపొంది, తిరుమల నివాసమునకువచ్చి తన రాకకై నిరీక్షించుచున్న వేంకటాచలపతికి, పద్మావతి హృదయమును, ఆమె తల్లిదండ్రుల నిర్ణయమును వినిపించి శ్రీనివాసుని "శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు" అని దీవించెను. శ్రీనివాసుఁడు ముసిముసి నవ్వులతో నిండు సంతోషము గలిగియుండెను. వకుళమ్మ తాను ప్రయత్నించిన కార్యము సఫలమైనదని యానందబాష్పములు కన్నులనిండుగా గల్గి యమితానందము జెందెను.

## 19. శుకమహర్షి వేంకటాచలముఁ జేరి వేంకటాచలపతికి ఆకాశరాజు పంపిన యుత్తరమును, ముహూర్త పత్రిక నిచ్చుట:

ఆకశరాజుచే శుభలేఖను పత్రికను గొని శుకమహర్షి శేషాచల మాదిగ సప్తగిరులదాటి, స్వామిపుష్కరిణీ సమీపమందలి చింతచెట్టు క్రింది వల్మీక భవనమందలి శ్రీనివాసుని గని సాష్టాంగ మొనర్చెను. స్వామి మహర్షిని అత్యంతాదరమున తన చేతులతో పైకెత్తి కౌఁగిలించి, సంతోషముగ మాట్లాడుచు నొక్కయుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి తాను నొక యాసనమున నుపవిష్టుఁడయ్యెను. కుశలసంభాషణానంతరము మహర్షి తా వచ్చిన కార్యమును సాకల్యముగ వివరించి ఆకాశరాజు పంపిన ఉత్తరము, సుముహూర్తపత్రిక నిచ్చి, "ఆకాశరాజు తమ ప్రత్యుత్తరమునకు నిరీక్షించుచుండు"నని చెప్పెను. శ్రీనివాసుఁడు కన్నులు చేరెడుచేసి, ఆ లేఖను పత్రికను నందుకొని చదివినదే మరలమరలఁ జదివి ఆనందపరవశుఁడై

"మహర్షుల యాశయములు సద్యఃఫలముల నిచ్చునవి. మీవంటి మహర్షి యుల సహకారముననే నే నీ భూరక్షణ కార్యమును వహించు చున్నాఁడను. తపోధనులన్న నా కత్యంతానురాగము. వారియాజ్ఞ శిరసా ధరింతును."

ఆకాశరాజు సుధర్ముని కుమారుఁడు, పుణ్యుఁడు, ధర్మశీలుఁడు. సర్వాధికారియైన రాజుగా గాక ప్రజాప్రతినిధిగా ప్రజాసంక్షేమము నకుఁ బాటుపడు భూపాలుఁడు. ఆతని పూర్వపుణ్యమున లభించిన పుత్త్రిక పద్మావతిని నా కిచ్చి వివాహముచేయ నిశ్చయించుట చాల సంతోషము. ఆయనకుఁ దగిన విధాన ప్రత్యుత్తర మంపుట నా ధర్మము" అని చెప్పి కాఁబోవు మామగారు మహారాజగుటచేఁ దగిన గౌరవపద్ధతిని లేఖవ్రాసి, అందు తాను పద్మావతిని వివాహమాడ సమ్మతించి నిర్ణయించిన ముహూర్తసమయమునకు బంధుమిత్ర పరివారసమేతముగా నారాయణపురమునకు రాఁగలవారమని మర్యాదా పూర్వకముగ లేఖపూర్తి చేసి, వకుళమ్మను పిలిచి ఆకాశరాజు వ్రాసిన ఉత్తరము చదివి, రానున్న వైశాఖ శుక్లదశమి గురువారము రాత్రి పదుమూఁడు గడియల సమయంబున వివాహ సుముహూర్తమని చెప్పఁగా వకుళమ్మయు మిక్కిలి సంతోషించెను. శుకమహర్షిని పెక్కు విధముల ప్రస్తుతించెను. వేంకటాచలపతి తాను వ్రాసిన ప్రత్యుత్తరమును ఆకాశరాజునకు చేర్పింప శుకమహర్షి కిచ్చెను. శుకమహర్షి తన కార్యము సంతోషముగ జరిగినందులకు శ్రీనివాసుని ప్రస్తుతించి తాను జగన్నాయకుని వివాహసంధాతగా నున్నందులకు నెంతయు ధన్యుఁడైన నట్లు భావించెను. ఇంతలో వకుళమ్మ శ్రీనివాసునకు శుకునకు మంచి ఫలములను, తేనెను ఉపాహారముగా తెచ్చి యిచ్చెను. వారెంతో సంతోషమున భుజించిరి. ఆ మీఁదట శుకుఁడు వకుళమ్మను వీడ్కొని శ్రీనివాసునితోఁగూడ వరాహస్వామిని దర్శించి వేంకటాచలపతి వివాహకార్య మెఱిఁగించెను. వరాహస్వామియు హర్షము వ్యక్తము చేయ శుకమహర్షి యాతని యనుమతిఁ బడసి, శ్రీనివాసునకు స్వస్తి పలికి నారాయణపురమునకు బయలుదేరెను.

శుకుఁ డాకాశరాజు అంతపురముఁ జేరి తన కార్యము సఫలమైనదని ఆకాశరాజుకుఁజెప్పి, శ్రీనివాసుని ప్రత్యుత్తరమును ఇచ్చెను. ఆ...

యుత్తరమును జదువుకొని కనుల నానందబాష్పములు చెలఁగ డగ్గుత్తికతో శుకమహర్షికిఁ గృతజ్ఞతాపూర్వకముగ నమస్కరించి, ఇఁక జరుగవలసిన కార్యక్రమమును శుకునివలనఁ దెలిసికొని ఆ విధముగ వివాహ కార్యము లన్నింటిని సాకల్యముగ జరిపింపఁదగినవారిని నియమించెను. పెండ్లికై వచ్చెడి, మగపెండ్లివారికి, తక్కిన బంధుమిత్ర పరివారములకుఁ దగి నవిడుదులు మున్నగు సదుపాయములు చూచుకొనుటకై తమ్ముఁడు తొండమానుని, కుమారుఁడు వసునాయకుని నియమించి, వివాహకార్య మును సలక్షణముగ జరిపింప వేదపండితులను పురోహితులను ప్రార్థించి అంగీకరింపఁ జేసెను.

శుకుని నారాయణపురమునందే యుండి, వివాహకర్తగా తగు సమ యములందు తగు సలహాల నిచ్చుచు కార్యము జయప్రదముగ జరుపునట్లు ప్రార్థించెను. శుకమహర్షియు రాజు సంప్రార్థన మంగీకరించి నారాయణ పురమునందే యుండెను.

## 20. శ్రీనివాసుఁడు వివాహమునకై దేవతలను మహర్షులను ఆహ్వానించుట:

శుకమహర్షిని సాగనంపిన పిదప శ్రీనివాసుఁడు వకుళమ్మ వరాహ స్వాములతో సంప్రదించిన తదనంతరము, తన బంధుమిత్ర శ్రేయోభిలా షులకు, మహర్షులకు నాహ్వానము లంపఁదలంచి వారి వారికిఁ దగు నుత్తరములు వ్రాసి, ఆ యా యుత్తరములను తన కత్యంత విశ్వాసపాత్రు లగు గరుడుని, శేషుని రప్పించి, వారికి తన వివాహవిషయముఁ దెలిపి యానందపఱచి, "గరుడా ! నీవు సత్యలోకమునకు, తపోలోకమునకుఁబోయి బ్రహ్మకు మహాత్ములగు తపోధనుల కీ యుత్తరముల నిమ్ము. ఆదిశేషా ! నీవు కైలాసము మఱియు నాగలోకములకుఁ బోయి శంకరునకు, వాసుకికి నీ యాహ్వానముల నిమ్ము" అని వారివారికి వ్రాసిన యుత్తరముల నిచ్చి పంపెను. దేవేంద్రుని బృహస్పతిని దిక్పతులను ఆహ్వానింప ప్రత్యేక దూతల నంపెను.

గరుడుఁడు తొలుత సత్యలోకమునకు పోయెను. ఎటుచూచినను చతుర్వేదములు స్వరయుక్తముగ, శ్రవణానందముగ వినఁబడుచుండెను. గరుడుఁడా వేదపారాయణము ముగియువఱకు నొకచో నిలుచుండి విని, తన్మయత్వమును బొంది, కొంతతడవైన పిదప బ్రహ్మ మందిర ద్వారమున నిలచి, తన రాక ద్వారపాలకునివలన బ్రహ్మదేవునకుఁ దెలియఁజేసెను. గరుడుని రాక తెలిసిన బ్రహ్మ వెంటనే ప్రవేశపెట్టు మనఁగా సేవకుఁ డట్లొనర్చెను. గరుడుఁడు సరస్వతీ సహితుఁడగు విరించిని గాంచి సాష్టాంగనమస్కారము చేసి నిలుచుండెను. బ్రహ్మ గరుడుని దీవించి, యోగక్షేమములు విచారించెను. అప్పుడు గరుడుఁడు శ్రీవేంకటాచలపతి యిచ్చిన వివాహాహ్వానపత్రిక నందిచ్చి నిలుచుండెను. బ్రహ్మపత్రికను జదువుకొని సంతోషమున దానిని సరస్వతి చేతికిచ్చి గరుడుని సత్కరించి పంపెను. ఆ పిదప బ్రహ్మ తన సేవకులఁ బిలిపించి, భారతదేశపు దక్షిణ భాగమునఁ గల వేంకటాచలమందున్న శ్రీనివాసుని వివాహమునకై సత్యలోక వాసులందరు తగు విధమున ముహూర్తమునకు ముందునాఁడే చేరవలసినట్లు చాటింపుఁడని వివాహపత్రిక నిచ్చి పంపెను.' వారు లట్లే సంతోషమున సత్యలోకానఁ జాటించిరి.

బ్రహ్మలోకమును వీడ్కొనిన గరుడుఁడు తపోలోకమున కేగి తపోధనులకు శ్రీనివాసుని వివాహాహ్వాన పత్రిక లిచ్చెను. తపోధనులా పత్రికల నందుకొని చదివి కన్నుల కద్దుకొని, భూలోకమున జరుగు శ్రీనివాసుని పరిణయమునకుఁ బోవ సంకల్పించుకొనిరి.

శేషుఁడు తొలుత కైలాసమునకుఁబోయి పార్వతీపరమేశ్వరుల సందర్శించి, నమస్కరించి, శ్రీనివాసుఁ డంపిన వివాహ పత్రిక నిచ్చెను. శివపార్వతులు పత్రికను జదివి సంతోషమున సకుటుంబ పరివారముగ భూలోకమున జరుగు వేంకటాచలపతి వివాహమునకు పోవ నిశ్చయించి, భృంగి నందీశ్వరుల కా వృత్తాంతమును దెల్పి ప్రయాణ ప్రయత్నములు చేయ నియమించిరి. ఆ పిదప శేషుఁడు పాతాళమున కేగి వాసుకి ముఖ్యులైన నాగలోకవాసులకు వేంకటాచలపతి కల్యాణాహ్వాన పత్రికల నిచ్చి,

వేంకటాచలమునకు వచ్చెను. అంతకుముందే గరుడుఁడు వేంకటాచలము చేరి యుండెను. వారు వేంకటాచలపతి యానతిని వివాహోచిత కార్యముల నిర్వహించు చుండిరి.

## 21. బ్రహ్మాదిదేవతలు మహర్షులు వివాహార్థమై వేంకటాచలమున కేతెంచుట:

వివాహ శుభముహూర్తము సమీపించుచుండ బ్రహ్మ సరస్వతి, సావిత్రి, గాయత్రీ దేవులతోఁ గూడి హంసవాహనుఁడై భూలోకమందలి వేంకటాచలమునకు బయలుదేరెను. వారి వెంట బ్రహ్మమానసపుత్త్రుఁడు నారదుఁడు సత్యలోకవాసులు బయలుదేరిరి. ముందుగా బ్రహ్మ రాకను చారులవలనఁ దెలిసిన వేంకటాచలపతి గరుడుని ఆరోహించి, బ్రహ్మ కెదురుగా బయలుదేరెను. తండ్రిరాకను గాంచిన బ్రహ్మ పత్నీయుతుఁడైన వాహనము దిగి ఆ వచ్చు వేంకటాచలపతికి సాష్టాంగనమస్కార మాచరించెను. శ్రీనివాసుఁడు వాహనము దిగి విరించిని సాదరముగ లేపి కుశల ప్రశ్నంబులఁ జేయుచు, వచ్చినవారినందరిని బలుకరించి వారినందరిని తన నివాసమునకుఁ దీసికొనిపోయి వారి వారికిఁ దగిన విడుదుల నేర్పరుప గరుడుని నియమించెను.

తాను బ్రహ్మ యొకచోటఁ గూర్చుండిరి. అప్పుడు శ్రీనివాసుఁడు ఆకాశరాజు కూఁతురు పద్మావతి పూర్వజన్మ వృత్తాంతమును చెప్పి, ముందు తానిచ్చిన మాట ప్రకారము పద్మావతిగ నున్న వేదవతిని వివాహ మాడుచున్నట్లు, ఆకాశరాజు వృత్తాంతమును వివరించెను. బ్రహ్మ సంతోషించెను. ఆ వచ్చినవారి నందరిని వకుళమ్మ తగిన రీతి సంభావించెను. శ్రీనివాసుఁడును వారలందరకు వకుళమ్మ పూర్వజన్మ వృత్తాంతమును గూడ చెప్పెను. అందరు విష్ణుదేవునకుఁ దల్లిగానున్న వకుళమ్మను భక్తి భావంబున సంభావించిరి. వేంకటాచలపతి ముందుగా వచ్చిన తనసొంత బలగంబును వివాహోచిత కార్య నిమగ్నులఁ జేసెను.

ఆ తరువాత పరమేశ్వరుఁడు పార్వతీ సహితుఁడై నందినెక్కి వచ్చెను. ఆతని వెంట కైలాసమందలి ఆబాలగోపాలము వేంకటాచలపతి కల్యాణము గాంచుటకై వచ్చిరి. వేంకటాచలపతి శివ పార్వతులను వినాయకుని, కుమార స్వామిని తగినరీతి ఎదురేగి కొనివచ్చి గరుడునిచే వారికిఁదగిన విడుదుల నేర్పఱచెను. కడపట ఇంద్రాది దిక్పతులు, బృహస్పతి, చంద్రసూర్యాది దేవతలందరును వేంకటాచలము చేరిరి. ఆ వెనుక సప్తమహర్షులు మున్నగు తపోధనులును వచ్చిరి. ఆ వచ్చినవారి నందరిని వేంకటాచలపతి తగు విడుదులలో విడియింపఁజేసెను. ఆ పిదప వేంకటాచలపతి దేవేంద్రునితోఁ జెప్పి, విశ్వకర్మచే వివాహార్థము వచ్చినవారికెల్ల యోగ్యమైన పురమును నిర్మింపఁ గోరెను. విశ్వకర్మ దేవేంద్రాజ్ఞ ననుసరించి స్వల్పకాలముననే వేంకటాచలమున దివ్యపుర మొకదానిని సకల సదుపాయములు గలదిగా నిర్మించెను. ఆ పిదప ఇంద్రుఁడు వేంకటేశుని యాజ్ఞప్రకారము, మయు నితోఁ గూడ నారాయణపురమునకుఁ బోయి, ఆకాశరాజుచేఁబూజితుం డయి, నారాయణ పురమునందు వివాహ మండపము వచ్చెడి బంధు మిత్ర పరివారమునకెల్ల తగు నివాసములు సమస్త సదుపాయములతో నిర్మింపఁజేసెను. మఱియు వంటశాలలు, వడ్డన మందిరములు, వాఫీ కూపములు, ఉద్యానవనంబులు పరిచర్యలు సలుపఁదగిన సేవకాజనంబులను గూడ నియమించెను.

ఆ పట్టణమున వేదికలు ఉద్యానవనంబులు మిక్కిలి కన్నుల పండు వుగా నుండెను. వైకుంఠవాసుని పెండ్లి భూలోకమున ఇంత అద్భుతముగ జరుగునన్న విషయము ముందుగా నెవ్వరు యూహించి యుండ లేదను టాశ్చర్యముగనే తోఁచును. నారాయణపురము దివ్యపురముగ శోభిల్లుచుండెను.

అట వేంకటాచలమున దేవతలు మహర్షులందరు గుమిగూడి యుండిరి. బృహస్పతి వేంకటాచలపతి ఆజ్ఞపొంది నారాయణపురము నకుఁబోయి, వివాహోచిత కార్యక్రమముల నిర్వర్తించుచుండెను.

వేంకటాచలపతి వివాహమున కేతెంచిన దేవతలను మహర్షులను సత్కరించుటకు పార్వతీశుని, భోజనముల చూచుటకు బ్రహ్మను, చందన

తాంబూలముల నిచ్చుటకు మన్మథుని, కుమారస్వామిని, వంట మున్నగు కార్యములకు అగ్నిదేవుని, జలముల సిద్ధపఱచుటకు వరుణుని, సుగంధ ములకు వాయువును, ఇట్లా యా కార్యక్రమములు నిర్వహించుటకుఁ దగినవారిని నియుక్తులఁ జేసెను. అందుచే వివాహమున కేతెంచిన వారి కందఱికిని స్నానాదిగాఁగల సకల వసతులు, భోజనాదులు, విడుదులు అన్ని కార్యములు యాంత్రికముగ జరుగుచుండెను.

ముహూర్తమునకు ముందు జరుగవలసిన పుణ్యాహము, ఇష్టకుల దేవతా ప్రార్థన, మంగళస్నానమిత్యాది కార్యక్రమములు జరుగవలసి యున్న వని వసిష్ఠుఁడు శ్రీనివాసునకుఁ దెల్పెను. అప్పుడు శ్రీనివాసుఁడు లక్ష్మి లేక తా నా కార్యములఁ జరుపఁ జాలనని చెప్పెను. అప్పుడు శ్రీనివాసుని అనుమతిని బ్రహ్మ, సూర్యుని కరవీరపురము నకుఁ బోయి లక్ష్మీదేవిని తోడ్కొని వచ్చుటకుఁ బంపెను. సూర్యుఁడు తన సప్తాశ్వరథ మధిరో హించి కరవీరపురమున లక్ష్మీదేవికి-శ్రీనివాసుని కల్యాణవిషయమును దెల్పి, ఆమెయు వెంటనే సూర్యునితో రథమెక్కి వేంకటాచలమునకు వచ్చెను. ఆ వచ్చిన లక్ష్మిని శ్రీనివాసుఁడు సాదరముగ కుశలము విచారించి తాను రామావతారమున వేదవతికిచ్చిన మాటప్రకార మా వేదవతి ఆకాశరాజు కూతురై జన్మించినదని ఆమెయే పద్మావతి యని తెల్పి, లక్ష్మి తన సీతా వతారమందు రావణునిచెఱఁ జిక్కకుండునట్లు, అగ్ని దేవుని సహాయమున వేదవతి యనునామె రావణుని చెఱలోఁ జిక్కికష్టపడిన విషయమంతయు [illegible] పద్మావతీ శ్రీనివాసుల వివాహమునకుఁ దాను సమ్మతించి "వైకుంఠవాసా! త్రిలోకనాథా! నీ మాయ దెలియ నెవరికి శక్యమగును? నేను వైకుంఠపురము వీడి పోవుటయు లోకకల్యాణమునకే యని తలంచుచున్నదాన. నన్ను క్షమించ ప్రార్థన" యని నుడువ శ్రీనివాసుఁ డామెను దగ్గఱదీసి, ఈ జగన్నాటకమున మన మిరువురము పాత్రధారులమే గదా! అని సంతోషముగఁ బల్క లక్ష్మియు నానంద మందెను.

అప్పుడు బ్రహ్మ తల్లి లక్ష్మీదేవితో "అమ్మా! నాంది జరుపవలసి యున్నది. నాయనగారికి మంగళస్నానము చేయించవలసినదిగా వసిష్ఠుల

అనతి అయిన దనెను. అప్పుడు శ్రీదేవి మంగళద్రవ్యములు తట్టయుం దుంచుకొని సరస్వతి పార్వతి మున్నగువారితో కూడి అరుంధతీదేవిని ముందిడుకొని శాస్త్రోక్తముగా శ్రీనివాసునకు, మంగళ తూర్యారావములు మ్రోఁగుచుండ మంగళస్నానము చేయించెను. స్నానానంతరము శ్రీనివాసుఁడు పీతాంబరముల ధరించి, స్వామి పుష్కరిణీతీరమున ఏర్పరచిన ప్రత్యేక వేదికపైఁ గూర్చుండి ఊర్ధ్వ పుండ్రములను ధరించి కుబేరునిచే నియ్యఁబడిన దివ్యాభరణముల నలంకరించుకొని, సంధ్యవార్చి కశ్యప, అగస్త్య, వసిష్ఠాది మహర్షులకు నమస్కరింప వారు వేదోక్త మంత్రములఁ జదివి "శీఘ్ర మేవ కల్యాణ సిద్ధిరస్తు!" అన నచటఁ జేరిన దేవతలు, మహర్షులు తథాస్తు! అని సంతోషమునఁ బలికిరి ఆ పిదప జరుప వలసినకార్యమును పెద్దల యనుమతితో వసిష్ఠమహర్షి శ్రీనివాసుని ప్రత్యేక వేదికయందు పీఠముపైఁ గూర్చుండ నియమించి మౌక్తికవేదిక రచియించి విధివిహిత వివాహనాంది జరుపు సంకల్ప మాదిగాఁగల కార్యకలాపముల జరిపి పుణ్యాహకర్మ పూర్తిచేసెను. ఇట్లు వసిష్ఠమహర్షి శాస్త్రవిహిత కార్యములను శ్రీనివాసునిచే చేయించెను.

శమీపూజ జరుపుటకై సకల పూజాద్రవ్యములఁగొని దేవతలు మహర్షులు శ్రీనివాసుని వెంబడింప, మంగళవాద్యములు మ్రోఁగుచుండ కుమారధారాతీర్థమునకుఁ బోయి, ఆ సమీపమందలి శమీవృక్షమును శ్రీనివాసునిచేఁ బూజింపఁజేసి, ధూపదీపనైవేద్యములిచ్చి మంగళహారతు లిప్పించి పూజాక్రమమైన పిదప, ఆ వృక్షముకొమ్మ నొకటి విఱిచి తీసికొని మరల స్వామిపుష్కరిణి కడకువచ్చి ఆ శమీశాఖను వరాహస్వామి ఆశ్రమ సమీపమున ప్రతిష్ఠింపఁ జేసిరి. ఈ రీతి వివాహనాంది వసిష్ఠుఁడు సాంతముగ వెలువేర్చెను.

## 22. శ్రీనివాసుఁడు వివాహార్థము కుబేరునికడ ధనము అప్పుగా తీసికొనుట:

ఆ తరువాత శ్రీనివాసుఁడు, వివాహమునకు వచ్చినవారినెల్ల నారాయణపురమునకుఁ బ్రయాణింప సిద్ధమగునట్లు చేయవలసినదిగా బ్రహ్మతోఁ

జెప్పెను. అప్పుడు బ్రహ్మ పుణ్యాహకర్మ ముగిసిన తరువాత భోజనము చేయక ఉపవాసముతో పెండ్లివారింటికి వెడలరాదని పెద్దల యాశయము, కావున నందఱు భుజించవలసి యున్నదనెను. అప్పుడు వేంకటాచలపతి ఆ వచ్చినవారికి భోజనమునకుఁ గావలసిన వస్తుసామగ్రిని కొనుటకు తనవద్ద ధనము లేదనెను. అదివిని శంకరుఁడు "శ్రీనివాసా! అట్లనరాదు. ఒక శుభకార్యమున కుపక్రమించి మధ్య నిలుపరాదు. అప్పు చేసియైన పెండ్లి చేయువలయునని నానుడి" అని విని వేంకటాచలపతి కుబేరుని పిలచి తాను బ్రహ్మ, శంకరులతో పుష్కరిణీతీరమందున్న అశ్వత్థవృక్షముచాటునకు బోయి కుబేరునితో "కుబేరా! కలియుగమున నా కల్యాణము జరుగ వలసి యున్నది. నేను యుగ, కాల, దేశపరిస్థితుల ననుసరించి అవతారము లెత్తుచుందును. కావున నా వివాహమునకు యుగకాలానుసారము ధనము అప్పుగా నిమ్ము. నే నీ యుగానుసారము వడ్డితో నీయప్పు తీర్చెదను" అనవిని కుబేరుఁడు, "యుగధర్మము ననుసరించి అప్పుపత్రము వ్రాసి యిచ్చిన, ధన మిత్తు"ననియెను. వేంకటాచలపతి అందులకు నంగీకరించి యిట్లని పత్రము వ్రాసెను.

ఈ విళంబినామ సంవత్సర వైశాఖ శుక్ల దశమినాఁడు నారాయణపుర మేలు ఆకాశరాజుపుత్రి సౌ॥ పద్మావతితో నా వివాహము పెద్దలు నిశ్చయించి నందున, ఆ వివాహార్థము లంకాపురాధిపతి కుబేరునికడ నేను ఋణముగా పదునాలుగుసంఖ్యల శ్రీరామముద్రనిష్కములను తీసికొంటిని. యుగ దేశ కాలానుసారముగ నా భక్తులు నాకు సమర్పించు ముడుపుల నుండి, నూరు శ్రీరామముద్రికల కొక శ్రీరామముద్రిక నెలకు వడ్డివంతున చెల్లించుట కంగీకరించి వ్రాసి యిచ్చిన ఋణపత్రము.

సాక్షులు :

బ్రహ్మ
మహేశ్వరుఁడు
అశ్వత్థము

ఇట్లు,
శ్రీవేంకటాచలపతి,
తిరుమల.

ఋణపత్ర మందుకొని కుబేరుఁడు ధనము నిచ్చెను. వెంటనే వేంకటాచలపతి, ఆ ధనముతో సకలసంభారములు బెల్లము, చక్కెర, నేయి, పాలు, పెరుగు, భోజనపత్రములు, కాయగూరలు కావలసిన పదార్థములే గాక వివాహమున కవసరమగు దుకూలములను, మాంగల్యాది ఆభరణములను, వక్కలాకులు, ఏలకులు, లవంగ కర్పూరాది సుగంధ ద్రవ్యములను, ఫలములను, భోజనానంతరము దక్షిణ తాంబూలాదిగాఁగల కార్యములు నెఱవేర్ప కుబేరుని నియమించెను. పిదప వేంకటాచలపతి యాజ్ఞప్రకారము అగ్నిదేవుఁడు భక్ష్యాన్నశాకాదులను, సూపలేహ్యములను, చిత్రాన్నమును, వివిధ వ్యంజనములను సిద్ధముచేసి భోజనముల కందరిని ఆహ్వానింపు మని వేంకటాచలపతితోఁ జెప్పెను. వెంటనే పాండవతీర్థము మొదలు శ్రీశైలము వరకు దేవతలు మహర్షులాదిగా వివాహమున కేతెంచి నవా రందఱు బారులుదీర్చి కూర్చుండి, ఆ పంచభక్ష్య పరమాన్నములను శ్రీనివాసుని యనుమతి ప్రకారము నృసింహస్వామికి తొలుత నివేదన చేసిరి. ఆ పిదప 'విస్తీర్ణం పత్రభోజన' మన్నట్లు పెద్దఅరఁటియాకులు వేసి నిముసములమీఁద అందరికి అన్ని పదార్థములు వడ్డించిరి. అందఱికి ఔపాసన మిడిరి. అప్పుడు వేంకటాచలపతి అందఱు భుజించుచుండ వారికి ఆలస్యముగా భోజనము సిద్ధము చేసినందులకు క్షమాపణచెప్పి తనకుఁ గలిగిన స్వల్పపదార్థములతో పెట్టిన భోజనము తృప్తిగా భుజింప నందరిని ప్రార్థించి, తన్ను కృతార్థునిఁ జేయవలయునని వినయమున చెప్పుచుండ, అందఱు "శ్రీవేంకటేశ్వరా! నీవు పెట్టిన భోజనము అమృతసమము. ఈ భుక్తి మాకు ముక్తిసాధనము. మేము ధన్యులము; కృతార్థుల మైతిమి" అని సంతృప్తిగా భుజించి సంతుష్టులైరి. భోజనానంతర మందరికి కుబేరుఁడు దక్షిణలతో చందన తాంబూలము లిచ్చెను. ఇట్లందఱు భుజించిన తరువాత శ్రీవేంకటాచలపతి, లక్ష్మి, బ్రహ్మ, మన్మథుఁడు, వకుళమ్మ భుజించిరి. అప్పటికి రాత్రి యైనది. అందఱు రాత్రి గడపిరి.

## 23. వేంకటాచలపతి సపరివారముగా వివాహమునకు నారాయణపుర మేగుట:

ఆనాఁటి రాత్రి పద్మావతీ శ్రీ వేంకటేశ్వరుల వివాహ సుముహూర్తము. ఉదయమే పురము సర్వాలంకారములతో శోభాయమానముగ

నుండెను. పౌరులు తమ నివేశములను, పరిసరములను శుభ్రపరచి పిండిముగ్గులతోఁ బచ్చతోరణములతో పసుపుకుంకుమలతో, పూలపందిళ్ళతో నలంకరించిరి. రంగు రంగుల శోభకుతోడుగా రంభాస్తంభములనాటి పూలసరులు వ్రేలాడఁగట్టిరి.

తొండమానుఁడు మయునిచే వేయిస్తంభముల వివాహమండపమును, తన్మధ్యమున చతుఃస్తంభ వివాహవేదికను నవరత్నములచే నిర్మించి, ముత్యాలసరుల వ్రేలాడవేసి, రత్నకాంచనముల నా సభా భవనమంతయుఁ బ్రకాశవంతముగ నుండున ట్లేర్పాటు చేసెను. ఆ మండపమున దేవతలు, మహర్షులు, పురోహితాది ప్రజలకుఁ దగిన ఆసనములు, పుణ్యపురంధ్రీమణులకుఁ దగిన ప్రదేశములు నిర్ణయించెను. దివటీలు లేకున్నను రత్నకాంతిచే నా సభాభవనము రాత్రి వేళయైనను దివ్య కాంతిపుంజము పగ లట్లుండెను. ముందటిరాత్రి పెండ్లి వారందరు తిరుమలలో మయుఁడు నిర్మించిన దివ్య భవనము లందు సుఖముగా నిద్రించి ఉదయమే లేచి కాలకృత్యములను దీర్చి స్వామిపుష్కరిణిలో స్నానమాడి వైదిక కార్యముల నిర్వర్తించి, ఉపహారముల నారగించి, నారాయణపురమునకు వేంకటాచలపతి వెంట బయలుదేరిరి.

అట నారాయణపురమున శుకమహర్షి కల్యాణోచిత కార్యముల నెట్లాయత్తపఱచవలెనో బృహస్పతి చెప్పినట్లు వసునాయక తొండమానులకుఁ జెప్పి, తాను ఆకాశరాజు నాజ్ఞ గొని ముందుగా శ్రీ వేంకటాచలపతికి ఎదురేగుటకై బయలుదేరి పద్మసరోవరముకడ నిరీక్షించుచుండెను. పెండ్లి వారు తమతమ వాహనములయిన, రథ, గజ, హయ పల్యంకికలలోను, కొందఱు నడచుచు వచ్చుచుండిరి. ముందుగా గరుడునిపై వేంకటాచలపతి, వెనుక వకుళమ్మ, లక్ష్మి, మన్మథుఁడు, బ్రహ్మ మొదలగువారును, వారి ననుసరించి తక్కిన దేవతలు మహర్షులు పరివారములు బయలుదేరి వచ్చుచుండిరి. ముందుగా భేరీ మృదంగ దుందుభి వాద్యములు, నారద తుంబురాది గాయకులు, రంభాది నర్తకీజనంబులు, కిన్నరకింపురుష గంధర్వాదులు, మహోత్సాహమున వచ్చుచుండిరి.

ఆ వచ్చు గరుడవాహనుని గాంచి శుకమహర్షి పరమానందముగ సాష్టాంగనమస్కార మిడెను. వేంకటాచలపతి శుకమహర్షిని చూచినదే తడవుగ గరుడుని దిగి, మునిని సమీపించి సాష్టాంగ ముగఁ బడియున్న మునిని ఆదరమున హస్తములతోఁ, బై కెత్తి కౌఁగి లించుకొనెను. శుకమహర్షి వేంకటాచలపతిని పెక్కువిధముల స్తుతించి తన అతిథ్యము స్వీకరింప వారి నందఱిని తన ఆశ్రమమునకు ఆహ్వానించెను. వేంకటాచలపతి తమ ప్రయాణమున కాలస్యమగునని చెప్పుచుండ, వకుళమ్మ-- "నాయనా! వివాహసంధాత ఆహ్వానమంగీకరించుట మన ధర్మ " మనుచుండ శ్రీ వేంకటాచలపతి పరివార మంతయు శుకాశ్రమమున విడిదిచేసిరి. శుకుఁడు మిక్కిలి సంతోషించి తనకు లభ్యములైన కందమూలములతో శ్రీనివాసుని కాతిథ్యమిచ్చెను. శ్రీ వేంకటాచలపతి మహిమచే నా వచ్చిన దేవతాది సకల వర్గము సంతృప్తిగా భుజించినట్లు త్రేన్చిరి. వారందఱు శుకమహర్షి ఆతిథ్యముఁ బొందినట్లుగా భావించి శుకుని స్తుతించిరి. అటనుండి వేంకటాచలపతి శుకమహర్షితో నారాయణపురమునకు బయలుదేరెను అతని వెంట తగిన వారందఱు ప్రయాణమై నారాయణపుర సమీపమునఁ బోవుచుండిరి.

## 24. సపరివారముగ ఆకాశరాజు శ్రీ వేంకటాచలపతికి వెదురేగుట:

నారాయణపుర రాజాంతఃపురమందు మంగళవాద్యములు మెండుగా మ్రోఁగుచుండెను. పుణ్యాంగనలు పద్మావతికి లక్ష్మీకల్యాణ గౌరీకల్యాణ శుభ కీర్తనలు పాడుచు మంగళస్నానము చేయించి, పట్టుచీర రవిక ధరింపఁజేసి, కురుల చిక్కుదీసి జడవేసి పూలు శృంగారించిరి. తల్లి ధరణీదేవి అందించిన కనకరత్నాభరణముల చెలు లలంకరించిరి. పెద్ద ముత్తైదువలు నుదుట కుంకుమ బొట్టు పెట్టిరి. అందఱు చేరి పద్మావతిదేవిచే కులదేవతలకు మ్రొక్కించి, దేవతల కుపాహారముల చందన తాంబూలముల నర్పించి కర్పూర హారతులెత్తిరి. ఆ తరువాత పద్మావతిచే వివాహమునకు వచ్చిన పెద్ద ముత్తైదువలైన బంధువులను పురోహితుల భార్యలను, పౌరసుమంగలి

షుణులను, పసుపు కుంకుమ నూతన వస్త్రాదులతో పూజింపఁజేసిరి. ఆ షుమంగలీమణుల ఆశీస్సు లందునట్లుచేసిరి.

ఆ పిదప శ్రీమన్నారాయణుని షోడశోపచారంబులఁ బూజించి అమృత నివేదము లర్పించి మంగళహారతు లిచ్చి పెండ్లికూఁతును మ్రొక్కించిరి. తల్లిదండ్రులు పురోహిత బంధుజనులు బృహస్పతి ముఖ్యులు పద్మావతిని దీర్ఘసుమంగలియై ప్రజలను కన్న ప్రజలుగా భావించి పోషించుగాక! అని దీవించిరి. ఆ పిదప ఇష్టమృష్టాన్నముల నందఱు సంతృప్తిగా భుజించిరి. వసునాయకుం డందఱికి చందన తాంబూల దక్షిణ లిచ్చెను. తరువాత ఆకాశరాజు ఆలు బిడ్డలు, తమ్ముఁడు, కుటుంబమువా రందరు భుజించిరి.

ఆ సాయంకాలము శ్రీ వేంకటాచలపతి సబంధుమిత్ర పరివారముగా వివాహార్థము నారాయణపురము వచ్చుటను ముందుగా చారులవలనఁ దెలిసిన ఆకాశరాజు, పద్మావతి నలంకరింప ధరణీదేవితో చెప్పి పద్మావతిని నలంకరించిన తరువాత కుటుంబ పురోహిత పరివారములతో మంగళ వాద్యములతో వేంకటాచలపతికి నూతన వస్త్రాభరణములు, పూలమాలలు, చందనాది పరిమళ ద్రవ్యములు, వక్కలాకులు, పండ్లు, పానకములు, ముత్తైదువులు అంతఃపుర కాంతలు చెలులు నడుమ ఐరావతమును స్ఫురింపఁజేయు గజమును శృంగారించి ముందిడుకొని శ్రీ వేంకటాచల పతికి నెదురేగెను. వేంకటాచలపతి మామయగు నాకాశరాజును చూచినదే తడవుగ గరుడుని దిగెను. ఆకాశరాజు రథముదిగి తన పుత్త్రికను, పుత్త్రుని, భార్యను వెంటనిడుకొని శ్రీ వేంకటాచలపతికి శుభాహ్వానము పలికి "శ్రీ వేంకటేశ్వరా! నేను కృతార్థుఁడనైతి; ధన్యుఁడనైతి నా జన్మ ఫలించినది" అని శ్రీనివాసుని నూతన వస్త్రాభరణములతో గంధమాల్యాదు లతో పూజించి, పానక మిచ్చెను. పద్మావతి శ్రీనివాసు లొండొరులు నిరగంటఁ జూచుకొనిరి. శ్రీనివాసుని వెంట వచ్చినవారి నందఱిని ఉచిత రీతి సంభావించి వారందఱిని ఆహ్వానించి, వేంకటాచలపతిని గజారూఢుని చేసి పద్మావతిని పల్లకి నెక్కించి మంగళ వాద్యములతో నర్తకీజనముల ఆటపాటలతో మహోత్సవముగ నారాయణ పురవీథుల నూరేగింపు జరిపి

పెండ్లి వారికై ప్రత్యేకముగ నిర్మింపఁబడిన దివ్య మందిరము చేరుచుండ పురజనములు, పురంధ్రీమణులా శ్రీనివాసునిపై సుగంధ పరిమళ పుష్పములఁ జల్లిరి. మందిరప్రవేశమునకు ముందు తొండమానుని భార్య వేంకటేశునకు మంగళహారతి పట్టెను. తొండమానుఁడు టెంకాయతో దిష్టిదీసి పగులకొట్టెను. మంగళ వాద్యములు మెండుగా మ్రోఁగుచుండ వేంకటాచలపతి ముందు కుడిపాదము పెట్టి మందిరమును ప్రవేశించెను. ఆ వచ్చినవారలందరు తొండమానుఁడు చూపిన విడిది భవనములందు సుఖముగా నుపవిష్టులైరి.

శ్రీ వేంకటాచలపతి కుబేరుని బిలిచి "కుబేరా! నీ విప్పుడాకాశరాజును కలసి రాత్రి పదుమూఁడు గడియలకు సుముహూర్తమగుటచేఁ దత్పూర్వమే భోజనములు జరుగుట ఉచితము" అని చెప్పి రమ్మనెను. కుబేరుఁడును వేంకటాచలపతి యానతి ఆకాశరాజునకు వినిపించెను. వెంటనే ఆకాశరాజు దేవతలకు, మహర్షులకు బ్రాహ్మణ భోజనములు శీఘ్రముగా జరిపించి వారి కెల్లరుకు దక్షిణతాంబూల చందనము లిచ్చెను.

## 25. ఆకాశరాజు వివాహార్థము వేంకటాచలపతిని విడిది నుండి వివాహమండపమునకు కొనివచ్చుట, పద్మావతీ వేంకటేశ్వరుల వివాహము:

ఆ దినము వైశాఖ శుద్ధదశమి. పద్మావతీ వేంకటేశ్వరుల వివాహ ముహూర్త సమయము సమీపించుచుండ, ఆకాశరాజు తన సోదరుని కుమారుని బిలిచి వరపూజకు సిద్ధముచేయు నట్లాజ్ఞాపించెను. అంత వారు కావలసిన వస్తుసముదాయము సిద్ధము చేసినట్లు చెప్పిరి. అప్పుడు ఆకాశరాజు బృహస్పతి శుకమహర్షులను ముందిడుకొని శుద్ధాంతకాంతలు, పురంధ్రీలలామలు, సకలబంధుమిత్ర పరిజనముల, సిద్ధముగానుండ, వర పూజకు కావలసిన నూతన వస్త్రాభరణ చందనములు, పూలహారములు, ఫలములు, తాంబూలములుగల తట్టలను దాసీజనులు సిద్ధముగ హస్తముల ధరించియుండిరి. చక్కఁగా నలంకరించిన గజమును మావటివాఁడు

గొనితెచ్చెను. వందిమాగధులు, పురోహిత, పౌరులు సంసిద్ధముగ వర పూజకొఱకు ప్రయాణమయిరి. దివిటీలు కాగడా లా రాత్రిని పట్టపగలు గావించెను. అంత నాకాశరాజు కూడినవారందరితో వేంకటాచలపతి విడిది మందిరమునకు బయలుదేరెను. మెల్లినడకతో వివిధమంగళవాద్యములతో నందరు వేంకటాచలపతి విడిదిమందిరముఁ జేరిరి. అప్పుడు వేంకటాచల పతి అలంకృతుఁడై మందిర మధ్యభాగమందున్న వేదికపై రత్నాసనమున గూర్చుండెను. అతనిని పరివేష్టించి బ్రహ్మాదిదేవతలు, వసిష్ఠాదిమహర్షులు వివాహాహ్వానితులైన సురసిద్ధసాధ్యులు సభదీరియుండిరి. ఆ సమయ మున సభామధ్యమందున్న వేంకటాచలపతి రాకాసుధాకరుని చందమున నుండెను. ఆ వచ్చు మామగారిని గాంచి వేంకటాచలపతి ఆసనమందుండి లేచి ఎదురేగి నమస్కారపూర్వకముగఁ గౌఁగిలించు గొని "వయోవృద్ధులైన మీరేల శ్రమ తీసికొంటిరి? ఈ యువకుని పంపరాదా" యని వసుధాని చిఱునవ్వునఁ జూచెను. శ్రీ వేంకటాచలపతి ఆలింగనమున ఆకాశరాజు తన జన్మసార్థకమైనదని భావించెను.

అప్పుడు వసిష్ఠుఁ డాకాశరాజుతో వరపూజ గావింపవలసి నదిగా చెప్పెను. ఆకాశరాజు బృహస్పతి యానతిని తన భార్యయైన ధరణీదేవి కా విషయమును దెలిపెను. ధరణీదేవి అరుంధతీదేవిని ముందిడుకొని, సుమంగళీ జనంబులు వివాహోచితపదములను బాడుచుండ, మంగళ వాద్యములు శ్రవణానందముగ నుండ, రత్నాసనమం దధిష్ఠితుఁడై యున్న వేంకటాచలపతికి, ధరణీదేవి నూతన వస్త్రాభరణాదుల నిచ్చి పుష్పహారముచే నలంకరింపఁజేసి చందనము నలఁది, తాంబూల ఫలంబుల చేతి కిచ్చెను. ధరణీదేవి అప్పట్టున శ్రీనివాసుని కన్నులపండువుగాఁ గాంచి, తన పుట్టువు చరితార్థమైనదని సంతోషించెను.

ఆ సమయమున శ్రీ వేంకటాచలపతిని దర్శించిన బృహస్పతి, వసి ష్ఠాది మహర్షులు, సకలదేవతలు పురోహిత పౌరులాదిగా సభా సదులైన వారందరు తాము వైకుంఠవాసునే దర్శించినందులకు మహానందమును జెందిరి.

పురోహితులు ముహూర్తము సమీపించుచున్నదని తొందరపెట్ట ఆకాశరాజు శ్రీ వేంకటేశునిదోడ్కొని భద్రగజంబుకడకు వచ్చెను. వివాహో త్సవితు లందరు శ్రీ వేంకటేశుని వెంట బయలుదేరిరి. వేంకటాచలపతి గజారోహణముచేసెను. భూలోకదేవేంద్రుఁడా యని నారాయణపుర పౌరులు చూచుచుండ గజము మెల్లగ నడువసాగెను. దానికి ముందు నర్త కీజన నాట్యము, వారికి ముందు నాట్యసంగీతము, వారికి ముందు వివిధ మంగళతూర్య నాదములు, నిండుగా మ్రోఁగుచుండ గజము నారాయణ పురవీథులనుండి వివాహమండపమునకు మెల్లగం బోవుచుండ, ఆ యా వీథులందు పౌరకాంతలు వేంకటాచలపతికి మంగళహారతు లెత్తిరి. ప్రతి వీథిలో బాణసంచా మున్నగు పెక్కువేడుకలు జరుగుచుండెను. మహర్షులు వేదపారాయణముఁ జేయసాగిరి. పురోహితులు వైవాహిక మంత్రములను పఠించుచుండిరి. ముత్తైదువులు కల్యాణోచిత గేయములను బాడుచుండిరి. పెండ్లినడక లిట్టివని చూపుచున్న దా యన్నట్లు గజము మెల్లనినడకలు సాగించుచు కల్యాణమండపము చెంత నిలచెను. వేంకటాచలపతి గజావ రోహణము చేసి ద్వారముచెంత నిలిచెను. అప్పుడు తొండమానుని భార్య ముత్తైదువులతోఁ గూడి వచ్చి వేంకటాచలపతికి నీరాజన మిడెను. వసు ధానుఁడు బావగారి చేయి పట్టుకొని వివాహవేదికపై నున్న రత్నాసనమునఁ గూర్చుండఁ బెట్టెను. పురోహితులు స్వస్తి వచనంబులు పలుకుచుండిరి. వివాహమంగళవాద్యములు ఘనముగా మ్రోఁగుచుండినవి.

బ్రహ్మాదిదేవతలు, ఇంద్రాది దిక్పతులు, నారదుఁడు తుంబురుఁ డాదిగాఁగల గాయకులు గంధర్వ కిన్నరకింపురుష నాగప్రముఖులును, ఆ కల్యాణకూటమున నుచితాసనములఁ గూర్చుండియుండిరి. మహర్షులందరు వసిష్ఠ బృహస్పతుల ననుసరించి కల్యాణవేదికదగ్గర నుపవిష్టులై యుండిరి.

పురోహితులు ముందుగనే స్వామిపుష్కరిణీతీర్థమును బంగారు కలశ ములఁదెచ్చి వేదికపైనుంచిరి. వసిష్ఠుఁడు ముహూర్తారంభమునకు పూజ లాచరించుచుండెను. కావలసిన వస్తుసముదాయము, పాలు, నేయి సమిధలు సమకూర్చుఁడెను. నిలువెత్తు వెండిదీపస్తంభములు వివాహవేదిక ఇరుగడల

దివ్యజ్యోతులతో ప్రకాశించుచుండెను. వసిష్ఠ బృహస్పతులు వివాహోచిత మంత్రముల పఠించుచు కార్యక్రమమున కుపక్రమించిరి. పురోహితులు సంకల్పమును చెప్పుచు కార్యక్రమమును జరుపుచుండిరి. వసిష్ఠుఁడు మధుపర్కమును వేంకటాచలపతి కిచ్చెను. ధరణీదేవి హేమకుంభముల నిండుగా స్వామిపుష్కరిణీ తీర్థమును నింపెను. వసిష్ఠుఁడు వేదములను జదువుచుండెను. బంగారుతట్టలో వేంకటాచలపతి తన పాదద్వంద్వ ముంచెను. ధరణీ దేవి పవిత్రతీర్థమును హేమకుంభములనుండి పోయు చుండ ఆకాశరాజు వేంకటాచలపతి పాదయుగళిని కడిగి ఆ జలమును తాను తన భార్య పుత్త్రుఁడు సోదరుఁడు శిరమునఁ జల్లుకొని పవిత్రు లైనట్లు సంతోషించిరి. వసిష్ఠుఁడు మంత్రములు చెప్పుచుండ ఆకాశరాజు వేంకటా చలపతి పాదములు గడిగి చందన కుంకుమ పుష్పాక్షతలతో శ్రీవారి పాదముల పూజించి కర్పూరహారతిపట్టి సాలంకృత కన్యాదాన ముహూర్తమునకు సంసిద్ధముగా నుండెను.

సుమంగళీమణులు పద్మావతికి బంగారుకుచ్చులతో మల్లెమొగ్గల జడ వేసి, రత్న వైడూర్యములు హంసలు చెక్కిన జడబిళ్ళ పెట్టి దానికి పూలు చుట్టి పాపటబొట్టు, ముత్యాల చెంపసరము అలంకరించి బంగారుసరి గంచు పట్టుచీరను గట్టి, అట్టిదేయగు రవిక తొడిగించి, వివిధాభరణములను ధరింపఁజేసి, కాటుక బుగ్గచుక్క పెట్టి తిలకము దిద్ది, కాళ్ళపారాణి అలంకరించి నవవధూ అలంకరణములతోఁ బెండ్లి కొమార్తెను సిద్ధము చేసిరి. అరుంధతీదేవి మున్నగు పుణ్యాంగనలు పెండ్లికూఁతురు పద్మావతీ దేవిని శ్రీవేంకటాచలపతికి కుడిభాగమందున్న రత్నాసనమున పెండ్లిపా టలు పాడుచు కూర్చుండఁ బెట్టిరి. కన్యాదాన ముపక్రమించుటకు ముందుగా ఆకాశ రాజు వేంకటాచలపతికి కోటిసంఖ్యల సువర్ణనిష్కము లను, వరదక్షిణగా నిచ్చెను. మఱియు అపురూపమైన అపరంజికిరీటమును, అమూల్యములైన పెక్కువజ్రహారములను, నవరత్నకర్ణభూషణములను, భుజ కీర్తులను, పదివ్రేళ్ళకు రత్నాదులుతాపిన బంగారుటుంగరములను, వజ్రాది దివ్య మణియుక్తమైన బంగారుకటిహస్తమును, రత్నఖచితములగు బంగారు పాదుకలను, అసంఖ్యాకములైన రజతజలపాత్రలాదిగాఁగల వానిని, అనాఁటి

రాజోచితమర్యాదల నెన్నింటినో ఘనముగానిచ్చి, గజతురగ గో సహస్రంబుల అల్లునకు బహుమానముగా నిచ్చెను. ఈ బహు మానములతో, వసిష్ఠ బృహస్పతులు సాంగోపాంగముగ మంత్రములు చెప్పచుండ పద్మావతిని స్వామి పుష్కరిణీతీర్థముతోఁ గూడ సాలంకృత కన్యాదానము చేసెను. ఆ పిదప వసిష్ఠుఁడు వేంకటాచలపతికి కంకణధారణ గావించి వేంకటా చలపతిచేఁ బద్మావతికి కంకణధారణ చేయించెను. అప్పుడు బృహస్పతి కన్యాప్రవర నిట్లు చెప్పెను. "శ్రీనివాసా! శ్రీవేంకటేశా! అత్రి గోత్రోద్భవురాలు, సువీరమహారాజు ప్రపౌత్రి, సుధర్మమహారాజు పౌత్త్రియు, ఆకాశరాజు పుత్త్రియు నగు సౌభాగ్యవతి పద్మావతిని నీకు సహధ ర్మచారిణిగ, అర్ధాంగిగా మంత్రపూర్వకముగ ఆకాశరాజు నీకు కన్యాదాన మిచ్చెను. అంగీకరింపుము" అనుచుండ ఆకాశరాజు మహానందమును చెంది, శ్రీ వేంకటేశునకు స్వర్ణాంబరముల, రత్నాభరణముల నిచ్చెను. తదుపరి వసిష్ఠమహర్షి శ్రీ వేంకటాచలపతిని గూర్చి ప్రవర నిట్లు చెప్పెను. "వసిష్ఠగోత్రోద్భ వుఁడు, యయాతి ప్రపౌత్త్రుఁడు, శూరుని పౌత్త్రుఁడు, వసుదేవుని పుత్త్రుఁడగు శ్రీ వేంకటేశ్వరులు అత్రిగోత్రోద్భవురాలగు ఆకా శరాజుపుత్త్రిని తన సహధర్మచారిణిగా అర్ధాంగిగా గ్రహించుచున్నా" డని చెప్పెను. భూనభోంతరముల మంగళతూర్యారావములు చెలఁగుచుండ ధరణీదేవి చేతితీర్థమును ఆకాశరాజు తన చేతపట్టి శ్రీ వేంకటాచలపతి కుడిహస్తమందుంచి కన్యాదానతంత్రము పూర్తిచేసెను.

సువాసినీమణులు అరుంధతి మున్నగు వారందరు కల్యాణ సమయ కీర్త నలను బాడుచుండ, వసిష్ఠాది పురోహితులు మాంగల్యధారణ మంత్రముల చెప్పచుండ శ్రీ వేంకటాచలపతి పద్మావతి కంఠమున మంగళసూత్రమును గట్టెను. అప్పుడు దేవతలు మహర్షులు మున్నగు సదస్సంతయు ఆ నవవధూవరులపై నవరత్నాక్షతలను చల్లుచు ఆశీర్వదించిరి. వసిష్ఠుఁడు ముమ్మారు వసుధానుని హస్తములనుండి పద్మావతిహస్తములకు, ఆమె హస్త ములనుండి శ్రీనివాసుని హస్తములద్వారా లాజహోమము చేయించెను. తరువాత వైఖానస పురోహితుఁడు పద్మావతి శ్రీనివాసులచే వైవాహిక విధినంతయు సాంగోపాంగముగ జరిపించెను.

తరువాత ఆకాశరాజు తమ్మునితో చెప్పి వివాహోహూతుల కందరికి పుష్ప, ఫల, చందన, తాంబూలముల దక్షిణతో నిప్పించెను. ముహూర్తమునకు ముందుగా భుజింపని వధూవరుల పక్షము వారందరు వివాహానంతరము పురోహితుఁడు, వధువు, వరుఁడు వారి స్వబంధువులు భుజించిరి.

మరునాటి యుదయమున వధూవరులకు నలుగులు, వసంతములు అన్యోన్యము గావించుకొనునట్లు పుణ్యాంగనలు తోడ్పడిరి. వారికి అభ్యంగన స్నానము గావించిరి. ఆకాశరాజు అ పెండ్లికివచ్చిన వారికి, పురజనులకు పంచభక్ష్య పరమాన్నములతో సంతృప్తిగా భోజనము లిడి, వారినందరిని తన యింట నాల్గుదినము లుండ ప్రార్థించి వారికి నిత్య నూత్న సంతర్పణలు గావించెను. అయిదవనాఁడు వాడుక చొప్పున నాకబలి కంకణవిసర్జనము జరిపించి, వధూవరుల రత్నాసనములఁ గూర్చుండఁబెట్టి నూతన వస్త్రాభరణము లిచ్చెను. వివాహమహోత్సవము కన్నులపండువుగా నైదుదినములు జరిగినది. ఆనాటి సాయంకాలము ఆకాశరాజు ధరణీదేవియు పద్మావతిని శ్రీవేంకటాచలపతికి వకుళాదేవికి శ్రీలక్ష్మీదేవికి అప్పగింతల పాటలతో సంతోషముగ నప్పగించిరి. వెంటనే వధూవరుల నప్పటికి సిద్ధముగ నలంకరించిన ఐరావత సదృశగజముపైఁ గూర్చుండఁబెట్టి మేళతాళములతో వరుని బంధుమిత్రులాదిగా గలవారిని ఉచిత మర్యాదలతో వరుని విడిదికి సాగనంపెను. పరకీయమైన కన్య దాపుదు ధనము, ఆ ధనము తనయొద్ద దాచిన వరునకు గృహమేధి సురక్షితముగ అప్పగించినట్లు ఆకాశరాజు సంతృప్తిఁ జెందెను.

## 26. వేంకటాచలపతి ఆరుమాసములు అగస్త్యాశ్రమ సమీపమున నివసించి తదుపరి పద్మావతితో వేంకటాచలము చేరుట:

మూఁడు నిద్రలైన తరువాత శ్రీ వేంకటాచలపతి పద్మావతీ దేవితో గరుడుని అధిరోహించి అత్తవారింటికి పోయి తాము వేంకటాచలమునకుఁ

బోవుట కనుజ్ఞకోరెను. అప్పుడు ధరణీదేవి కుమార్తెను గౌఁగిలించి నోట మాట రాక ఆనందబాష్పములతో నుండెను. ఆకాశరాజు అంగవస్త్రముతో కన్నీరు తుడుచుకొని అల్లుని కుమార్తెను దీవించెను. వేంకటాచలపతి అత్తమామలకు చిన్నమామగారైన తొండమాను దంపతులకు నమస్కరించి వారి యానతినిగొని బావమఱది వసుధానునితో సంతోషముగ సరసోక్తులాడి వారియందరి యనుమతితోఁ దాను సతీసమేతముగా బ్రహ్మాదిదేవతలతో, మహర్షులతో పయనమై సువర్ణముఖీతీరమునఁ గల అగస్త్యాశ్రమమునకుఁ బోయెను. అప్పు డగస్త్యమహర్షి వారినందరిని తన యాశ్రమమున నొక దినము నివసింపఁ గోరి, వివాహమైన నూతనదంపతులు పర్వతారోహణ ఆరుమాసములు చేయరాదని వేంకటేశ్వరునితో చెప్పెను. వేంకటేశ్వరుఁడు కల్యాణీ స్వర్ణముఖీనదుల కీశాన్యమున, అగస్త్యాశ్రమమునకు కొంత వాయ వ్యముగ సమీపమందే ఒక ఆశ్రమము నేర్పాటు చేసికొని ఆ వచ్చిన దేవతలాదిగా గలవారి నందరిని తగురీతి సత్కారములొనర్చి సంతృప్తి పఱచి వీడ్కొలిపెను. బృహస్పతి, వసిష్ఠుఁడు, శుకుఁడును శ్రీవేంకటేశుని యానతిని తమ తమ నివాసములకుఁ జేరిరి. లక్ష్మి కరవీరపురమునకుఁ బోయెను. నూతన దంపతులు తమ ఆశ్రమమం దాఱు మాసము లుండిరి. అట్లు వివాహితుఁడైన శ్రీనివాసుఁడు భార్యతో నివసించిన ప్రదేశమే నేఁడు శ్రీనివాసమంగాపురముగా వ్యవహరింపఁబడుచున్నది. అచ్చటనే కల్యాణవేంకటేశ్వరాలయము చాల ప్రసిద్ధముగ నున్నది.

వేంకటాచలమునకుఁ బోవుటకు ముందు ఒకనాఁడు వేంకటాచలపతి పద్మావతితో నారాయణపురమునకుఁ బోయి, వకుళమ్మ వేంకటాచలము నకుఁ బోయియున్నదని, తా మింక ఆలస్యముచేయక వేంకటాచలమునకుఁ బోవలయునని చెప్పఁగా ఆకాశరా జత్తగారింటికి పోవు కుమార్తెకు సారె చీర రవిక లిచ్చి, మేలి వరిధాన్యపు గరిసెలు, వివిధములైన కాయధాన్యములు, చింతపండు, బెల్లము, చక్కెర, నెతిడబ్బాలు, పెరుగుబానలు, పాలబిందెలు, మిరపకాయలు, అవాలు మున్నగు వివిధసంభారములు, కూరగాయలు, కంద మూలములు, అల్లము, పుదీన, కొత్తిమిరి, నిమ్మపండ్లు, వివిధఫలములు, లడ్లు, వడలు, అతిరసంబు లాదిగాగల ఖాద్యములు గంపలకొలఁదిగా సారె

సమకూర్చి, దాసదాసీజనంబులతోఁ గూడ ఆ సారెకావిళ్లు, పెట్టెలు వేంకటాచలమునకు కుమార్తె వెంట పంపెను. శ్రీనివాసుఁడు పుష్కరిణీతీర తింత్రిణీవృక్షము క్రింది వల్మీకభవనమున పద్మావతితోఁ బ్రవేశించెను. వకుళమ్మ ఆ నూతనదంపతులకు ముందుగా నీరాజనమిచ్చి పాలు పండ్లు తొలుతగా నిచ్చి ఉచితజ్ఞత నిర్వర్తించెను. వారి వెంట ఆకాశరాజు పంపిన సారెసామగ్రియుఁ జేరెను. వేంకటాచలమున పద్మావతీ సతితో శ్రీనివాసుఁడత్యంతానందమున నుండెను.

## 27. ఆకాశరాజు నిర్యాణము, తొండమానునకు వసునాయకునకు రాజ్యవిభేదము మాన్పి శ్రీనివాసుఁడు వారిని సంతోషపఱచుట:

ఇట్లుండ నొకనాఁడు నారాయణపురమునుండి రాజపురోహితుఁడు శ్రీనివాసుని నివాసమునకు వచ్చి, ఆకాశరాజు అంతిమావస్థలోనున్నట్లు తెలిపెను. అది విని పద్మావతి దుఃఖించెను. శ్రీనివాసుఁ డామెను ఓదార్చి వకుళమ్మతో పద్మావతీదేవితో పురోహితసహితముగ తగిన పరివారముతో బయలుదేరి అగస్త్యాశ్రమమునకుఁ బోయి, ఆ మునికి ఆకాశరాజు పరిస్థితిని దెలిపి, అందరు కలసి నారాయణపురమునకుఁ బోయిరి. పద్మావతి విచారవదనముతో నంతఃపురము లోనికిఁ బోయి, తండ్రి పరిస్థితిని చూచి చెంతనున్న తల్లిని గౌఁగిలించుకొని బిట్టు వాపోయెను. వకుళమ్మ తల్లిబిడ్డల సమయోచితముగ అనునయించి, పద్మావతిని వేరొకగదిలోనికి తీసికొనిపోయెను.

అగస్త్యమహర్షి ఆకాశరాజునకు సమీపముగఁ జేరి ఆయనకు శ్రీనివాసునిరాక వెల్లడించెను. కాని ఉచ్ఛ్వాసనిశ్వాసములతో నున్న ఆకాశరాజు కనులు మూతపడియుండినవి. అది గాంచి శ్రీనివాసుఁడు ప్రాకృతుని భంగి వసుధాముని తొండమానుల గౌఁగిలించుకొని ఎలుగెత్తి రోదనము చేసెను. అప్పు డందఱు గొల్లున దుఃఖించిరి. అప్పుడాకాశరాజు మెల్లగ కనులు తెరచెను. అందరిని ఒకసారి చూచి అగస్త్యునకు నతిప్రయాసతో

నమస్కరించెను. అగస్త్యుఁ డతనికి శ్రీనివాసుని చూపెను. శ్రీనివాసుఁ డాతనిని సమీపించెను. ఆకాశరాజు మాట్లాడలేని స్థితిలో నుండెను. కుమారుని, తమ్ముని సమీపముఁ జేర సంజ్ఞచేసి, వారి కుడిహస్తములను తన కుడిహస్తముతోఁ బట్టుకొని తనప్రక్కన నిలబఁడియున్న శ్రీనివాసుని కుడిహస్తమునఁబెట్టి మెల్లగా "పురుషోత్తమా! దేవదేవ! వీరిని రక్షింపు" మనుచుండు నంతలో వకుళమ్మ పద్మావతి, ధరణీదేవి యచ్చోటికి వచ్చిరి. వారిని సమీపమునకుఁ బిలిచి పద్మావతి తల నిమిరి, ధరణీదేవికి సహగమనమున కాజ్ఞయిచ్చి, శ్రీనివాసుని అగస్త్యమహర్షిని, వకుళమ్మలను చూచి, 'వైకుంఠవాసా! తవ చరణం శరణం' అని నిమీలితనేత్రములతో మెల్లగ నుచ్చరించుచు కడపటి ప్రాణవాయువుల విడచెను. అందరు ఒక్కసారి రోదనచేసిరి. పురోహితులు, మంత్రులు అంత్యసంస్కారమునకు సిద్ధము చేసిరి. పట్టణము విషాదచ్ఛాయలతో నిండిపోయెను. పురజనులు రాజ ప్రాసాదముఁ జేరి విలపింపసాగిరి. వసునాయకుఁడు పినతండ్రితోఁ గూడి పురోహితుల ననుజ్ఞల ననుసరించి కర్మకాండ నిర్వర్తించుచుండెను. అందరు ప్రేతసంస్కారమునకు పరేతనిలయమునకుఁ బ్రయాణమై సాగిపోవుచుండిరి. వారివెంట ముత్తైదువులు మధ్య పెండ్లికూతురట్లు అలంకారములతో ధరణీ దేవి తలవంచి నడచుచుండెను. శ్మశానవాటిక చేరిన తరువాత పురోహితులు సమగ్రముగ కర్మకాండ జరిపి చందనదారువులచితిపై ఆకాశ రాజు శరీరము నుంచిరి. నేతికడవల గ్రుమ్మరించిరి. వసునాయకుఁడు దక్షిణాగ్ని రగిలించెను. చితి తేజోవంతముగ ప్రజ్వలించుచుండెను. ధరణీదేవి భర్త చితికి మూఁడు ప్రదక్షిణములుచేసి భర్తను మనమునఁ దలంచి యా చితిలోఁ బ్రవేశించెను. నిముసములో నా దంపతుల నగ్నిదేవుఁడు వైకుంఠమునకుఁ గొనిపోవుచున్నాఁడా యన్నట్లు మంటలు మింటినంటెను. అంతలో స్వర్గలోకమునుండి దివ్యవిమాన మేతెంచుటయే తడవుగా ఆకాశరాజు సతీసమేతుఁడై దానినధిష్ఠించెను. వెంటనే విమానము వారిని స్వర్గమునకుఁ గొనిపోయెను. అంత నందఱు నాఁటి పితృకర్మ ముగించి గృహోన్ముఖులైరి. ఆ పిదప జరుపవలసిన పైతృకమును వసుధాముఁడు వసిష్ఠాది మహర్షులతో, పురోహితులతో, బంధుమిత్ర పరివారముతో, పౌరు

లతోఁ గలసి శాస్త్రోక్తముగ సర్వకార్యములు సమాప్తి గావించెను. ఇట్లు వసుధానుఁడు తొండమానుఁడు ఆకాశరాజు కర్మకాండ జరిపి, మహర్షులకు, వేదవేదాంగ పండితులకు, పురోహితులకుఁ దగిన దానాది కార్యములొనర్చి బీదసాదులకుఁ దృప్తిగా అన్నదానమును గావించిరి. ఇట్లు ఆకాశరాజు పరలోకక్రియ లన్నింటిని సమాప్తము చేయించి శ్రీనివాసుఁడు వకుళమ్మ పద్మావతులతోను వసిష్ఠాదిమహర్షులును బంధుమిత్రాదులును దమ తమ నివాసములకుఁ బయలుదేరిపోయిరి.

ఇట్లు కొంతకాలము గడువ, తొండమానుఁడు తొలుత తండ్రి పంచి యిచ్చిన రాజ్యమును, అన్నగారి రాజ్యమును సమష్టిగా అన్నగారి అనుమతి ప్రకారము పాలించుచుండి, ఆకాశరాజు ననంతరము తాను ప్రత్యేకముగ నుండఁదలఁచి చరాస్తి పంపకవిషయమై వసుధానునితో భేదాభిప్రాయములు గలుగుటచే కలహ మంకురించెను. అందుచే నా యిరువురు శ్రీనివాసుని యొద్దకు పోయి తమ వివాదమును పరిష్కరింపఁ గోరిరి. పద్మావతియు తన సోదరునకుఁ బినతండ్రికి పోరులేని విధముగ భాగవిమర్శలు గావింప శ్రీనివాసుని ప్రార్థించెను. ఆదిలోనే వసుధానుని తొండమానుని రాజ్యకాంక్షను, జరుగగల ఫలితమును పరికించిన అగస్త్యుఁడు వా రిరువురకు క్షేమకరముగా సంధి గావించుకొనుట యుక్తమనియు, అందులకై శ్రీనివాసుని సహకారమున, అన్యోన్యభావమున, కలసియుండిన సుఖము కలదని హితబోధ గావించియుండెను.

శ్రీనివాసుఁడు పరోక్షముగా ఒక్కొక్కరితో సమాలోచనలుచేసి, వారి వారి యభిప్రాయములు తెలిసికొని, తుది నిర్ణయ మెట్లుండవలయునో యని వారినేయడిగెను. అప్పుడు వారిరువురును శ్రీనివాసుఁ డేది నిర్ణయించిన అది తమకు సంతోషమనియు, ఆ నిర్ణయమునకుఁ దాము కట్టుబడి యుండఁగలమని, మధ్యవర్తి తీర్పునకు కట్టుబడి యుండఁగలమని, మధ్యవర్తితీర్పునకు కట్టుబడి వర్తించుట సనాతనాచారమనియుఁ జెప్పిరి.

వారి మాటలందు విశ్వాసముగల శ్రీనివాసుఁడు అగస్త్యమహర్షిని పిలిపించి, అతని యెదుట తన సంధిసూచనలను వసుధానునకు తొండమానునకిట్లు తెలియఁజేసెను.

ఆకాశరాజు తొండమానులకు తొలుత తండ్రిపంచిన భాగపద్ధతుల ప్రకారము తొండమానుఁడు తొండమనాఁడు రాజ్యమును, వసుధానుఁడు ఆకాశరాజు రాజ్యభాగమగు నారాయణపురము రాజధానిగా పుత్త్రపౌత్రాదికముగఁ బాలించుకొనవలసినది.

తొండమానుఁడు అన్న ఆకాశరాజుతోకలసి, అన్నకు చేదోడువాదోడుగానుండి ఇంతవరకు ఆర్జించిన చరాస్తిని సమభాగములుగా పంచుకొనునది. ధనాగారమందలి మూలధనము, బంగారు, వెండి, నవరత్నాలు, ముత్యములు, పగడములు సమభాగము చేయనగును. ఇఁక రథ గజ తురగ గోధనము సమభాగములు. సైనికులు, బలశౌర్యబుద్ధిశీలముల ప్రకారము సమభాగములు. తక్కిన దాసదాసీజనంబులు వారి వారి యభీష్టముల ననుసరించి నియమించుకొన వలసినదని సూచించెను.

ఇంకను పాత్రలు పరికరాదులును మున్నగు వస్తువులను సమభాగము లొనర్చి తొలుత చిన్నవాఁడు వసుధానుఁడే కోరుకొనుట ఉచితమని చెప్పెను. అది ధర్మపద్ధతి యని అగస్త్యుఁడు చెప్పెను. కాని, వసుధానుఁడు, మా పినతండ్రి తాతగారు పంచిన రాజ్యమును అవిభక్త రాజ్యముగా మా తండ్రిగారితో కలసియుండి, కలసికట్టుగా పాలించినందున, తొలుత వారే వారికి కావలసిన చరాస్తి తీసికొనుట నా యభిమతమనియెను. పసివాఁడైన వసుధాని ఉత్తమాశయమునకు అగస్త్యుఁడు సంతోషించెను.

అప్పుడు తొండమానుఁడు, ఆ చరాస్తినంతయు పడమర తూర్పులుగా రెండు సరి కుప్పలుగా చేసి వానికి 1,2 భాగములుగా గుర్తించి అట్లే రెండు చీట్లు వ్రాసి మడచి, ఆ చీట్లను పద్మావతీదేవి చేతనిచ్చి, ఒకటి తనకు, వేఱొకటి వసుధానున కిచ్చునట్లు కోరెను. అప్పుడు శ్రీనివాసుఁడు

వారి సత్య ధర్మ న్యాయ పరతకు సంతోషించి చిరునవ్వులు నవ్వుకొను చుండెను. పద్మావతి తన యెదుట నేలపై కులకరించివేసి ఆ చీట్లలో నొకటి పినతండ్రికి, మరియొకటి వసుధానున కిచ్చెను. అగస్త్యుఁ డా చీట్లను తీసికొని విప్పిచూచి, 'అమ్మగారు లోకధర్మమును చక్కగా, ధర్మదేవతగా నిరూపించినారు. పెద్దవారు పైభాగమున చిన్నవారు క్రిందిభాగమున నుండుట సకల శ్రేయస్కరము. ఇట అందరు తమతమ ధర్మముల నెఱవేర్చినవారగుదురు. శ్రీనివాసున కీ సంధి శుభమైనది. ఈరీతి కలికాల ప్రజలన్యోన్య భావమున పిత్రార్జితము భాగించుకొందురు గాక!' అన తొండమానుఁడు వసుధానుఁడు శ్రీనివాసునకు అగస్త్యునకు సాగిలపడి నమస్కరించిరి. ఆ సంధి తీర్పునకు సంతోషించిరి. తొండమానుఁడు, వసుధానుఁడు సంతోషముగ అయాచితముగ పద్మావతికి మేలైన షోడశగ్రామములను, ఆడఁబడుచుకు కానుకగా నిచ్చిరి. ఆడఁబడుచుకు మడి మాన్యములు, గ్రామములు బహూకరించుట ఆనాటి నుండి ఆచారమైన దేమో. ఈ రీతిగా తొండమాను వసుధానుల భేదభావము సమసిపోయి వారు ఐకమత్యమున మెలఁగిరి.

శ్రీనివాసుఁడు తొండమనాటి రాజ్యమునకు తొండమానుని తొలుత ప్రతిష్ఠించెను. తరువాత నారాయణపుర రాజ్యమునకు వసుధానునికి రాజ్యాభిషేకము చేసెను. కొన్నాళ్ళు బావమరఁది ఇంట, కొన్నాళ్ళు చిన్నమామగారింట ఇష్టమృష్టాన్నముల సంతృప్తిఁ జెందిరి. శ్రీనివాసుఁడు, పద్మావతి వకుళమ్మలతో ఒక శుభదినమున నారాయణపురమునుండి వేంకటాచల నివాసమునకుఁ బోయెను.

తొండమానుఁడు తొండమనాఁడు రాజధానిగా చక్కని ఆదర్శ ప్రాయమైన పాలన సాగించుచుండెను. ప్రజలు కెన్నో సౌకర్యము లొనర్చెను. తన కోటలో ప్రజల భక్తిభావమభివృద్ధికై శ్రీవేంకటేశ్వర దేవాలయమును నిర్మించెను.

నారాయణపురమును రాజధానిగా వసుధానుఁడును ప్రజల భావానుగుణముగ పాలించుచుండెను. ప్రజ లా రాజులయెడ నత్యంత భక్తిశ్రద్ధలు గలిగి, విధేయులై రాజభక్తి పూరితులని కీర్తిఁ బడసిరి.

## 28. తొండమానుఁడు శ్రీనివాసుని పద్మావతిని చూచుటకై వేంకటాచలమునకుఁ బోవుట:

మఱి కొన్నాళ్ళకు తొండమాను చక్రవర్తి శ్రీనివాసుని పద్మావతినిఁ జూడవచ్చెను. ఆ వచ్చిన తొండమానుని శ్రీనివాసుఁడు పద్మావతి ఆదరపూర్వకముగా నాహ్వానించి కుశలప్రశ్నానంతరము స్నానమైన పిదప భోజనమిడిరి. ఆ పిదప శ్రీనివాసుఁడు తొండమానుని తనప్రక్క కూర్చుండఁబెట్టుకొని తాంబూలసేవనము చేయుచు తొండమానుడు రా గతంబేమని యడిగెను. అప్పు డాతఁడు "లోకేశ్వరా! లోకజ్ఞులెల్లరు భగవంతుఁడవని, పురుషోత్తముఁడవని భక్తరక్షకుండ వని, ధర్మసంస్థాపకుండవని ఎన్నియో విధముల తమరిని పొగడుచుందురు. నాకుఁ దెలిసినంతవరకు తమ సంస్తుతి సత్యసమ్మతములనితెలిసి తమదివ్యదర్శన లాలన మానసుండనై వచ్చితి" అన విని శ్రీనివాసుఁ డా రాజు భక్తికి సంతోషించి, "రాజా! మీఅన్న ఆకాశరాజు వేంకటాచలమున నున్న నన్ను గృహస్థుని గావించెను. ఇఁక నీ వొక ఘనకార్యము నొనరించి చరితార్థుఁడవు గమ్ము."

"స్వామి యాన తిచ్చిన భక్తిశ్రద్ధలతో నిర్వహించెదను. అంతయు జగద్రక్షకులగు మీయనుగ్రహమున నెఱవేరగలదని నా నమ్మకము."

"నీవు చేయుగలవను నమ్మకముతో చెప్పుచున్నాను. ఆ కార్యము నీవలన జరిగిన నేనుసంపూర్ణ గృహస్థుఁడను కాఁగలను. ప్రస్తుతము నాకుఁ దగిన నివాసము లేదు. ఇప్పు డీ చింతచెట్టుక్రింద నున్న వల్మీకమున నివసించుచున్నాను. కావున నా కొక నివాసము గట్టించు టావశ్యకము."

"స్వామి స్థలనిర్ణయము గావించిన నే నా కార్యమును వెంటనే ప్రారంభింతును."

"సంతోషము. ఆ నిలయము కట్టదలచిన స్థానము చూతము రమ్ము" అని చెప్పి తానుపద్మావతి, వకుళమ్మ తొండమానుని వెంట నిడుకొనిపోయి, వరాహస్వామినిదర్శించి వారికి తన నివేశమునకై కలి

గిన అభిప్రాయమునుఁజెప్పఁగా, వరాహస్వామి తనకు దక్షిణమున, స్వామి పుష్కరిణిగట్టున ఆలయనిర్మాణమునకు స్థలము మంచిదని చెప్పఁగా శ్రీనివాసుఁడా చోటును తొండమానునకు చూపి, "ఇచ్చోట తూర్పు ముఖముగ ఆలయమును, రెండు గోపురములు, మూఁడు ప్రాకారములు, సప్త ద్వారములు, ధ్వజస్తంభమును గలిగియుండవలయును. ఆలయమున ఆస్థానమంటపము, యాగశాల, గోశాలలుండ వలయును. మఱియు ధాన్యాగారములు, ఇతర సంభారములకుఁ దగిన గదులు, మాలాగృహములు, వివిధ సామగ్రి యుంచుట కొక గది, కర్పూరాది సుగంధద్రవ్యముల నుంచుట కొక గది, ఆగ్నేయమున సకల వసతులతో పాకశాల, దాని కెదురుగా జలవసతి కొక బావి గలిగియుండవలయును. ఆలయద్వారములు, అంతఃపురద్వారములు, తామ్రపట్టములు తాపఁబడి అపరంజిపూతతోఁ 'గూడిన బంగారువాకిలి యుండవలయును. నా కెదురుగా గరుడునకు గదియు నుండవలయును." నాఁవిని తొండమానుఁడు, మిక్కిలి సంతోషించి స్వామివారి యాజ్ఞ నెఱవేర్చెద ననిన శ్రీనివాసుఁడు "ఇదివరలో నీవు నాకై తీర్థనిర్మాణము గావించినవాఁడ వగుటచేతనే ఈ కార్యము నీకు సాధ్యమని చేయఁ గోరితిని."

"స్వామి! అంతయు తమ యనుగ్రహము. నేను నిమిత్త మాత్రుఁడను. తమ సంకల్పము లేనిదే ఎవ్వ రే కార్యమును జేయఁజాలరు. అన్నింటికి తమ యనుగ్రహమే కారణము. కాని, స్వామీ! ఒక్క మనవి. ఇదివరలో నే నెవ్వ డెట్లు తీర్థసేవ చేసితినో తెలియఁ గోరుచున్నాఁడ" ననఁగా స్వామి యాతని కిట్లు పూర్వవృత్తాంతమును జెప్పఁ దొడఁగెను.

## 29. రంగదాసుని వృత్తాంతము:

పూర్వము నేను వల్మీకమున తపోనిష్ఠలోనున్న సమయమున వైఖానసుఁ డను మహర్షి నా కృష్ణావతారకథను విని, ద్వాపరయుగ మందలి శ్రీకృష్ణుని రూపము చూడఁగోరి గొప్ప తప మాచరింపసాగె. ఆ తపము ఫలించి బ్రహ్మ ప్రత్యక్షమై, అతని కోరిక విచారించి తెలిసికొని,

ఇఁక నీవు శ్రీకృష్ణరూపమును పూజింపఁ గోరరాదు. ఈ కలియుగమున ఆ శ్రీకృష్ణుఁడే వేంకటాచలపతిగా నున్నాఁడు. కాన నీవు శ్రీవేంకటాచల పతిని పూజించి ధన్యుఁడవు గమ్ము. ఇదే నీవు వేంకటాచలమునకుఁ బోయి, అట స్వామిపుష్కరిణికి దక్షిణమున తింత్రిణీవృక్ష మూలమందున్న వల్మీకమునందలి వైకుంఠవాసుని పూజింపుము. నీవు వేంకటాచలము నకుఁబోవు మార్గమున రంగదాసుడను భక్తుఁడు గన్పింపగలఁడు. అతఁడు నీకు తోడైయుండును. నీ పూజలే వైకుంఠనాథుఁడైన వేంకటాచలపతికి మిక్కిలిప్రీతిగానుండును. నీకు నాతని దివ్యదర్శనసేవనంబున సుఖప్రాప్తి గల్గు"నని చెప్పఁగా నా వైఖానసభక్తుఁడు వేంకటాచలమునకుఁ బ్రయాణమై పోవుచుండ రంగదాసుఁడను భక్తుఁడు తోడయ్యెను. వైఖానసమహర్షి మిక్కిలి సంతోషించి రంగదాసునితో స్నేహ మేర్పరచుకొని వేంకటా చలమెక్కి పోయి, స్వామిపుష్కరిణీ దరిగల చింతచెట్టును దానిక్రింద పెద్దపుట్టను చూచి, చాల సంతోషించి ఆ పుట్ట సమీపించి చూడ అందొక దివ్యపురుషుఁడు తపోనిష్ఠలో నుండుటగాంచి అతఁడే వేంకటాచలపతి యని తలంచి నమస్కరించి తనవృత్తాంతమంతయు రంగదాసునకుఁ దెలి పెను. రంగదాసుఁడు నిత్యము స్వామిపూజకు వలసిన పూలు పండ్లు సమీపవనములు తిరిగి సమకూర్చుచుండ వైఖాననమహర్షి ఆ వల్మీక మందలి నన్ను పూజించుచుండెను.

రంగదాసుఁ డా పుష్కరిణీ ప్రాంతమున పూజకు కావలసిన పుష్పము లకై పూలచెట్లను నాటి, తులసి వృక్షములతోఁ బెంచుచుండెను. నిత్యము పుష్కరిణీజలములు తెచ్చిపోసి పూలతోఁటను చక్కగా పెంచసాగెను. తోఁటలోనే ఒకబావి త్రవ్విన తనకు నీటిమోఁత తగ్గునని తలఁచి చక్కనిబావి నొకదానిని త్రవ్వి నిర్మించెను. ఇట్లు రంగదాసు పూలవనమును బావినీటిచే పోషించుచు ఫలవృక్షములను గూడ ఎడనెడ నాటెను. ఆ పూలతోఁటలో వివిధ పుష్పములు మిక్కిలి సువాసనలు గలిగి వాడని పూ లట్లుండెను.

ఒకనాఁడు గంధర్వుఁ డొకఁడు భార్యతోగూడి స్వామి పుష్కరిణిలో స్నాన మాడుచుండెను. దర్భలు పండ్లకై పోయిన రంగదాసా మిథునమును

చూచి, వారి జల కేళీ విలాసమును చూచుచు తన కార్యము మఱచి యట్లే నిలుచుండి యా గంధర్వులజంట రూపలావణ్యములందు, కేళీవినోదము లందే మతిలగ్నమైయుండ తాను పూజావేళ గమనింపలేదు. సకాలమునకు స్వామిపూజకు కావలసిన పుష్పఫలంబులను రంగదాసు కొనిరా నందున వైఖానసర్షి కోపోద్రిక్తుఁ డయ్యెను. అప్పుడా రంగదాసు పుష్పఫలములతో వచ్చి మహర్షి కోపమున నుండుట, తన తప్పుఁ దెలిసికొని, భయభ్రాంతుఁడై కన్నీటితో భగవంతుని మనమునఁ దలంచి ప్రార్థించి తన తప్పు మన్నింప వేఁడుకొనెను. అనుతాపముఁ జెందిన రంగదాసునియెడ నాకు కనికరము గలిగి పుట్టయుందుండియె నే నా రంగదాసుని ఓదార్చి, తన మాయ వలననే రంగదాసుని మతి భ్రమించినదని, కడ కాతని పశ్చాత్తాపమున ఆ పాపము పరిహారమైనదని, పరిశుద్ధుఁడైనందున, ఆ సుకృత ఫలమున పుష్కరిణీతీరమున మృతి చెంది, మరుజన్మమున చోళరాజునకు నాగకన్యకు కుమారుఁడై జన్మించి, ఆ దొండతీఁగల సంబంధమున ఆ రంగదాసే ఈ తొండమానుఁడ వని యాతని పూర్వవృత్తాంతమును తెల్పి, "నీవు ధన్యుఁడవు. వైఖానసపూజకు నీవు పుష్పవనమును పెంచి, ఆ వనమునకై బావి త్రవ్వితివి. అట్లు శ్రీకరపుష్ప ఫల తీర్థసేవలు చేసినవాఁడవు. నాకు మిక్కిలి ప్రీతిపాత్రుఁడవు" అనవిని, తొండమానుఁ డత్యధిక భక్తి భావంబున స్వామిపాదములంటి నమస్కరించి, ఆనందబాష్పములు స్రవించు చుండ నోటమాట రాకుండినను ఎట్లో గొంతు సవరించుకొని, "స్వామీ! దయాళూ! తాము కోరిన దేవాలయమును త్వరలో నిర్మించి తమకు సంతోషము కలిగించఁ గలనని చెప్పి, పద్మావతీ శ్రీనివాసులవద్ద సెలవు తీసికొని తొండమనాటికి పోయెను.

భక్తిశ్రద్ధలతో నత్యంత సన్నిహితభావంబున తనను పూజించిన వైఖా నసమహర్షికి దర్శనమిచ్చి వేంకటాచలపతి, ఆతని పూజలే తన కత్యంత ప్రీతిపాత్రము లగుటచే నిత్యమా వైఖానసపరంపరయే తనకు పూజ చేయ వలసినదిగా నా వైఖానసమహర్షికిఁ జెప్పి సంతుష్టుని జేసెను. ఇప్పటికీ స్వామివారికి వైఖానసభక్తులే మిక్కిలిదీక్షతో పూజచేయుచున్నారు.

రంగదాసు త్రవ్వినబావి యిప్పటికిని గలదు. ఆలయమందలి ధ్వజస్తంభమునకు నుత్తరముగా ఆ బావి గలదు. ఇప్పు డా బావి నేటి వంటశాల కెదురుగా గలదు.

## 30. తొండమానుఁడు శ్రీనివాసుని ఆజ్ఞప్రకారము శ్రీవారికి ఆలయనిర్మాణ మొనర్చుట:

తొండమాను చక్రవర్తి స్వరాష్ట్రమునకుఁ బోయి వాస్తుశాస్త్రజ్ఞులఁ బిలిపించి శ్రీనివాసుఁడు కోరిన ఆలయనిర్మాణమునకుఁ దగిన పథకమును ఆలయపు నమూనా చిత్రమును వేయించెను. దానిని తన పురోహితునిచే శ్రీనివాసున కంపెను. శ్రీనివాసుఁ డా నమూనాను ఆమోదించెను. ఆ తరువాత తొండమానుఁడు శిల్పప్రధానుల రప్పించి ఆ నమూనా ప్రకారము తిరుమలలో ఆలయనిర్మాణముఁ గావింప ఆజ్ఞ చేసెను. ఆ శిల్పులు తగిన పనివారిని రావించి ఆలయ నిర్మాణమునకుఁ గావలసిన వస్తుసామగ్రిని సమకూర్చుచుండిరి. ఒక శుభముహూర్తమున శంకుస్థాపనముఁ గావింపఁబడినది. అది మొదలు రాతిపనివారు, తాపి పనివారు తమ తమ పనులఁ బ్రారంభించిరి. ఆలయ నిర్మాణమునకుఁ గావలసిన పెద్దబండలు, స్తంభములు, దూలములు, చదరపు బండలు, ద్వారబంధములు మున్నగువానిని శిల్పులు తమ శిల్పవిద్యాప్రవీణతను చూపి చెక్కుచుండిరి. ఈశాన్యభాగము నుండి ఆలయ, ప్రాకారాదులు పనివారలు నిర్మాణ మొనర్చు చుండిరి. అప్పుడప్పుడు తొండమానుఁడు వేంకటాచలమునకుఁ బోవుచు పని వారిని ప్రోత్సహించుచు, అవసరమైన మార్పులఁ జేర్పులఁ జేయించు చుండెను. శ్రీనివాసుఁడును పర్యవేక్షణ గావించుచుండెను. మహోన్నతముగ నుజ్జ్వలముగ స్వామి యభిమతము ప్రకారము రాతికట్టడముతో దేవాలయాదుల నిర్మాణము చురుకుగా సాగుచుండెను. చతుర్మూర్తి సముపేతమై, వైనతేయ విభూషితమై, సువర్ణకలశయుతమై వివిధ ప్రతిమలతోఁ గూడ విమాననిర్మాణము సాగుచుండెను. కొన్నాళ్ళకు శ్రీవారి యభీష్టానుసారము ఆలయాదులు అన్ని హంగులతో సిద్ధమైనవి. వంటశాలను వకుళమ్మ దగ్గరుండి, కావలసిన విధమున తీర్చిదిద్దించెను.

అం దామె శిలావిగ్రహము నేటికిని కలదు. గర్భాలయమునకు చుట్టు వైకుంఠవాకిలి నిర్మాణమైనది. గర్భాలయ విమానమున నలంకరించఁ దగిన కనకకలశమునకుఁ దగిన నిర్మాణములు సాగినవి. బంగారువిమానము, బంగారువాకిలి సిద్ధమైనది.

మఱియు కొండనెక్కి భక్తజనులు స్వామిసేవకు వచ్చుట కనువుగా సోపానపంక్తిని, ఎడనెడ మండపములు, శేషాచలాగ్రమున దివ్యగోపురము గూడ నిర్మాణమైనది. ఒక శుభసమయమున తొండమానుఁడు శ్రీనివాసుని కలిసి నమస్కరించి "లోకేశ! వరదా! తావక సేవకుండు తమ యానతిని నెఱవేర్చెనని తెలియపఱచుటకు సంతోషించుచున్నాఁ" డనిన శ్రీనివాసుఁడా తొండమానుని వినయమున కెనలేని సంతోషముఁ జెంది, తొండమానుని గౌఁగిలించి, "తొండ మండలరాజా! నా ముఖ్యబంధువర్గమునఁ జేరిన నీ వినయ విధేయతల కెంతోమురిసిపోతిని. నా ఆప్తబాంధవుఁడ వైతివి. నిన్నుహృదయపూర్వకముగ అభినందించుచున్నాఁడ" ననెను. అది వినిన తొండమానుఁడు ఆనందబాష్పములతో నానందించెను. అదియే బ్రహ్మానందము. 'ఆనందో బ్రహ్మ'మ్మను వేదవచనమును తొండమాను చక్రవర్తి చక్కగా గ్రహించె నన్నట్లు ముఖవైఖరి తెలుపుచుండెను.

శ్రీనివాసుఁడు బృహస్పతిని, రావించి గృహప్రవేశమునకు మంచి ముహూర్తము నిర్ణయింపఁ గోరెను. దేవగురువు తిథి వార నక్షత్ర యోగ కరణములతోఁ బాటు, తారాబల చంద్రబల యుక్తముగా, వృషభ కలశచక్రశుద్ధిగా మంచి లగ్నమున, శుభగ్రహములు ఉచ్చస్థితిలో నుండునట్టి సుముహూర్తమును నిర్ణయించెను. ఇఁక ఆలయ ప్రవేశ మహోత్సవమునకు ఇంద్రాది దిక్పతులకు, బ్రహ్మాది దేవతలకు, మహర్షులకు, యోగులకు, సకల భక్తజనులకు ఆహ్వానములు పంపఁబడెను. బ్రహ్మ మహోత్సవమును జరిపింపఁ దగిన ప్రయత్నములు చేయుచుండెను. వేంకటాచలము భూలోకవైకుంఠమై యొప్పుచుండెను. కాని వైకుంఠవాసుఁడు మాత్ర మానందమందినట్లు లేదు. ముఖము చిన్నవోయినట్లుండెను. దేవేంద్రు డాతని పరిస్థితి గమనించి "స్వామీ! దీర్ఘాలోచనలో నిమగ్నులైనట్లున్నది.

విషయము తెల్పి నన్నుపయోగించుకొందురని మనవి" అన, శ్రీనివాసుఁ డొక నిట్టూర్పు విడచి, "దేవేంద్రా! ఏమియు లేదు. ఈ శుభసమయమున లక్ష్మి లేదని నా మనస్సు పరిపరి విధముల వేదనలఁ జెందుచున్న దనుచుండ "స్వామి యాజ్ఞ యైన దేవేంద్రుఁడు నేను సంసిద్ధుడ" ననెను. "నే నాజ్ఞాపింపవలెనా?" అని స్వామి సెలవిచ్చెను.

"సంతోషము. ఇప్పుడే జగజ్జనని తోడ్కొని వచ్చెద" నని చెప్పి, తన సారథి మాతలిని పిలిచి రథము సిద్ధము చేయించుకొని ఇంద్రుఁడు కొల్హాపురమునకుఁ బోయి శ్రీనివాసుని ఆలయప్రవేశ మహోత్సవమును లక్ష్మీదేవికిఁ దెలుప ఆమెయు మిక్కిలి సంతోషించి దేవేంద్రునితో పుష్పకవిమానమున వేంకటాద్రిఁ జేరెను. శ్రీనివాసుఁ డా లక్ష్మీదేవికి ఎదురేగి గొనివచ్చెను. పద్మావతీదేవి ఆమెకు పాదాభివందనమాచరింప లక్ష్మీదేవి ఆమెను తనరెండుచేతులతో లేవనెత్తి గౌఁగిలించెను. అప్పుడు వకుళమ్మయు వారిని గాంచి యానందించెను. అప్పటి శ్రీనివాసుని సోయగము వర్ణింప ఆదిశేషుఁడు చాలఁడేమో యనునట్లుండెను.

ఆలయప్రవేశ సుముహూర్తము సమీపింప, ఆలయ మత్యద్భుతముగ అలంకరింపఁబడెను. రంభాస్తంభపటలితో మామిడితోరణములతో వివిధ పుష్పహారములతో మణిమయకాంతులతో ప్రకాశముగ నుండెను.

శ్రీనివాసుఁడు, లక్ష్మీదేవి, పద్మావతి, వకుళమ్మ మంగళ స్నానము లొనర్చి, పీతాంబరముల ధరించి, నవరత్నభూషల నలంకరించుకొని, పూల మాల సవరించుకొని, శుభకలశమును శ్రీనివాసుఁడు గొనివచ్చుచుండఁగా, భార్య లాతని ప్రక్కల పరివేష్టించి వచ్చుచుండిరి. వారివెనుక తొండమాను కుటుంబము, వసువాయకుని కుటుంబము, ఇంద్రాదులు బ్రహ్మాదులు అంద రికంటె ముందుగా వేదమంత్రములు పఠించుచు బృహస్పతి, వసిష్ఠాదులు నడచుచుండ మంగళ తూర్యారావములు చెలఁగుచుండ లగ్నకాలమునకు సమముగా శ్రీనివాసుఁడు ద్వారముచెంత గోపూజ చేసి ఆలయప్రవే శము నొనర్చెను. శాస్త్రసమ్మతముగ గృహప్రవేశమహోత్సవము ముగిసి నది. ఆనందమయమైన ఆ యాలయమును దేవతలు ఆనందనిలయమని

పొగడిరి. దివ్యసువర్ణవిమానము క్రింద శ్రీనివాసుఁడు లక్ష్మీ పద్మావతుల తన వక్షఃస్థలమున నిరుగడల ధరించి "ఈ కలియుగాంతము వఱకు, ఈ యానందనిలయమున అర్చావతారమున నిట్లేయుండి దేవతలకు, మహర్షులకు ఆత్మీయభక్తులకు సదా దర్శనమిచ్చుచుందు"నని చెప్పఁగా అందఱు సంతోషమున శ్రీనివాసుని పెక్కువిధముల స్తుతించిరి. నారదాదులు పొగడిరి. గంధర్వులు నాట్య మొనర్చిరి. అందరు భోజనములైన పిదప శ్రీనివాసుని అనుమతిఁ బొంది నిజనివాసములకుఁ జనిరి. బ్రహ్మ శ్రీనివాసుని యానతిని బొంది ప్రతిసంవత్సరము భగవంతునకు మహోత్సవము జరుపుటకు నిశ్చయించెను. అట్లే యీ నాటికి ప్రతిసంవత్సరము శ్రీనివాసునకు బ్రహ్మోత్సవ మతి వైభవముగా జరుగుచున్నది.

అది మొదలు శ్రీనివాసుఁడు లక్ష్మీపద్మావతీ సహితుఁడై అర్చావతారమూర్తిగా కలియుగమున భక్తుల కోర్కెల నెఱవేర్చుచు కలిబాధల నివారించుచున్నాఁ డనుట లోకప్రసిద్ధము.

వేంకటాచలమందలి శ్రీనివాసుని ఆనందనిలయమే భూలోక వైకుంఠము. ఆ వైకుంఠదర్శనార్థులై భక్తులు నిత్యము తండోపతండంబులుగా వచ్చి, దర్శించి తమ కోర్కెలు నెఱవేర్చుకొనుచున్నారు.

## 31. కూర్ముఁడు భీముఁ డను వారి వృత్తాంతము:

శ్రీవేంకటేశ్వరుఁడు అర్చామూర్తిగా ఆనందనిలయమున వేంచేసియున్న కాలమున దక్షిణదేశముల కూర్ముఁ డను పితృభక్తి పరుఁడుండెను. అతని తండ్రి మరణింపఁగా నాతని అస్థులను తీసికొని గంగానిమజ్జనమునకు కుటుంబముతోఁ బయనమై పోవుచు మార్గ మధ్యమున తొండమానుని ఘనకీర్తి విని యాతనిని దర్శింప తొండమ నాటికి పోయెను. అట్లు పోవునపుడు భార్యను చిన్నకుమారుని ఒకచో విడిచిపెట్టి తా నొక్కఁడే రాజాస్థానమునకుఁ బోయెను. ఆ సమయమున రాజు నిండు పేరోలగముండి పండితుల శాస్త్రవాదములు వినుచుండెను. ఆనాటి శాస్త్రవాదములలో పరోపకార పాండిత్యమే పరోపదేశ పాండిత్యమునకంటె మిన్నయైనదని,

ద్వితీయము భిన్నమైనది, కంఠశోష తప్ప, మరే ఫల మియ్యఁజాలదని నిరూపింపఁబడిన తరువాత రాజా సదస్సును తగినరీతి సన్మానించి పంపి చాలించి అంతఃపురములోనికిఁ బోవనున్నప్పుడు కూర్ముఁడాతని సమీపించి వేదోక్త విధానమున రాజు నాశీర్వదించెను. రాజా కూర్ముని పాదరముగా బలుకరించి, వచ్చినకార్య మేమని యడిగెను. అప్పుడు కూర్ముఁడు "రాజా! మీకీర్తి విని మిమ్ము దర్శింప కుతూహలమున వచ్చితిని. ప్రస్తుతము నేను నా తండ్రియస్థికలతో గంగాయాత్రకు బయలు దేరి పోవుచున్నాను. గర్భవతియైన నా భార్య, పంచవర్ష ప్రాయుఁడైన కుమారుఁడు దూరము నడువలేక యున్నారు. కావున నేను కాశికి పోయి గంగాస్నాన మాడి తండ్రి అస్థులను గంగలో కలిపి వచ్చు వఱకు నా భార్యాపుత్త్రిలను తాము కాపాడవలయునని ప్రార్థించుటకై వచ్చిఁనాడ" నన విని రాజు సంతోషించి నీవంటి యుత్తమున కుపకార మొనర్చుట నా యదృష్టమని తలంతును. కావున నీ ఆలుబిడ్డలను మా రాణివాసమున విడిచి నీవు సుఖముగా పోయి రమ్ము" అనఁగా కూర్ముఁడు మిక్కిలి సంతోషించి రాజునకుఁ దన కృతజ్ఞత దెలుపుకొని భార్యాపుత్త్రిలను రాజు చెప్పినట్లు రాణివాసమున విడిచి తాను కాశీప్రయాణమును సాగించెను.

తొండమానుఁ డా యాత్రికుని భార్యను బిడ్డను ఒక సురక్షిత ప్రాసాదమున, సమస్త సౌకర్యములు గలిగించి అందు విడియింపఁజేసి, తగినవారిని వా భవనరక్షకులుగా నియమించెను. ఆయమ తన కుమారునితో నా భవనమున సుఖముగా జీవించుచుండెను. లోపలికి ఈఁగనైనా బోనియ్యక కావలివారు గనిపెట్టియుండిరి. తొండమానుఁ డాయమ వృత్తాంతము మును క్రమముగా మఱచిపోయెను. ఇట్లారు మాసములకు నెక్కువగా జరిగిపోయినది. భవనములోని వారి యోగక్షేమముల నెవ్వరు విచారింప లేదు.

ఇట్లొక వత్సరము గడువ కూర్ముఁడు తన తీర్థయాత్రాకార్యములన్నియు ముగించుకొని, తొండమానుని గని, తన భార్యాపుత్త్రిల విచారించెను. అప్పు డా కూర్ముని వృత్తాంత మాకళింతకు రాఁగా, ఆతని కేమి [illegible]

మిచ్చుటా యని, కొంతవడి యాలోచించి, "అయ్యా! నీ భార్య సకాలమున ఆడుబిడ్డను గనినది. ప్రస్తుతము నీ భార్యాపుత్త్రిలు, మా వారితో కలిసి నిన్ననే వేంకటాచలపతి దర్శనార్థము వేంకటాచలమునకు పోయియున్నారు. త్వరలో రాఁగలరు. వచ్చినదే తడవుగ నీకు వర్తమాన మంపుదును. అంతవరకు మీరు మా సత్రమున బసచేసి మేము పంపు పదార్థములతో నిష్టమైన వంటకములఁ జేసికొని భుజించుచు సుఖముగ నుండుఁ"డని, తగిన సేవకుల కాతని కార్య మప్పగించి సత్రమున కంపెను.

కూర్ముఁడు వెడలిపోయిన తరువాత తొండమానుఁడు తన కుమారుని బిలచి, ప్రత్యేక భవనమందుంచిన కూర్ముని కుటుంబిని, బిడ్డల విషయము చూచిరమ్మని పంపెను. రాజపుత్త్రిఁ డటకు పోయి చూడ, అందు వా రెవ్వరు లేరు. వారి అస్థులు మాత్ర ముండుటనుగని ఆవిషయము తండ్రితో చెప్పెను. అది విని అతఁడు మిక్కిలి భీతిజెంది కుమారునితో వేంకటాచలమునకుఁ బోయి, శ్రీవేంకటేశ్వరుని గాంచి, ఆతనిపాదముచెంత సాగిలఁబడి దుఃఖింపసాగెను. వేంకటాచలపతి, వాని దుఃఖకారణ మెఱింగి, "రాజా! ఎంత పాప మొనర్చితివి నీ వివేక మేమైనది? ఆశ్రయ మిచ్చిన వారిని అనాథులఁ జేసితివి. నీకంటె క్రూరకర్ముఁ డొకఁ డుండునే? ఎంత రాజసము. నా భక్తుఁడు దారిద్ర్య దౌర్భాగ్యముల ననుభవించుట నే సహింపలేను. నీకు నా యం దెక్కువ భక్తి యున్నను, మహాపాతక మొనర్చితివి. మీ అన్న నాకెంతో మహోపకారము చేసెను. నీవు నాకుఁ దగిన నిలయము నిర్మించితివి. నాకు మీయందుఁగల బంధువాత్సల్యమున మృతుల బ్రతికించెదను. ఈ కలియుగమున నాకు, మహాపాతకులైన వారికిని, పాపవిమోచనము గలిగించితి నన్న కీర్తి గలుగుగాక! కావున, రాజా! నీ పుత్త్రిని బంపి ఆ మృతుల అస్థికల వెంటనే తెప్పింపుము" నా విని తొండమానుడు సుతుని పనుచుటయు, నాతఁడు క్షణములో నా మృతుల అస్థుల నొక వస్త్రమున మూటగట్టి పల్లకిలోఁబెట్టి బోయలచే వేంకటాచలమందలి తండ్రికి చేర్పించెను. తొండమానుఁడా విషయము వేంకటాచలపతికి నివేదించగా, వెంటనే శ్రీనివాసుఁడా యస్థులమూటఁ గొని స్వామిపుష్కరిణికిఁ దూర్పునఁగల పాండవ తీర్థమునం దొక ప్రక్కనున్న

మడుగులో కంఠదఘ్నముగ నిలచి, సమీపమందలి గట్టునఁగల ఒక బండపై నాశల్యముల నుంచి, తన యంజలితో నా అస్థులపై జలములఁ జల్లెను. వెంటనే కూర్ముని భార్యాపుత్త్రులు సజీవులైరి. అప్పు డుప్పరమునుండి పూలవాన కురిసెను. అప్పటినుండి పాండవతీర్థమునకు అస్థితీర్థ మని ప్రసిద్ధనామము గలిగెను. దేవతలు గూడ ఆ తీర్థమహిమను గొనియాడిరి.

తరువాత శ్రీనివాసుఁడు తొండమానునితో "రాజా! నీ కవస రోచితమైన ప్రత్యుపకార మొనర్చితిని. ఇదిమొదలు నే నర్చా మూర్తిగా ఈ కలికాలాంతం వరకు నిలచియుండి నే నన్యవాణిచేతనే మాట్లాడుచు భక్తుల రక్షించుచుందును. నీవును వీరిని గొనిపోయి కూర్మున కప్పఁ జెప్పుము. ఇఁక నీ రాజ్యమును సుఖముగా పాలించుకొనుము" అని చెప్పి పంపివేసి తా నానందనిలయముఁ బ్రవేశించెను.

తొండమానుఁడు కూర్మునకు నతని వారిని అప్పగించెను. కూర్ముఁడు సంతోషించి, తన భార్యను ఇంతకాల మెండు నెట్లుంటివని రాజు నెదుటనే యడుగ నామె, దేవమాయవలన శ్రీ వేంకటాచలపతి ఉదరమందుండి చిత్రవిచిత్రమైన లోకవిస్తరణములను, బ్రహ్మాదిదేవతలను, లోకాలోకములను, సప్తసాగరములను, కులపర్వతములను, మహానదీనదంబులను, మహారణ్యా ములను జూచితి ననఁగా, కూర్ముఁడు తనకంటె తన భార్యయే ధన్యురాలని సంభావించెను. తొండమానుని వేంకటేశ్వరభక్తిని సంస్తుతించి, తనవారితో స్వక్షేత్రముఁ జేరి సుఖముగా నుండెను.

## 32. తొండమానుఁడు మోక్షము పొందుట:

తొండమానుఁడు శ్రీనివాసుని యనుగ్రహమునకు మహాత్మ్యమునకు ఉప్పొంగిపోయినను, తన దూరదృష్టిలేమికి శ్రీనివాసుని ఆగ్రహమునకుఁ బాత్రుఁడైనందుకు చాల చింతించి, ఎటులైన శ్రీనివాసుని యనుగ్రహము సంపాదింప తలంపు గలిగి, అంగిరసుఁ డాదిగాఁగల మహర్షులను బిలి పించి శ్రీనివాసుని అనుగ్రహముపొందుటకు తా నేమి చేయవలయునో తెల్పుఁడని కోరెను. అప్పు డా మహర్షులు ఆలోచించి, విష్ణుదేవునకు

మిక్కిలిప్రియమైన తులసితో నిత్యము వైకుంఠవాసునకు సహస్రనామార్చన చేసిన శ్రీనివాసుని యనుగ్రహము తప్పక కల్గునని చెప్పఁగా, తొండ మానుఁడు సువర్ణ తులసీదళముల సహస్రనామార్చనము, వైఖానసులచే నిత్యము శ్రీవేంకటేశ్వరునకుఁ గావించుచుండెను. ఇట్లు కొన్ని మాసములు గడచినను వేంకటేశ్వరుఁడు తొండమానునియెడ ప్రసన్నుఁడు కాలేదు. అందుచే తొండమానుఁ డొకనాఁడు శ్రీనివాసునితో, "స్వామీ! నా తప్పులు క్షమింపుము. వరదాతలలో నీవు శ్రేష్ఠుఁడవు. కావున భక్తుఁడనగు నన్ను కురుణించుము" అన ఆకాశభాషణ మిట్లు వినఁబడుచుండెను. "నా యందత్యంత భక్తి ప్రపత్తులుఁ గలవారు పెక్కుంద్రు గలరు. కాని నీవలె ఘోరఘాతుక మొనర్చిన వా రొక్కరును లేరు. నీ పాపము నిన్ను వదలదు. కాని ఆకాశరాజు పై నాకుఁగల కృతజ్ఞతాభావంబున వారిని బ్రతికించితిని; లేకున్న" అనునంతలో నా రాజులోనున్న రాజసము "శ్రీనివాసా! తానెంతవాఁడైనను పరుల కొనరించిన ఉపకారమును తానెట్టి మూఢుఁడైనను ప్రకటించుకొనఁడు. నీ యందు భక్తిభావము గల నావం టివాఁడు మూఁడులోకములందును లేదు. నీ భక్తులలో నే నగ్రగణ్యుఁడను విషయము నీవు మరువరానిది. భక్తుల నాదరించుటలో నీ వగ్రగణ్యుఁడ వనుట లోకవిదితము" అని దర్పంబునఁ బలికి, తన సువర్ణ తులసీదళార్చన తాను చేయుచునే యుండెను.

శ్రీనివాసుఁ డాతని అహంకార మడంప యత్నించుచునేయుండెను. ఒకనాఁడు తొండమానుఁడు తొండమనాఁడులో నిర్మించిన శ్రీ వేంక టేశ్వరాలయమందలి స్వామిని సువర్ణదళములతో అర్చనచేయుచుండ, ఆ సువర్ణతులసీదళముల మధ్య అత్యంతాకర్షణీయమైన మృణ్మయ తులసీ దళము లొ శ్రీనివాసుని పాదకమలములందు లగ్నమైయుండుటఁ గాంచి తొండమానుఁడు తనపై వేంకటాచలపతికి కోపము శాంతించలేదని తలఁచి, తనలోనున్న తమము నడంప పరిశుద్ధుఁడై "త్రిలోకవాసా! వైకుంఠనాథా! శ్రీవేంకటాచలపతీ! భక్త సంరక్షకా! పాపవిదూర! అనాథనాథా! శ్రీనివాసా! నీ పాద సేవకుఁడను మీచరణంబులే శరణములు. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" నిన్నే నమ్మిన నన్ను ఉపేక్షసేయఁ దగునా!

స్వామీ నన్ను తృణీకరింపక పూర్వానుగ్రహము పరిపూర్ణముగఁ జూపి, నా సువర్ణ తులసీదళముల తృణీకరింపఁ జాలు మృణ్మయ తులసీదళములచేఁ బూజించిన ఆ భక్త శిఖామణి యెవరు? ఎచ్చటనున్నాఁడు? తెలియఁ జెప్పి న న్ననుగ్రహింపఁ బ్రార్థించుచున్నాఁడ" అన విని శ్రీనివాసుఁడు "రాజా! నన్నింతకాలముగాఁ దెలిసియుండియే, నన్ను గ్రహింప లేకున్నావు. రాగ ద్వేషములేని వ్యక్తి నా కత్యంతప్రియుఁడు. రారాజైనను, భిక్షుకుఁడైనను, సర్వప్రాణులందు సమత్వముగలిగి, మనోవాక్కాయకర్మంబుల దోష మొన ర్పక, ఉన్నదానితో సంతృప్తిఁజెంది నన్నే నమ్మికొని, సేవించు నా భక్తుఁడే నా కత్యంత ముఖ్యుఁడు. అతఁ డేమి సమర్పించిన, అద్దానినిఁ బ్రీతితో స్వీకరింతును. అట్టి భక్తు లెందరోగలరు.

ఈ తొండమనాటికి ఉత్తరమున యోజనదూరమున ఒకనొక కుగ్రా మమున భీముఁడను కులాలుఁ డొకండు గలఁడు. అతని భార్య తమాలిని. ఆ బీదదంపతులు ఐశ్వర్యానంద భోగములఁ గోరరు. కాయకష్టమున లభించిన గంజినే మహాప్రసాదముగ నత్యంతభక్తి భావంబున నా కర్పిం పనిదే తాము భుజింపరు. ఆ భక్తుఁడు తనవృత్తిలో అందెవేసిన చేయి. అందుచే రమ్యములైన మృణ్మయతులసీ దళములతో నిత్యము నన్ను పూజించుచున్నాఁడు. అతఁ డర్పించిన మృణ్మయ తులసీ దళములనే నే నాప్యాయముగ గ్రహించుట నీవు చూడఁగల్గితివి." నా విని తొండమానుఁ డా నాటిపూజ సమాప్తి గావించి భీముని చూడవలయు ననెడి అభిలాష తనను వేగిరింప, రాజలాంఛ నాదుల విడచి, సామాన్యుని వలె పాదచారియై కులాలుఁడున్న గ్రామమునకు బయలుదేరిపోయి ఆ గ్రామమును తెలిసి, భీముని గూర్చి విచారించి మురికివాడలో నొక మూలనున్న భీముని నివాసము చేరునంతలో తొండమానుఁడు మూర్ఛితుఁడై క్రిందపడెను. సమీపమున నున్న భీముఁడు పరుగున వచ్చి రాజును జూచి, భార్యచే ముంతలో చల్లనినీరము తెప్పించి, రాజుముఖము మెల్లఁగకడిగి కొంత జలము త్రావించెను. కొంత తెలివిగలిగిన రాజు "భీముఁ డెవఁడు? ఆ పరమభాగవతుని పాదములకు నమస్కరింప వలయు" ననుచుండ, వేంకటాచలపతి వారియెదుట ప్రత్యక్షమై నిలుచుండెను.

అప్పుడు భీముఁడు "స్వామీ! శ్రీనివాసా! ఇదే నా నమస్కారము. తమ కేమియు సమర్పింపఁ జాలని వాఁడను. గజేంద్రునివలె 'నీవే తప్ప నితఃపరం బెఱుఁగ' నా మూఢభక్తి తమకింత ఆనందదాయకమైనదని నే నెఱుఁగ" ననుచుండ, భీముని భార్య తమాలిని, శ్రీనివాసునకు సాష్టాంగదండ ప్రణామ మొనర్చి, లేచి, గోవిందా! భక్త వత్సలా! అనాథనాథా! వైకుంఠవాసా! మమ్మనుగ్రహించితివి. పూజాక్రమంబు లెఱుంగని నీచులము. పేదలము. మా బుద్ధి ఎల్లప్పుడు నీయందే లీనమైవున్నది. మా స్వల్పపూజకు సంతోషించి మాకు దర్శనభాగ్య మిచ్చితివి. ఈ నాఁడు మా యింట మా వంటకమును తృప్తిగా భుజించి మమ్మనుగ్రహింపఁ బ్రార్థించుచున్నా" మనగా, వేంకటాచలపతి, "అమ్మా! తమాలినీ! ఈనాఁడు మీవంటకము నా కమృతము. నీవు పెట్టిన భోజనము సంతోషమున భుజింతును" అనుచు భక్తవత్సలుఁడు లక్ష్మీ పద్మావతులతోఁ గూడ ఆ పవిత్రకులాల దంపతులు వడ్డించిన వంటకముల భుజించెను. దేవత లందఱు శ్రీవేంకటేశుని పెక్కు విధముల స్తుతించిరి. దేవదుందుభులు మ్రోగెను. పూలవాన కురిసినది. ఇంతలో నొక దివ్యవిమాన మట వచ్చిదిగినది. శ్రీనివాసుఁడు తన ఆభరణములను దివ్యవస్త్రమును భీమున కిచ్చెను. అతని దేవేరు లిరువురు తమ భూషణముల మాలినికి అలంకరించిరి. కులాల దంపతులు శ్రీనివాసునకు నమస్కరించి, ఆజ్ఞ గొని విమానమెక్కి వైకుంఠమున కేగిరి.

ఇదియంతయు గాంచిన తొండమానుఁడు భగవంతుని సర్వోత్త మోత్తమమైన దివ్యగుణ మెట్టిదో తెలిసికొని, తన రాజస, తామస గుణ ప్రభావముల వీడి, "మాధవా! సర్వేశ్వరా! భక్తవత్సలా! ముల్లోకముల నాకంటె మించిన భక్తుఁడు నీకు లేఁడని, అజ్ఞానాహంకారమున నే నవివ నా వాగ్దోషమును క్షమింపుము. నా రాజ్యమందే నా సమీపముననే తమ కత్యంతప్రీతిపాత్రుని చూచితిని. ఆ కులాల దంపతులు నాకు జ్ఞానోదయమును గలిగించిరి, ఇఁక నాకును సద్గతి గలిగించి రక్షింపు" మని ప్రార్థించెను. తొండమానుఁడు అజ్ఞానాహం కార ముక్తుఁ డయ్యె నని తలంచి శ్రీనివాసుఁ డాతనియందు బంధు వాత్సల్యమునకంటె భక్త శిఖామణి యను భావమునే చూపెను. అనంతరము తొండమానుఁడు స్వామిపుష్కరిణిలో స్నానమాడి,

శ్రీనివాసుని స్తుతించి, దేహము విడిచి, ఆ పరమాత్మ యనుగ్రహమున ముక్తిఁ జెందెను-- అని పురాణవ్యాఖ్యాత సూతుఁడు శౌనకాది మహర్షులకు వరాహ, భవిష్యోత్తర, స్కాంద మాదిగాఁగల పురాణాంతర్గత శ్రీనివాసుని కలియుగ లీలావిలాసంబులు వివరించి సంతుష్టులను జేసెను.

ఏవం హరిస్తత్ర చరిత్ర మద్భుతం
కుర్వన్ జగన్మాత్ర సమన్వితో గిరౌ,
ఆస్తే జగత్యాం చ సురౌఘ పూజితో
దద ద్యథేష్టం చ మనోరథాన్ సతామ్.

శ్రీకృష్ణార్పణమస్తు

# పర్యాలోచనము

* * *

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి.

పవిత్రమైన వేంకటాచల క్షేత్రమునకు సమమైన క్షేత్రము బ్రహ్మాండ గోళమున లేదు. శ్రీవేంకటాచలపతితో సమమైన దైవము భూతకాలమున లేదు. భవిష్యత్కాలమున ఉండబోడని భావము.

కృత, త్రేతా, ద్వాపర, కలియుగంబులు పర్యాయముగ వచ్చుచుఁ బోవుచుండినను వేంకటాచల క్షేత్రమునకు శ్రీవేంకటేశ్వర స్వామికి ఇఁక సమముండు ననుట కల్ల.

మానవుల సర్వపాపముల హరించి ఐశ్వర్యామృతముల నియ్యఁ గలది వేంకటాచలము. అందు పవిత్ర, ప్రసిద్ధతీర్థములు మహిమోన్నతము లైనవి ఎన్నియో గలవు. అవి యన్నియు కలియుగ మానవుల పాపముల హరించి వారిని పవిత్రులఁ జేయుటకే ఏర్పడినవి. వేంకటాచలమున ఆనందనిలయ ఆలయమున బంగారు విమానము క్రింద లక్ష్మి పద్మావతుల వక్షఃస్థలమున ధరించి అర్చామూర్తిగా భక్తులకు దర్శనమిచ్చుచు వారివారి కోర్కెల సిద్ధింపఁజేయు వేంకటాచలపతివంటి భగవానుఁడు ఈ జగంబున లేఁడనుట తిరుమల శ్రీనివాసుని దర్శించిన ప్రతిభక్తునకు సువిదితము.

కలియుగమందు జనులు పాపకార్యములం దాసక్తులై పాప పంకిల మగ్నులై నశింతురని మున్నుగాఁ దెలిపిన వైకుంఠవాసుఁడు వైకుంఠమం దలి క్రీడాద్రిని వేంకటాచలముగ సువర్ణముఖీనది ఉత్తరదిశ గరుడునిచే స్థాపింపఁ జేసెనని పురాణవాక్యము. భృగుమహర్షి కారణమున లక్ష్మీదేవి కొల్హాపుర మేగుట విష్ణువు వేంకటాచలమున వల్మీక మందుండుట జరిగినది. "అదియంతా మన మేలు కొరకే" కలి పీడాపరిహారార్థము

భగవంతుఁ డట్లు అవతరింపవలసి వచ్చినది. అది యాతనికి భక్తులయందు గల వాత్సల్యము. భక్తరక్షణాసక్తుఁడైన భగవంతుఁడు భక్తరక్షణకై ఏమైన చేయఁగలఁడు. ఉక్కుస్తంభమున నరసింహుఁడై ఉద్భవించుట, గోవర్ధనగిరిని చిటికెనవ్రేలితో పైకెత్తుట మున్నగు కార్యములెన్నింటినో యొనర్చి, భక్త సంరక్షణ చేసియున్నాఁడు. అట్లే పతితుల పావనులచేయు తలంపున వేంకటాచల క్షేత్రమున విష్ణువు శ్రీవేంకటేశ్వరుఁడై వెలసియున్నాఁ డనుట సర్వసమ్మత మైనది.

ఓల్గానదీతీరము నుండి వచ్చి గంగాసింధునదులమైదానముల నివాస మేర్పఱచుకొనిన ఆ పుణ్యులు, మహనీయులు నిస్స్వార్థ పరులు. 'సర్వే జనా స్సుఖినో భవంతు' అని దేవుని ప్రార్థించిన త్రికాలవేదులు. అట్టివారు రచించిన శాస్త్రపురాణాది మహత్తరమైన గ్రంథములు మనకు జ్ఞానజ్యోతులు. ఆ గ్రంథములు మనకు అత్యంత ప్రామాణికములు. వానిని మనము అనుసరించినప్పుడే వారు రచించి యిచ్చిన సుధర్మపథము మన కనుభూతమై యుండును. ప్రపంచమునందలి సర్వజనులయందు సమత్వము గలిగి సోదరభావ మేర్పడి కలిబాధల నెదుర్కొనఁ గలిగినప్పుడే మానవ జీవితము సఫలము కాఁ గలదు. అట్టిప్రథితపథము ప్రబోధించినవారే మన ఆచార్యత్రయము.

భారతీయసంస్కృతి ప్రాచీనకాలమునుండి కులమతభేదముల పాటింపక లోకులందఱు భగవంతుని బిడ్డలు, వారు ప్రపంచమందెచ్చట, నే మూలనున్నను అతఁడు వారి వారి యభీష్టముల తీర్చుచు అందఱను రక్షించుచున్నాఁ డనుట సత్యసమ్మతము. లోకసమ్మతమైన సత్యమును ఆచరించి ప్రచారము చేయుట విజ్ఞుల ధర్మము. ఆ ధర్మ మాచరించుటయే అత్యున్నతమైన సింధుధర్మమో, హిందూధర్మమో కానిందు, ఆ ధర్మాచరణ ప్రతి భారతీయుని బాధ్యతగా భావింపవలసి ఉన్నది. అందులకు తొలి సాధనములే తీర్థక్షేత్రయాత్రలు. ప్రపంచమందలి దివ్యక్షేత్రములకు

మకుటాయమానము తిరుమలక్షేత్రము. విష్ణువు వైకుంఠమును వీడి భూలోకమందలి వేంకటాచలమునకు వచ్చుటకు భగవంతుఁడు వేదవతికి తా నిచ్చినమాట నెరవేర్చుట ముఖ్యము. ఆకాశరాజునకు వేదవతి, పద్మావతిగా లభించి శ్రీనివాసుని పెండ్లి యాడినది. ఆనాటి నారాయణపురము నేటికిని నారాయణవనముగా చిత్తూరుజిల్లా పుత్తూరునకు సమీపమున కలదు. ఆకాశరాజు తమ్ముఁడు తొండమానుని తొండమనాఁడు రాజ్యము శ్రీకాళహస్తికి సమీపమున తొండమనాఁడను గ్రామముగ నేటికిని కలదు. తొండమానుఁడు గట్టించిన మహలు వేంకటాచలపతి ఆలయము ఇప్పుడచ్చట లేకున్నను పూర్వ మచ్చట కోట ఉండెననుటకు నేటికిని అచ్చట కందకములు (అగడ్తలు) సాక్ష్యమిచ్చుచున్నవి.

తొండమానుఁడు శ్రీనివాసునికి తగిన ఆలయ నిర్మాణము చేయించెను. ఆ ఆలయమునకే ఆనందనిలయమని ప్రసిద్ధి. ఆ యానంద నిలయమున శ్రీనివాసుఁడు లక్ష్మీపద్మావతులను చెరియొక వైపున తన వక్షఃస్థలమున ధరించి అర్చామూర్తిగా నిలిచి కుడిహస్తముతో తనను సేవింప వచ్చిన వారికి తన పాదములే ఆశ్రయమని చూపుచు, ఎడమ హస్తమును తన కటియందుంచుకొని తన్నాశ్రయించిన భక్తులకు సంసారసాగరము కటిదఘ్నము మాత్రమే యను భావమును హస్తవిన్యాసమున చూపుచు వేరొక యుగ్మంబున శంఖచక్రములతో దివ్యదర్శన మిచ్చుచున్నాఁడు. ఆ దర్శనము క్షణమైనను భక్తునికి సంతృప్తిని, పరమానందమును గలిగించుట భక్తులకు అనుభవములోని విషయమే.

తొలుత శ్రీనివాసుని అనుమతిప్రకారము బ్రహ్మ జరిపించిన బ్రహ్మోత్సవమునాటి క్రమపద్ధతి ప్రకారము నేటికి జరుగుచున్నది. ఆ వేంకటాచలపతి ఆనందనిలయమే భూలోక వైకుంఠము. ఆలనాటి నుండి స్వామివారికి ప్రతిదినము ఉషఃకాలమున సుప్రభాతము మొదలు రాత్రి ఏకాంతసేవ వరకు వైఖానసార్చకులచే పూజలు జరిపింపఁబడుచున్నవి. శ్రీనివాసుఁడు నిత్యము

వేలకొలఁది భక్తులకు దర్శనమిచ్చి వారి మొర లాలించి, అనుగ్రహించి పంపుచున్నాఁడు. అందుచేతనే ప్రపంచ మంతటను తిరుమల క్షేత్రమును గూర్చి భక్తు లెందరో శ్రద్ధాభక్తులతో తెలిసికొను చున్నారు.

వేంకటాచలమున శ్రీనివాసుఁడు లక్ష్మీపద్మావతులు తన వక్షఃస్థల మున ఇరుగడల నిలుపుకొనినట్లు పురాణమునందుఁ గలదు. కాని పద్మావతి అమ్మవారు తిరుపతికి సమీపమందలి తిరుచానూరిలో దివ్యాల యమందుండుటకు పూర్వికు లొక అనుశ్రుతిని చెప్పుచుండిరి.

శ్రీ వేంకటాచలపతి పద్మావతిని వివాహమాడిన పిదప నూతన దంప తులు పర్వతారోహణ చేయరాదని అగస్త్యుఁడు చెప్పఁగా శ్రీనివాసుఁ డా మహర్షి ఆశ్రమమునకు సమీపముననే ఒక ఆశ్రమము నిర్మించుకొని అట ఆరుమాసము లుండెను. అదియే నేటి శ్రీనివాస మంగాపురము. అచ్చట వేంకటేశ్వర ఆలయము ప్రసిద్ధముగఁ గలదు. ఒకనాఁడు శ్రీవేంకటాచల పతి తాను పద్మావతితో వేంకటాచలమునకుఁ బోవుచున్నట్లు మామగారైన ఆకాశరాజునకు తెలియఁజేసెను. అంత ఆకాశరాజు తన కొమార్తె పద్మావతికి సకలవిధములైన వస్త్రాభరణాదులతో పాటు దాసదాసీజనంబు లను సకలసంభారములను, పదార్థములను, పాల నేతి కుండలను, వానిఁ గొనిపోవుటకు తగిన భారవాహకులను నియమించి వేంకటాచలమునకు పద్మావతివెంట ఆ సారె వస్తువులఁగొనిపోవ సేవకుల కాజ్ఞచేసెను. అట్లా సవివారు వేంకటాచలపతి పద్మావతుల వెనువెంట కొండనెక్కి పోవుచుండ అవ్వకోన సమీపించుచున్నప్పుడు శ్రీనివాసుఁడు 'సంభార వస్తువులతో కటివేఁపాకు తెచ్చితివా?" అని పద్మావతి నడుగఁగా ఆమె లేదనుటను విని శ్రీనివాసుఁడు "కటివేఁపాకు తిరుమల కొండలో నెచ్చట దొరకదు. కావున ఈ సారె సామాగ్రి నిచ్చటనే పెట్టి కటివేఁపాకు ఎండించి మూటగట్టి తెచ్చుట ఆవశ్యకము కావున పరివారముతో నీవు కొండదిగిపోయి కటివేఁపాకు కొనిరమ్ము" అని యాజ్ఞచేసెను. ఆ ప్రకారము కటివేఁపాకునకై పద్మావతి కొంతకాలము తిరుచానూరిలో నిలువవలసియుండె ననుట జనశ్రుతి.

ఈ కారణమున పద్మావతి తిరుచానూరిలో ప్రత్యేకముగా నుండుట సంభవించినదంట. ఆమెకు ప్రతిసంవత్సరము కార్తికమాసమున ఉత్సవము జరుగుచున్నది. భక్తులెందరో ఉత్సవమునకు వచ్చుచుందురు. తిరుమలలో శ్రీ వేంకటేశుని దర్శించిన భక్తులు తిరుచానూరునకు పోయి పద్మావతిని దర్శించుచున్నారు. అచ్చటనున్న పుష్కరిణిలో పద్మావతి అమ్మవారికి కార్తిక మాసంబున ప్రతి సంవత్సరము తెప్పతిరునాళ్ళు జరుగుచున్నది.

ప్రపంచము నలుమూలలనుండి తిరుమల తిరుపతికి యాత్ర సేయు వేలకొలంది భక్తులకు దేవస్థానము అధికారులు తగిన సదుపాయము లెన్నింటినో సమకూర్చుచున్నారు. యాత్రికులు చైతన్యవంతులుగా ఉత్సాహవంతులుగా ప్రశాంతచిత్తులుగా నుండుటకు వేదాంతోపన్యాసములు, హిందూ ధర్మోద్ధరణకై ఉపన్యాసములు, అన్నమాచార్య సంకీర్తనలు, సాంఘిక కార్యక్రమములు నిత్యనూతనముగ జరిపించుచున్నారు. యాత్రికుల కొఱకు ఆధ్యాత్మికగ్రంథము లెన్నింటినో ప్రచురించుచున్నారు. దేవస్థానము వారి మాసపత్రిక 'సప్తగిరి' పెక్కు భాషలలో జ్ఞాన ప్రబోధకముగా వెలువడు చున్నది. ఏ కోణమునుండి చూచినను తిరుమల తిరుపతి క్షేత్రము ప్రపంచప్రజల శాంతి, సహన, సౌజన్య, సౌందర్యములకు, సమైక్యతకు పరమాత్మునియందు ఆస్తికత్వమున కనుగుణముగా అనుభవముగ నున్న మహాక్షేత్రము. ఇది ప్రపంచమున రెండవ స్థానముగ గుర్తింపఁబడి నది. ఈ క్షేత్రకార్యనిర్వహణశాఖ, ప్రజలలో సాంఘిక సంస్కృతులకు సంబంధించిన శాఖ. ప్రజల కాస్తికత్వము పెంపొందుటకు నలసిన విజ్ఞానమును సమకూర్చుటకు ప్రచురణ శాఖ, ప్రబోధశాఖలు నిత్యము తమ తమ కార్యముల నెఱవేర్చుచునే యున్నవి. ఈ శాఖలు యాత్రికులను ఉత్తేజితులను జేయుటచేతనే తిరుమల తిరుపతి క్షేత్రము ప్రపంచమున రెండవ క్షేత్రముగ గుర్తింప బడినదనుట ప్రతి భారతీయునికి గర్వకారణము.

తిరుమల తిరుపతికి యాత్రసేయు భక్తజనంబులు వేంకటాచలపతిని వేంకటేశా, ఏడుకొండలవాడా, వేంకటరమణా, గోవిందా, ఆపద్బాంధవా,

అనాథరక్షకా, వడ్డికాసులవాడా, బాలాజీ, అండవనే-" ఇత్యాది నామంబులఁ బిలుచుచు వచ్చుచుండుట వారి పాప పరిహారమునకు కారణముగా నున్న దనుట సత్యము. భగవానుని నామస్మరణము ఈ కలియుగమున ముక్తికి సాధనము.

శ్రియః కాన్తాయ కల్యాణ నిధయే నిధయేఽర్థినామ్,
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.
శ్రీ వేంకటాద్రి నిలయః కమలాకాముకః పుమాన్,
అభంగుర విభూతిర్న స్తరంగయతు మంగళమ్.

గద్యము: ఇది శ్రీ శ్రీనివాస పాదారవింద ధ్యానామృతాస్వాదన మత్తచిత్త, శ్రీజ్ఞానప్రసూనాంబికా సహిత శ్రీ కాళహస్తీశ్వరానుగ్రహలబ్ధ కవితా విశేష, శ్రీకైలాసవాస చింతనామానససరోవర విహార మరాళ మిథున లక్ష్మార్య లక్ష్మీనరసాంబా ద్వితీయ పుత్త్రి శ్రీవేంకట కృష్ణార్యానుజ, బుధవిధేయ గుంటకట్ల తిరువేంగడసూరి నామధేయ ప్రణీతంబైన తిరుమల తిరుపతి క్షేత్రము మాహాత్మ్యమను కావ్యమున ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

శ్రీ శ్రీనివాసార్పణమస్తు.

ఇద్ది శ్రీ వేంకటేశుని యిద్ధ చరిత
విన్నఁ జదివిన, వ్రాసిన విజ్ఞులకును
తమ మనోరథము ఫలవంతమగు! నిహ ప
రంబుల సుఖము ముక్తియు లభ్యమగును!

* * *